: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com

తాడేపల్లిగూడెం

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

22-9-2025
సోమవారం
సంపుటి: 31
సంచిక: 232
పేజీలు: 10+4
వెల: 6.50






# దసరాతో జిఎస్టీ పండుగ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** జిఎస్టీ సంస్కరణలు, శ్లాబుల హేతుబద్ధీకరణతో దేశాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని నేటినుంచి రెండు పండుగలు ప్రనారంభం అవుతున్నాయని, ఒకటి శరన్నవరాత్రి వేడుకలు అయితే మరోటి జిఎస్టీ పొదుపు పండుగ అని పేర్కొన్నారు. దేశప్రజలకు నవరాత్రి శుభాకాంక్షలు తెలిపిన >>2

## తాజా సంస్కరణలతో అభివృద్ధి మరింత వేగిరం

## ఆత్మనిర్భర్ వైపు ఇది మరో ముందడుగు: ప్రధాని మోడీ

### పేదలు, మధ్యతరగతి ప్రజలలో హర్షాతిరేకాలు

## కత్తెర నుంచి కారుదాకా అన్నీ మరింత అందుబాటులోకి

## 90శాతం వస్తువులు 5% శ్లాబ్‌లోకి

## 33 ప్రాణాధార ఔషధాలపై జిఎస్టీ రద్దు

'నాగరిక్ దేవో భవ' నినాదంతో ముందడుగు: పిఎం

## రెండు శ్లాబ్‌ల పన్ను నేటి నుంచే అమలు

### 5 శాతం

- సాధారణ ఔషధాలు, వైద్యపరికరాలు డయాగ్నస్టిక్ కిట్లు,
- నెయ్యి, పన్నీరు, బట్టర్, నమ్‌కీన్; కెచప్, జామ్, డ్రైఫ్రూట్స్, కాఫీ, ఐస్‌క్రీమ్స్,
- హెయిరాయిల్, టాయిలెట్ సోప్‌బార్‌లు, షాంపూలు, టూట్‌బ్రష్‌లు, టూత్‌పేస్ట్, టాల్కమ్‌పౌడర్, ఫేస్‌పౌడర్, షేవింగ్‌క్రీమ్, ఆఫ్టర్‌షేవ్‌లోషన్, మినరల్ వాటర్, తదితరాలు.
- హెల్త్‌క్లబ్బులు, సెలూన్లు, ఫిట్‌నెస్ సెంటర్లు, యోగా కేంద్రాలు
- రూ.2500 కంటే తక్కువ ఉన్న కాటన్ క్విల్ట్స్,కండెన్స్‌డ్ మిల్క్, కాటన్,జూట్ చేతిసంచులు, వెదురు ఫర్నిచర్

### 18 శాతం

- సిమెంట్, కాంక్రీట్ ఉత్పత్తులు, చిన్నకార్లు, డిష్ వాషర్లు, ఎయిర్ కండిషనర్లు టెలివిజన్‌సెట్లు, సెట్‌టాప్ బాక్స్‌లు,
- 122 సిసి కంటే తక్కువ ఉన్న పెట్రోలు, డీజిల్, ఎల్పీజి, సిఎన్‌జి కార్లు, 1500 సిసికంటే తక్కువ ఇంజిన్ ఉన్న డీజిల్ వాహనాలు
- బొగ్గు, లిగ్నైట్, పీట్ రూ.2500 కంటే ఎక్కువ ఉన్న దుస్తులు, ప్రత్యేక రకాల కాగితం, పేపర్‌బోర్డు

సిగరెట్లు, పాన్‌మసాలాలు బీడీ, చుట్ట, పొగాకుసాయంతో చేసే ఉత్పత్తులపై 40శాతం పన్ను



## పాక్‌కు మరో దెబ్బ

# భారత్ అఖండ విజయం

## ఆసియా కప్‌లో పాక్‌పై ఆరు వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు

### రాణించిన అభిషేక్, గిల్, తిలక్

### అభిషేక్ శర్మకే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్

### పాకిస్తాన్ 171-1, భారత్ 174-4

**దుబాయ్, సెప్టెంబర్ 21:** ఆసియా కప్‌లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగింది. లీగ్ దశలో పాక్‌ను చిత్తు చేసిన భారత్ సూపర్-4లోనూ ప్రత్యర్థిని మరోమారు మట్టికరిపించింది. పాక్‌పై 6 వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. ఇక మ్యాచ్ విషయానికొస్తే... టాస్ గెలిచిన సూర్యకుమార్ సేన బౌలింగ్ ఎంచుకోగా, పాకిస్తాన్ తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. అంతకు ముందు ఆసియా కప్ లీగ్ దశలో పాకిస్థాన్‌ను తక్కువకే కట్టడి చేసిన భారత బౌలర్లు సూపర్ 4లో తేలిపోయారు. ప్రధాన పేసర్ బుమ్రా, పాండ్యా.. కుల్దీప్ యాదవ్ విఫలమవ్వగా.. ఫీల్డింగ్ >>2


తెలుగులో ప్రచురించిన కొత్త జిఎస్టీ జీవోల పత్రాలను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

# ఇవి చారిత్రక సంస్కరణలు : సిఎం చంద్రబాబు

## తెలుగులో ప్రచురించిన జిఎస్టీ జీవోల ప్రతులను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆరోగ్యకర, సుసంపన్న, సంతోషకరమైన సమాజాన్ని సాధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు జిఎస్టీ 2 సంస్కరణలు దోహదం చేస్తాయని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన 10 మార్గదర్శక సూత్రాలైన పేదరికం లేని సమాజం, జనాభా నిర్వహణ మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యం ఉపాధి, నీటి భద్రత, రైతు సంక్షేమం, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ అభివృద్ధి, ఇంధన వినియోగంలో ఖర్చు తగ్గింపు, చేతి వృత్తుల అభివృద్ధి, స్వచ్ఛ ఆంధ్ర, డీప్ టెక్ సాంకేతికత వినియోగం వంటి సూత్రాల సాధనకు ఈ సంస్కరణలు తోడ్పడతాయని తెలిపారు. జిఎస్టీ 2.0కు సంబంధించి తెలుగులో విడుదల చేసిన అన్ని జీవోల బుక్‌లెట్‌ను ఆదివారం ఉండవల్లి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి, సంబంధిత అధికారులతో రాష్ట్ర పన్నుల విధానం పై సమీక్షించారు.రాష్ట్ర పన్నులు మరియు వాణిజ్య పన్నుల చీఫ్ కమిషనర్ బాబు. ఏ సమీక్ష వివరాలను మీడియాకు తెలిపారు.ఈ అంశాలను పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో వాణిజ్య పన్నుల శాఖ మొదటిసారిగా జీవోలను తెలుగులో విడుదల చేయడం ప్రారంభించింది. దీనివల్ల సామాన్య ప్రజలు ఇప్పుడు పన్నులకు సంబంధించిన జీవోలను తమ మాతృభాష తెలుగులో సులభంగా చదువుకోగలుగుతారు. ఏదైనా విషయాన్ని మాతృభాషలో చదివినప్పుడు అది >>2

## ప్రధాని స్వదేశీ నినాదానికి పూర్తి మద్దతు


### -సిఎం చంద్రబాబు

**విజయవాడ సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** నెక్స్ట్ జెన్ జిఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధాని నరేంద్ర మోడీకి సిఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని ఉత్తేజపూరిత ప్రసంగం చేశారంటూ చంద్రబాబు అన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తెచ్చిన ఈ సంస్కరణలుతో జిఎస్టీ బచత్ ఉత్సవ్ వేడుకలు ప్రారంభించడం సంతోషించదగిన పరిణామమని సిఎం అభిప్రాయపడ్డారు. జిఎస్టీ పన్ను శ్లాబులను 5, 18 శాతానికి మాత్రమే పరిమితం చేయడంతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని సిఎం ఎక్స్‌లో పేర్కొన్నారు. 99 శాతం నిత్యావసర వస్తువులు 5 శాతం పరిధిలోకి వస్తాయని దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలు, రైతులు, మహిళలు, యువతకు ఈ సంస్కరణల వల్ల లబ్ధి చేకూరుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. పన్ను విధానాన్ని సరళతరం చేయడంతో ఖర్చులు తగ్గుతాయని.. పెట్టుబడులను ఆకర్షించేలా సంస్కరణలను రూపకల్పన చేశారన్నారు. ప్రధాన మంత్రి చెప్పిన నాగరిక్ దేవో భవ అనే మంత్రం దేశ ప్రజలకు అందించే ఓ బహుమతి అని సీఎం అభివర్ణించారు.

## ఉత్తర బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం!

### భారీ వర్షసూచన

**విజయవాడ,సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మయన్మార్ దక్షిణ బంగ్లాదేశ్ తీరాలకు ఆనుకుని ఉన్న ఈశాన్య బంగాళాఖాతం మీదుగా సముద్ర మట్టానికి సగటున 5.8 కి.మీ ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రాబోయే 24 గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం.ఏర్పడే అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్25 నాటికి తూర్పుమధ్య, ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. ఇది పశ్చిమవాయువ్య దిశగా కదులుతూ సెప్టెంబర్ 26 దక్షిణ ఒడిశాఉత్తరాంధ్ర తీరాలకు ఆనుకుని వాయువ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ..వాయుగుండంగా.. బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 27 దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. దీని ప్రభావంతో గురు, శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.


మంత్రి నారాలోకేష్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న ఆర్డీటి నిర్వాహకులు మాంఛో ఫెర్రర్

# ఆర్డీటీ సేవలు యధాతథం

### కేంద్రంతో మాట్లాడుతున్నాం

### మానవత్వానికి చిరునామా మాంఛో ఫెర్రర్: మంత్రి లోకేష్

**అనంతపురం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త బ్యూరో:** ఆర్డిటి (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) అంటే ఒక స్వచ్ఛంద సంస్థ కాదు. లక్షలాది పేదల బతుకుల్లో వెలుగు నింపిన ఆశా కిరణం. ఆర్డీటీ వంటి మానవతా సంస్థకు తాత్కాలికంగా ఇబ్బందులు వచ్చాయి. వాటిని శాశ్వతంగా పరిష్కరించి ఆర్డీటీ సేవలు నిరంతరాయంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటాం" అని విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు మాంఛో ఫెర్రర్ ఆదివారం విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేష్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సేవలకు >>2

# 'మెప్మా'కు 9 స్కోచ్ అవార్డులు

### పట్టణ పేదరిక నిర్మూలన కృషిలో మెప్మా సరికొత్త రికార్డు

### ఢిల్లీలో అవార్డు అందుకొన్న మిషన్ డైరెక్టర్ భరత్

**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి చెందిన మెప్మా సంస్థకు 9 ప్రతిష్టాత్మక అవార్డులు వచ్చాయి. పేదరిక నిర్మూలనకు చేసిన విశేష కృషికి గాను ఈ అవార్డులు వరించాయి. మొత్తం 9 విభాగాల్లో అవార్డులురాగా దిల్లీలో జరిగిన కార్యక్రమంలో మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్ స్కోచ్ ప్లాటినం అవార్డులను స్వీకరించారు. మెప్మా సంస్థ పట్టణ పేదరిక నిర్మూలనకు చేపడుతున్న వినూత్న పథకాలకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందని ఆయన కొనియాడారు.

ఈ స్కోచ్ ప్లాటినం అవార్డు ఆంధ్రప్రదేశ్‌కు రావటం గర్వకారణమని తెలిపారు. పట్టణ అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వినూత్న మార్గాలను ఈ అవార్డు దేశానికి చాటిచెప్పిందని తేజ్ భరత్ అన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణ సహకారంతో ఈ 9 అవార్డులు కైవసం చేసుకోవడం సాధ్యపడిందని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007 జులైలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఏర్పాటైంది. నగరపాలిక, పురపాలికలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని మహిళలతో సంఘాలను ఏర్పాటు చేసి వారికి పొదుపుతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మరో విభాగంలో ఎపిఎస్ఆర్‌టిసి ప్రతిష్టాత్మక 'స్కోచ్ అవార్డ్' సాధించింది.


ఆదివారం న్యూఢిల్లీలో మెప్మా సంస్థ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డును స్వీకరిస్తున్న దృశ్యం

2025 ఏడాదికిగాను ప్రతిష్టాత్మకమైన 'స్కోచ్ అవార్డ్'ను ఆర్టీసీ కైవసం చేసుకుంది. డిజిటల్ టికెట్లు జారీ చేసే విధానం సమర్థంగా అమలు చేస్తున్నందుకు ఈ అవార్డు సాధించింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ వై. శ్రీనివాస రావు అవార్డు అందుకున్నారు. అవార్డు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆయన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. రెవెన్యూ శాఖకు 2 'స్కోచ్' అవార్డులు లభించాయి. ప్రజలకు రెవెన్యూశాఖ సేవలను చేరువ చేస్తూ, సులువుగా మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తోన్న కృషికి >>2

# ఇ-పంట ఆధారంగా ఉల్లి సాయం

## హెక్టారుకు రూ. 50 వేలు: సిఎం చంద్రబాబు

### 45 వేల ఎకరాల్లో రైతులకు లబ్ధి



**విజయవాడ,సెప్టెంబరు 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఉల్లి పంట ఏ దశలో ఉన్నా...'ఈ-పంట' ఆధారంగా ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దీంతో 45వేల ఎకరాల్లో ఉల్లి సాగు చేసిన రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఆర్థికంగా ప్రభుత్వానికి భారమైనా.. రైతుల శ్రేయస్సు కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మే ప్రభుత్వం మాది.రైతుకు మద్దతు ధర విషయంలో ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలుస్తున్నాం.సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు వర్షాల కారణంగా ఉల్లి ధర తగ్గి రైతులు నష్టపోతుంటే వారిని ఆదుకోవడానికి కీలక నిర్ణయం తీసుకున్నాం'అని చంద్రబాబు వివరించారు. '15 నెలల కూటమి ప్రభుత్వంలో రైతులకు అండగా ఉండే విషయంలో ఎప్పుడూ వేగంగానే స్పందించాం. పిఎం కిసాన్,అన్నదాత సుఖీభవ కింద రూ.3,200కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం. మామిడి రైతులు మద్దతు ధర కోల్పోతే రూ.260 కోట్లు ఇచ్చి ఆదుకున్నాం. హెచ్‌డి పొగాకు ధర పతనమైతే రూ.271 కోట్లు ఖర్చు చేసి భరోసా కల్పించాం.కిలో కోకో గింజలకు రూ.50 చొప్పున చెల్లించాం. దీనికి రూ.12 కోట్లు ఖర్చయ్యింది. టమాటా రైతులు నష్టపోకుండా మద్దతు ధర లభించేలా మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించాం. ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలుకు రూ.13,500 కోట్లు ఖర్చుచేశాం అని చంద్రబాబు తెలిపారు. ఆర్థికంగా ప్రభుత్వంపై భారమైనా, రైతుల శ్రేయస్సు కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా నిర్ణయం తీసుకున్నమని సిఎం చంద్రబాబు తెలిపారు. రైతుల సమస్యలపై చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు గుర్తు చేశారు. అన్నదాతలు ఎవరూ ఏ విషయం లోనూ ఆందోళన చెందవద్దని సూచించారు. మెరుగైన సాగు పద్ధతులు పాటిస్తూ, డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తూ ప్రభుత్వ సూచనలు అనుసరిస్తూ, సాగును లాభదాయకం చేసుకుందామని పిలుపునిచ్చారు. రైతుకు మద్దతు ధర విషయంలో ఏ సమస్య వచ్చినా, ఒకడుగు ముందుకు వేసి వారికి అండగా నిలుస్తున్నామని చంద్రబాబు తేల్చిచెప్పారు.

# నేడు మహారాజా అగ్రసేన్ జయంతి మహోత్సవం

### హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో వేడుకకు భారీ ఏర్పాట్లు

### హాజరుకానున్న తెలంగాణ సిఎం రేవంత్, డిసిఎం భట్టి, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అగర్వాల్, అగ్రసేన్ సమాజం నేతలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు21:** మహారాజ అగ్రసేన్ 5149వ జయంతి మహోత్సవం జరుగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్, రోడ్ నెంబర్12, మహారాజా అగ్రసేన్ చౌక్‌లో అగ్రసేన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.. అఖిల భారత వైశ్ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ, వార్త సిఎండి డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథితులుగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ >>2



ఆదివారం జబల్పూర్‌లో ప్రధాని మోడీ పుట్టిన రోజు సందర్భంగా 'నమో యువ రన్' నిర్వహించిన యువకులు

# వచ్చే దశాబ్దానికి కూడా మోడీయే ప్రధాని

## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కూడా ప్రధానిమోడీయే ప్రధాని అభ్యర్థి అవుతారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేసారు. దేశంలో ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా ప్రధాని పోస్టుకు ఖాళీలేదని, అది మోడీకే కేటాయించినట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. ప్రధాని మోడీతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజలతో మమేకం అయ్యే విధంగా ఆయనకున్న వైవిధ్యభరితమైన తీరు మరెవ్వరికి లేదని, సంక్షోభాల్లో ఆయన కీలక నిర్ణయాలు తీసుకోగలుగుతారన్నారు.ప్రధాని నాయకత్వంలో ఎలాంటి మార్పు ఉండబోదని, 2029, 2034 ఆపై ఐదేళ్లలో కూడా ప్రధానిగా మోడీయే నిలుస్తారని రక్షణ మంత్రిరాజ్‌నాథ్ స్పష్టంచేసారు.

## వారం - వర్జ్యం

22-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఆశ్వయుజ మాసం, దక్షిణాయనం
శరద్ ఋతువు, శుక్లపక్షం
శు.పాడ్యమి రా.2.57
ఉత్తరఫల్గుణి ఉ.11.26
వర్జ్యం : రా.8.37-రా.10.22
దు.ము.12.25-1.14, 2)మ.2.51-3.40
రాహుకాలం - ఉ.7.30-9.00

## వారఫలం

**మేషం :** ముఖ్యమైన విషయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

**వృషభం:** దూరప్రాంత ప్రయోజనాలు కలిసి వస్తాయి. కొంతలో కొంత ఋణాలను తీరుస్తారు.

**మిథునం:**కారణం లేని చికాకు మీకు కొంత ఇబ్బంది కలిగిస్తుంది. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కర్కాటకం:**ఇంటా బయటా అనుకూల వాతావరణం నెలకొంటుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**సింహం:**కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం చెప్పదగిన సూచన.

**తుల :** ముఖ్య పత్రములను పోగొట్టుకొనడం లేదా కనపడకపోవటం వంటి సమస్యలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించండి.

**వృశ్చికం:**బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**ధనుస్సు:** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు చేస్తారు.

**మకరం:** సోదరుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కుంభం:** ఓర్పుతో, నేర్పుతో అందరితో కలిసి పనిచేసే ధోరణి వలన విజయాల దిశగా పయనిస్తారు.

**మీనం :** మాటల వరకే కోపమును పరిమితము చేయటం వలన లాభపడతారు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి పడిన చోట సహాయ కార్యక్రమాలు చేపట్టిన సిబ్బంది

# జిఎస్టీ పండుగ

>> ప్రధానిమోడీ తన సందేశంలో భారత్ ఇపుడు ఆత్మనిర్భర్‌భారత్‌వైపు ముందడుగు వేసిందని అన్నారు. ఆదివారం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. నేటినుంచి భారతదేశం జీఎస్టీ సంస్కరణలు అమలవుతున్నాయని, పండుగల సందర్భంగా జీఎస్టీ హేతుబద్ధీకరణతో పండుగ ప్రారంభం అవుతుందని అన్నారు. మీ పొదుపు కార్యాచరణ మరింతపెరుగుతుందని, మీకు ఇష్టమైన వస్తువులన్నింటినీ మరింత సులువుగా కొనుగోలుచేసేలోగులుగుతారని అన్నారు. సామాన్య, మధ్యతరగతి, యువత, మహిళలు, ట్రేడర్లు ఈ జీఎస్టీ హేతుబద్ధీకరణ కొత్తతరం జీఎస్టీ సంస్కరణలతో మరింత లబ్ధిపొందుతారని చెప్పారు. జీఎస్టీతో తెచ్చిన సంస్కరణలు భారత్ అభివృద్ధి గతిని మార్చివేస్తాయని, సరళీకృత వాణిజ్యంతో ఎక్కువ పెట్టుబడులు ఆకర్షించగలుగుతామని చెప్పారు దేశ అభివృద్ధిలో ప్రతి రాష్ట్రం కూడా సమానభాగస్వామి అవుతుందని అన్నారు. 2017లోనే తమ ప్రభుత్వం చరిత్రాత్మక ముందడుగువేసి జీఎస్టీని అమలులోకి తెచ్చిందని గుర్తుచేసారు. దశాబ్దాలుగా దేశ ప్రజలు విభిన్న పన్నులతో సతమతం అయ్యేవారని, ఏకీకృత పన్ను విధానంకింద జాతీయస్థు దృష్ట్యా ఒకే పన్ను వ్యవస్థను అమలులోకి తెచ్చామని దేశంలో పన్నులభారంలో జరిగిన అతిపెద్ద సంస్కరణ ఉన్నదంటే అది జీఎస్టీయేనని ప్రధాని అన్నారు. సంస్కరణలు అనేవి నిరంతర ప్రక్రియ అని సమయానుకూలంగా దేశానికి మార్పులు భావితరం సంస్కరణలు కూడా అవసరమన్నారు. దేశంలో ప్రస్తుత సంస్కరణలు పరిగణనలోనికి తీసుకునే జీఎస్టీ వ్యవస్థలో కొత్త సంస్కరణలు తెచ్చామన్నారు. జీఎస్టీ 2.0లో 12,28 శ్లాబులను తొలగించామని, ఐదు, 18శాతం శ్లాబులను మాత్రమే కొనసాగిస్తున్నట్లు మోడీ చెప్పారు. ఈ రెండుశ్లాబులతోనే మొత్తం అన్ని సేవలు, ఉత్పత్తులు కవర్ అవుతాయని, విలాస వస్తువులకోసం మాత్రమే 40శాతం శ్లాబ్ కొనసాగించామని అన్నారు 12శాతం పరిధిలో ఉన్న ఉత్పత్తుల్లో 99శాతం ఐదుశాతం పరిధిలోకి వచ్చాయని, జీఎస్టీతో వన్‌నేషన్ వన్ ట్యాక్స్ చిరకాల స్వప్నం సాకారం అయిందన్నారు. నాగరిక్ దేవోభవ నినాదంతో ముందుకెళుతున్నామని, నిత్యజీవితంలో అనేక విదేశీ వస్తువులు వాడకాన్ని తగ్గించాలని, భారత్‌లో తయారైన వస్తువులే మనం వాడాలని, ప్రజలంతా స్వదేశీ మంత్రి పాటించాలనికోరారు. చిన్న, సూక్ష్మ, కుటీర, ఎంఎస్‌ఎంఈలు అయినా భారతదేశం శ్రేయస్సు శిఖరాగ్రంలో ఉన్నప్పుడు చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవన్నారు. భారతదేశ తయారీ, నాణ్యత ఒకప్పుడు ఉన్నతంగా ఉండేవని.. మనం ఆ వైభవాన్ని తిరిగి పొందాలన్నారు. మన పరిశ్రమలు ప్రపంచంలోనే అత్యుత్తమంగా ఉండాలని మనం ఉత్పత్తి చేసేది ప్రపంచంలోని అత్యుత్తమ ప్రమాణాలను అధిగమించాలని మోదీ పిలుపు నిచ్చారు. మన ఉత్పత్తులు భారతదేశ, ప్రపంచ ప్రతిష్టను పెంచాలన్నారు. గత 11 సంవత్సరాలలో 250 మిలియన్ల మంది ప్రజలు పేదరికాన్ని అధిగమించారని ఒక పెద్ద నవ మధ్యతరగతి ఉద్భవించిందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. 1.2 మిలియన్ల వరకు ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపులు మధ్యతరగతికి గణనీయమైన ఉపశమనాన్ని అందించాయని పేర్కొన్నారు. జీఎస్టీ సంస్కరణలు గృహనిర్మాణం, స్కూటర్లు, కార్లు, హోటల్స్ వంటి ఖర్చులను తగ్గిస్తాయన్నారు. పేదలు, నవమధ్యతరగతి రెండింతలు ప్రయోజనం పొందుతారని ఆయన తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పన్నులు, టోల్‌ల సంక్లిష్టతల నుంచి విముక్తి కంపెనీలకు ఒక సవాలుగా ఉందన్నారు. నిత్యావసర వస్తువులయిన కాఫీ, నెయ్యి, బిస్కట్లు, నూనెలు వంటివి నేటినుంచి మరింత చౌకగా అందుబాటులోకి వస్తాయన్నారు. కొత్తకార్లు కూడా చౌకధరలకే వస్తాయన్నారు. ఆరోగ్యబీమా వంటివాటిప్రీమియంలపై జీఎస్టీ కూడా తగ్గుతుందన్నారు. దీనివల్ల ప్రజల్లో వినిమయ సామర్థ్యం పెరుగుతుందని, పండుగ సీజన్లలో కొనుగోళ్లు మరింత పెరుగుతాయన్నారు. జీఎస్టీ హేతుబద్ధీకరణకు సంబంధించి రెండుశ్లాబులు తెచ్చినతర్వాత ఈ ఏడాది తొలినాళ్లలోనే ఆదాయపు పన్ను కొత్త శ్లాబులు కూడా ప్రకటించిన అంశాన్ని గుర్తుచేసారు. 12 లక్షలవరకూ కొత్త ఆదాయపు పన్నుపరిమితిని పెంచినట్లు ప్రధాని గుర్తుచేసారు. ఆదాయపు పనున్న సేవింగ్స్, జిఎస్టీలో పొదుపు వంటి కీలక నిర్ణయాలతో దేశంలో ఒక్క ఏడాదిలోనే రూ.2.5 లక్షలకోట్లు ప్రజాధనం పొదుపుచేయగలిగినట్లు ప్రధాని చెప్పారు. ప్రతి ఇంట్లో స్వదేశి చిహ్నామే ఉండాలని, ప్రతి షాపును కూడా స్వదేశీ ఉత్పత్తులతోనే ఏర్పాటుచేయాలని కోరారు. నేను స్వదేశీ వస్తువులనే కొంటాను, స్వదేశీ వస్తువులనే అమ్ముతానని గర్వంగా చెప్పాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ప్రతిపౌరుడు స్వదేశీ ప్రతిజ్ఞ తీసుకోవాలని ప్రధాని దేశప్రజలకు విజ్ఞప్తిచేసారు.

# 'మెప్మా'కు 9 స్కోచ్ అవార్డులు

>> ఫలితం దక్కింది. 2025కి గాను రాష్ట్ర రెవెన్యూ శాఖ 2 ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డులు సాధించింది. కూటమి ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చాక ప్రజల భూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమల్లోకి తెచ్చింది. ఆర్డీవో, ఆ స్థాయికి ఆన్‌లైన్‌లో సమస్యలను పంపి సత్వరమే ఆమోదించేలా సరికొత్త వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఆన్ లైన్ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు చేసి రెవెన్యూ కోర్టు వ్యవహారాలను డిజిటలైజ్ చేసి కేసుల పరిష్కారంలో పారదర్శకత, వేగం పెంచింది. రెవెన్యూ కోర్టుల్లో కేసుల పెండెన్సీని తగ్గించింది. పౌరులకు సలభమైన యాక్సిస్ కల్పించారు. అందువల్ల దేశంలోనే అత్యుత్తమ వ్యవస్థగా గుర్తించి స్కోచ్ అవార్డుకు ఎంపిక చేశారు. రీ సర్వే 2.0 ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా భూములను సహేతుక విధానాల్లో సర్వే చేసి తప్పులకు తావు లేకుండా, సరికొత్త సాంకేతికత వినియోగించి ట్యాంపరింగ్‌కు తావులేని సమగ్రమైన భూ రికార్డులను తయారు చేస్తోండగా దీనికి మరో స్కాచ్ అవార్డు దక్కింది. అలాగే వివిధ విభాగాల్లో అవార్డులు దక్కాయి. తాజాగా దిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక స్కోచ్ సమ్మిట్‌లో ఈ అవార్డులను సంబంధిత అధికారులు అందుకున్నారు

**స్వర్ణ నారావారిపల్లి ప్రాజెక్టుకు ఏడాది లోపే స్కోచ్ గోల్డెన్ అవార్డు అభినందనీయం: చంద్రబాబు**

మొదటి సంవత్సరం లోనే ప్రతిష్టాత్మకమైన స్కోచ్ గోల్డెన్ అవార్డు అందుకోవడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ విశిష్ట విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రాజెక్ట్‌లో భాగంగా 1,600 కుటుంబాలు సౌరశక్తితో విద్యుత్‌ను వినియోగిస్తుండగా,ఏటా 4.69 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అవుతోందని వెల్లడించారు. ఫలితంగా కర్బన ఉద్గారాలను తగ్గించగలిగారని వివరించారు. హరిత స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా ఈ ప్రాజెక్ట్ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

# ఆర్డీటీ సేవలు యధాతథం

>> కలిగిన అంతరాయం తదనంతర పరిణా మాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి అన్ని మార్గాలు చూస్తున్నామని, కేంద్రంతో ఇదివరకే సంప్రదించా మని, ఆర్డీటీ సేవలు కొనసాగించేందుకు అవసర మైన అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. తెలుగుప్రజలతో ఆత్మీయ, మానవతా సేవా బంధం పెనవేసుకున్న ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. తెలుగు ప్రజల పట్ల, తెలుగు భాష పట్ల ఎనలేని ప్రేమ చూపించే మాంఛో ఫెర్రర్ అంటే తనకు ఎంతో అభిమానం అని లోకేష్ తెలి పారు. ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందాల్సి న పనిలేదని, విద్య, వైద్య, ఉపాధి, ఆర్థిక రంగాల ద్వారా ప్రజలకు ఆర్డీటీ అందించిన అన్ని సేవలూ యథాతథంగా త్వరలోనే కొనసాగించేందుకు పూర్తి స్థాయిలో ప్రయత్నం చేస్తున్నామని మంత్రి నారాలోకేష్ భరోసా ఇచ్చారు.

# భారత్ అఖండ విజయం

>> లోనూ నాలుగు క్యాచ్‌లు జారవిడవడంతో పాక్ బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకున్నారు. ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్(58) అర్ధ శతకంతో చెలరేగగా.. సయీం ఆయూబ్(21) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే.. శివం దూబే రెండు వికెట్లు తీసి పాక్ జోరుకు కళ్లెం వేశాడు. ఆఖర్లో సల్మాన్ అఘా (17 నాటౌట్) ధనాధన్ ఆడగా పాక్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది.ఆసియాకప్ లీగ్ దశలో భారత బౌలర్లను ఎదుర్కోలేక చాపచుట్టేసిన పాకిస్థాన్ ఈసారి గొప్పగా పోరాడింది. సూపర్ 4 మ్యాచ్‌లో టాస్ ఓడిన పాకిస్థాన్ బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో భారీ స్కోర్ చేసింది. 21 పరుగులకే తొలి వికెట్ కోల్పోయిన ఆ తర్వాత పుంజుకుంది. భారత బౌలర్ల, ఫీల్డర్ల వైఫల్యంతో ధనాధన్ ఆడిన సయీం ఆయూబ్ (21), ఓపెనర్ షహిబ్జద ఫర్హాన్ (58) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. పవర్ ప్లేలో ఇద్దరూ బౌండరీలతో రెచ్చిపోగా వికెట్ నష్టానికి 55 రన్స్ చేసింది పాక్. ఆ తర్వాత కూడా ఈ జోడీ దూకుడు పెంచుతూ పోయింది. హుస్సేన్ టలాట్ 10, మొహమ్మద్ నవాజ్ 21, సల్మాన్ అఘా 17, ఫహీమ్ అష్రాఫ్ 20 పరుగులు చేయడంతో పాకిస్తాన్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. భారత బౌలర్లలో శివమ్ దూబే 2 వికెట్లు తీయగా, హార్దిక్ పాండ్యా, కుల్‌దీప్ యాదవ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం పాక్ నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యఛేదనలో భారత ఓపెనర్లు దంచేశారు. తొలి ఓవర్ నుంచే ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ బౌండరీలతో హోరెత్తించారు. ఇద్దరూ సమయోచితంగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులెత్తించారు. పవర్ ప్లేలో భారత్ వికెట్ కోల్పోకుండా 69 పరుగులు చేసింది. మంచి దూకుడు మీదున్న సమయంలో ఫహీమ్ అష్రాఫ్ బౌలింగ్‌లో శుభ్‌మన్ గిల్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 28 బంతులెదుర్కొని 8 ఫోర్లతో గిల్ 47 పరుగులు చేశాడు. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ క్రీజులో నిలబడలేకపోయాడు. మూడు బంతులెదుర్కొని పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. అనంతరం తిలక్ వర్మతో కలిసి జట్టు ఇన్నింగ్స్ చక్కదిద్దుతున్న సమయంలోనే అబ్రార్ అహ్మద్ బౌలింగ్ అభిషేక్ శర్మ బంతిని బౌండరీ తరలించే యత్నంలో హారీష్ రవూఫ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. సంజూ శాంసన్ 13 పరుగులు చేసి వెనుదిరిగాడు. హార్దిక్ పాండ్యా(7)తో కలిసి తిలక్ వర్మ (19) జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఇంకా ఏడు బంతులుండగానే, భారత్ 4 వికెట్లు కోల్పోయి 172 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. భారత బ్యాటర్లలో అభిషేక్ వర్మ (74), శుభ్‌మన్ గిల్ (47), తిలక్ వర్మ 30, సంజూ శాంసన్ 13, హార్దిక్ పాండ్యా 7 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో హారిస్ రవూఫ్ 2 వికెట్లు పడగొట్టగా, అబ్రార్ అహ్మద్, ఫహీమ్ అష్రాఫ్ చెరో వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించిన అభిషేక్ వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# ఐఐటి ఖరగ్‌పూర్‌లో పిహెచ్‌డి విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** దేశంలోని అత్యుత్తమ ఐఐటిలో ఒకటిగా పేరొందిన ఖరగ్ పూర్ ఐఐటిలో పిహెచ్‌డి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖరత్‌పూర్ ఐఐటిలో ఈ ఏడాది ఇది ఐదవ ఘటన కావడం గమనార్హం. వివరాలు ఇలావున్నాయి. ఝూర్కండ్‌కు చెందిన హర్ష్‌కుమార్ పాండే (27) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పిహెచ్‌డి చేస్తున్నాడు. పాండే హాస్టల్‌లో వుంటున్నాడు. శనివారం మధ్యాహ్నం అతని తండ్రి మనోజ్ కుమార్ పాండే కుమారుడికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆయన సెక్యూరిటీ అధికారులకు సమాచారం అందించి వాకబు చేయమని కోరాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఐఐటి సెక్యూరిటీ అధికారులు అంబేద్కర్ హాల్‌లోని హర్ష్ కుమార్ గదికి రాగా లోపలి నుంచి గడియ పెట్టి వుంది. దీంతో సెక్యూరిటీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చిన తరువాత అందరు కలిసి తలుపులను బద్దలు కొట్టగా హర్ష్ కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వున్నాడు. వెంటనేహర్ష్ కుమార్‌ను క్యాంపస్‌లోని బిసిరాయ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను చని పోయినట్లు వైద్యులు తెలిపారు.

# ఇవి చారిత్రక సంస్కరణలు

>> సులభంగా హృదయానికి చేరుతుందని చెప్పడం తెలిసిందే. వాణిజ్య పన్నుల శాఖ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయాన్ని ఇరు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది వ్యాపారులు, అకౌంటెంట్లు, అధికారులు, ఉద్యోగులు, నిపుణులు అభినందించారని జీఎస్టీ 2.0 అనేది కేవలం పన్ను సంస్కరణ కాదు.. ఇది ప్రజలే ముందు అనే విధానం. ఇది ఖర్చులను తగ్గిస్తుంది, అనుసరించే విధానాన్ని సులభతరం చేయడంతోపాటు ప్రతి ఇంటిని, రైతులను, విద్యార్థు లను శక్తివంతం చేయడంతోపాటు వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ట్రాక్టర్ల నుండి పాఠ్యపుస్తకాలు, మందుల వరకు ఆదా చేసిన ప్రతి రూపాయి సుస్థిరాభివృద్ధికి దోహదపడుతుంది. ఇది కేవలం పన్ను సంస్కరణ కాదు ఇది ఒక మార్పు తెలిపారు సోమవారం ఉదయం తొలిగంటల నుంచి పౌరసంబంధాలల్లోకి రానున్న జిఎస్టీ 2.0 నెక్స్ట్‌జెన్ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నాయి. ఈ సంస్కరణల ద్వారా అదనంగా దాదాపు ..2 లక్షల కోట్ల ప్రయోజనం లభిస్తుందని అంచనా. 'ప్రజలే ముఖ్యం' అనే విధానంతో తీసుకొచ్చిన ఈ కొత్త జిఎస్టీ విధానం ప్రతి ఇంటికీ, రైతులకు, విద్యార్థులకు, వివిధ రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రజలకు ఈ మార్పు వల్ల ..8,000 కోట్ల ప్రయోజనంలభించనుంది. వస్తువులపై జిఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలకు ధరల భారం తగ్గింది. వెన్న, నెయ్యి, పనీర్, సబ్బులు, షాంపూ, హెయిర్ ఆయిల్, ప్రాసెస్డ్ ఫుడ్, బిస్కెట్లు, కాఫీ వంటి వాటిపై పన్ను తగ్గింది. అలాగే, పాశ్చరైజ్డ్ పాలు, ప్యాకేజ్డ్ పనీర్, బ్రెడ్ వంటి వాటికి జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయింపు లభించింది. ద్విచక్ర వాహనాలు, చిన్న కార్లు, టివిలు, ఎసిలు, సిమెంట్ వంటి వాటిపై జిఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో మధ్యతరగతి వారికి పెద్ద ఊరట లభించింది.

**రాష్ట్రానికి దక్కనున్న ప్రయోజనాలు:**

ఆరోగ్యకర, సుసంపన్న, సంతోషకరమైన సమాజాన్ని సాధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు జిఎస్టీ 2 సంస్కరణలు దోహదం చేస్తాయి. ప్రభుత్వం నిర్దేశించిన 10 మార్గదర్శక సూత్రాలైన పేదరికం లేని సమాజం, జనాభా నిర్వహణ మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యం ఉపాధి, నీటి భద్రత, రైతు సంక్షేమం, ప్రపంచస్థాయి లాజిస్టిక్స్ అభివృద్ధి, ఇంధన వినియోగంలో ఖర్చు తగ్గింపు, చేతి వృత్తుల అభివృద్ధి, స్వచ్ఛ ఆంధ్ర, డీప్ టెక్ సాంకేతికత వినియోగం వంటి సూత్రాల సాధనకు ఈ సంస్కరణలు తోడ్పడతాయని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ బాబు ఏ ఆ ప్రకటనలో తెలిపారు.

# తెలుగురాష్ట్రాల గుండెలపై ఆల్మట్టి కుంపటి

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** ఆల్మట్టి ఎత్తు పెంపునకు కర్నాకట ప్రభుత్వం చేపడుతున్న ఎగువ కృష్ణ ప్రాజెక్టు ఫేజ్-3 వల్ల తెలుగురాష్ట్రాలు కరువు కోరల్లో విలవిలలాడే పరిస్థితి ఏర్పడబోతుంది.ఆల్మట్టి పెంపు వల్ల దిగువన ఉన్న తెలంగాణకు,ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుంది. చెన్నై తాగునీటి పథకంకి కూడా ప్రమాదం పొంచి ఉంది. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును ప్రస్తుత 519 మీటర్ల నుండి 524 మీటర్లకు పెంచడానికి సన్నద్ధమైందని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య చేసిన ప్రకటనలు తెలుగు రాష్ట్రాలలో ప్రకంపనలు రేపుతున్నాయి. భూసేకరణ కోసం 70,000 కోట్ల ఖర్చుచేసి 1.33 లక్షల ఎకరాల భూమిని సేకరించే ప్రతిపాదనను ఆమోదించడంతో తెలంగాణలో బిఆర్ఎస్,కాంగ్రెస్‌మధ్య రాజకీయ విమర్శలు ప్రతివిమర్శలు మొదలైనాయి. భారత రాష్ట్ర సమితి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలమట్టిపై మౌనం వహించడాన్ని ప్రశ్నించింది. ఎట్టకేలకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆల్మట్టిని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తామని ప్రకటించారు. ఆల్మట్టి ఎత్తుపెంపును మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్‌ను వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తును అనుమతించాలనే నిర్ణయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. ఆల్మట్టి ఎత్తు పెంపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యొక్క నదీతీర హక్కులకు శాశ్వతంగా హానికరం కాబట్టి స్టే ఆర్డర్ పొందింది. ఆల్మట్టి ఎత్తు పెంపు వివాదం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కర్ణాటక ప్రభుత్వం ఆనకట్ట ఎత్తును పెంచడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంపుదల వల్ల కర్ణాటక అదనంగా 100 టిఎంసి అదుగుల నీటిని నిల్వ చేసుకునేందుకు వీలు కలుగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌కారణంగా ఇప్పటికే ప్రతి వర్షాకాలం పశ్చిమ మహారాష్ట్రాలోని సాంగ్లీ,కొల్లాపూర్ జిల్లాలు ముంపుకు గురవడమే కాకుండా అనేక ఇబ్బందులు ఎదుర్కోవడం రివాజుగా మారింది.

# అగ్రసేన్ జయంతి మహోత్సవం

>> స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరవుతున్నారు. గౌరవ అతిథులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ,జూపల్లి కృష్ణారావు,డాక్టర్ డి.అనసూయ సీతక్క, గడ్డం వివేకానంద, ఎ.లక్ష్మణ్‌కుమార్,వాకిటి శ్రీహరి,టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొంటున్నారు. ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నగేందర్, మాజీ ఎంపీ,టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ గౌరవ అతిథులుగా హాజరవుతున్నారు. అగర్వాల్ సమాజ్, అగ్రసేన్ సమాజం వారు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. తరువాత అగ్రసేన్ కాశీలో భగవాన్ శివుడిని ప్రసన్నం చేసుకోవడానికి కఠిన తపస్సు చేశాడు. అగ్రసేన్ తపస్సుతో సంతోషించిన శివుడు, మహాలక్ష్మి దేవిని ఆరాధించమని సూచించాడు. అగ్రసేన్ మహాలక్ష్మి దేవిని ఆరాధించాడు. ఆమె ప్రత్యక్షమై, తన ప్రజల సంక్షేమం కోసం వ్యాపారాన్ని వృత్తిగా చేపట్టమని చెప్పింది. ఆమె అగ్రసేన్‌ను ఆశీర్వదించి, కొత్త రాజ్యాన్ని స్థాపించమని ఆదేశించింది. మహాలక్ష్మి ఆశీస్సులతో అగ్రసేన్ మహారాజు, రాణితో కలిసి దేశమంతా కొత్త రాజ్యానికి స్థలం వెతికేందుకు బయలుదేరారు. ఒక ప్రదేశంలో ఆయన పులి పిల్లలు మరియు తోడేళ్ల పిల్లలు కలసి ఆడుకుంటున్న దృశ్యాన్ని చూశాడు. దీనిని శుభసూచకంగా భావించి, ఆ ప్రాంతాన్ని వీరభూమి (వీరుల భూమి)గా గుర్తించి, అక్కడే రాజ్యం స్థాపించాడు. ఆ నగరానికి "అగ్రోహా" అని పేరు పెట్టారు. అగ్రోహా వ్యవసాయం, వ్యాపారంలో అభివృద్ధి చెందింది. మహారాజ అగ్రసేన్ తన ప్రజల శ్రేయస్సు కోసం అనేక యజ్ఞాలు చేశారు. ఆ రోజుల్లో యజ్ఞం చేయడం అనేది శ్రేయస్సుకు చిహ్నంగా భావించేవారు. అలాంటి ఒక యజ్ఞం జరుగుతున్నప్పుడు, బలి ఇవ్వడానికి తీసుకువచ్చిన ఒక గుర్రం యజ్ఞవేదిక దగ్గర నుండి తప్పించుకోవడానికి బాగా ప్రయత్నిస్తున్నది. దానిని గమనించిన మహారాజ అగ్రసేన్ కరుణతో నిండిపోయి, సిరి సంపదను మృగాల బలితోనే సాధించాలా అని ఆలోచించాడు. అహింస భావన మహారాజ అగ్రసేన్ మనసును బలంగా ఆకర్షించింది. ఈ విషయాన్ని ఆయన మంత్రులతో చర్చించాడు.మంత్రులు... మహారాజ అగ్రసేన్ అహింసను అవలంబిస్తే, పొరుగు రాజ్యాలు దీనిని బలహీనతగా భావించి అగ్రోహాపై దాడి చేయవచ్చు అని అన్నారు. దానికి మహారాజ అగ్రసేన్, అన్యాయం, హింసలను ఆపడం బలహీనత కాదని సమాధానమిచ్చి, తన రాజ్యంలో ఎలాంటి హింసా చాటువలు జరగకూడదని, జంతువులను చంపకూడదని ప్రకటించాడు. తర్వాత మహారాజ అగ్రసేన్ 18 మహా యజ్ఞాలు నిర్వహించాడు. ఆయన తన రాజ్యాన్ని 18 మంది కుమారులలో పంచి, వారి గురువుల పేర్ల ఆధారంగా 18 గోత్రాలను స్థాపించాడు. ఈ 18 గోత్రాలు భగవద్గీతలోని 18 అధ్యాయాల వలె వేర్వేరుగా ఉన్నా, మొత్తం కలసి ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. ఈ విధంగా అగ్రోహా బాగా అభివృద్ధి చెందింది. జీవితాంతంలో మహారాజ అగ్రసేన్ తన పెద్ద కుమారుడు విభును సింహాసనంపై కూర్చోబెట్టి తానే వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. అగ్రోహా సంపన్నత వల్ల పొరుగున ఉన్న రాజులకు అసూయ కలిగి వారు తరచూ దాడులు చేశారు. ఈ దాడుల వల్ల అగ్రోహాకు ఎన్నో సమస్యలు వచ్చాయి. క్రమంగా అగ్రోహా బలహీనమైంది. చివరికి ఒక పెద్ద అగ్ని ప్రమాదం నగరాన్ని ముంచేసింది. ఆ అగ్ని వల్ల ప్రజలు దేశమంతటా చెదరిపోయారు. నేటి రోజుల్లో ఈ వారిని అగర్వాళ్లు అని పిలుస్తారు. వీరు ఇప్పటికీ తమ 18 గోత్రాలను అలాగే కొనసాగిస్తూ, మహారాజ అగ్రసేన్ పేరు ప్రతిష్ఠలను నిలబెడుతున్నారు. మహారాజ అగ్రసేన్ బోధనల ప్రకారం అగర్వాళ్లు నేటికీ సామాజిక సేవలో అగ్రగాములుగా ఉన్నారు.

# హనుమకొండలో కాకతీయ నృత్య నాటకోత్సవాలు ప్రారంభం

**హన్మకొండ బ్యూరో, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** సెప్టెంబర్ 21.తెలంగాణ ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి రెండు రోజులపాటు కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న కాకతీయ నృత్య నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించగా, మంత్రులు జూపల్లి క్రిష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నాట్య గురు, అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య డాక్టర్ అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధ్యురాలు చాకలి ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం, ఓరుగల్లు చరిత్ర కాకతీయ వైభవం గుర్తు చేస్తూ రాణి రుద్రమ చారిత్రక నాటకం, ప్రజా సాహిత్య కళారూపాలు ప్రదర్శనలు నిర్వహించారు. డాక్టర్ అలేఖ్య పుంజాల నృత్య దర్శకత్వంలో 30 మంది కళాకారులు చాకలి ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ను కళ్ళ ముందుంచే ఈ నృత్య రూపకాన్ని డాక్టర్ వద్దేపల్లి కృష్ణ రచించగా సంగీత దర్శకుడు వి.బి. ఎస్.మురళి సంగీతం సమకూర్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా అలేఖ్య ప్రదర్శనను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్కతో పాటు శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,కేఆర్ నాగరాజు,గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాష్,వరంగల్ మేయర్ గుండు సధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులు పాల్గొని తిలకించారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కళాకారులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ,వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి హోటల్ హరిత కాకతీయ నందు స్వాగతం పలికిన వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య,నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ నగర సిపి సన్ ప్రీత్ సింగ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదివారం హన్మకొండలో కాకతీయ నాటకోత్సవాలు ప్రారంభించిన తెలంగాణ డి.సిఎం భట్టి విక్రమార్క తదితరులు

# మలయప్పస్వామి వాహనాలు ఊరేగే ఆలయ మాడవీధులు ఎంతో పవిత్రం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఏడుకొండల స్వామి కొలువైన ఆలయం చుట్టూ ఉన్న మాఢవీధులకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఆలయానికి చుట్టూ అర్చకులు నివసించే ఇళ్ళున్న వీధులను పవిత్రంగా భావించి తమిళంలో "మాడాం"అని పిలుస్తారు. అది మాఢవీధులుగా మారింది. ఒకప్పుడు తిరుమల ఆలయం చుట్టూ స్వామి వారు వాహనంలో ఊరేగడానికి సరియైన వీధులు లేవు. అందుచేత బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం కొండపై చేసినా వాహన సేవలు, ఊరేగింపులు తిరుచానూరులో జరిపే వారు. శ్రీరామానుజులు దేవాలయం చుట్టూ వీధులను ఏర్పాటుచేయించి స్వామివారు వీధుల్లో ఊరేగేందుకు చూశారు. ఆలయం చుట్టూ నాలుగు మాఢవీధులు నాలుగు వేదాలకు ప్రతీకలు. మాఢవీధుల్లో భక్తులు, టిటిడి అధికారులు ,సిబ్బంది ఒక్కరేమిటీ అందరూ పూర్తిగా పాదరక్షలు లేకుండా కనిపిస్తారు.

**తూర్పుమాఢవీధి:** ఆలయానికి తూర్పుముఖంగా ఉన్నదే తూర్పుమాఢవీధి. శ్రీవారి ఆలయం ముందునుండి పుష్కరిణి వరకు ఉండే వీధిని తూర్పుమాఢవీధిగా పిలుస్తారు. ఒకప్పుడు పుష్కరిణి గట్టుపై కూడా ఇళ్ళు ఉండేవట. ఈ వీధిలోనే స్వామివారి కొయ్యరథం కూడా ఉండేది. ఆలయానికి ఎదురుగా ఉన్న వీధిని సన్నిధివీధి, వేయికాళ్ళమండపం ఉండేవి. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చారిత్రాత్మక కట్టడం వేయికాళ్ళ మండపం తొలగించారు.


**2.దక్షిణమాఢవీధి:** ఈ వీధిలోనే తిరుమలనంబి గుడిఉంది. దీనిపక్కనే వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుండి గుడికి చేరే వంతెన క్రిందే ఒకప్పుడు గుర్రాలపాక ఉండేదట. కొండకు వచ్చిన రాజులు గుర్రాలను అక్కడే కట్టివేసేవారట. ఈ వీధి మొదట్లో ఆగ్నేయంలో ఊంజల్‌మండపం ఉంది. గతంలో స్వామివారికి ఊంజల్‌సేవ, సహస్రదీపాలంకార సేవలు ఈ మండపంలోనే జరిగేవి. ప్రతిరోజూ సాయంత్రం శ్రీనివాసుడు ఉభయనాంచారులతో ఈ మండపంలోనే ఊయల ఊగుతూ భక్తులకు కనువిందుచేస్తాడు.

**3.పడమరమాఢవీధి:** ఔ ఆలయానికి వెనుకవైపు ఉన్నదే పడమరమాఢవీధి. ఒకప్పుడు ఎన్నో మఠాలు, సత్రాలు ఉండేవి. ప్రస్తుతం తిరుమల చిన్నజీయర్‌స్వామి మఠం, కర్నాటక సత్రాలు ,కల్యాణమండపం, వసంతమండపం ఉన్నాయి. అనంతాళ్వారుతోట శ్రీవారి ఆలయానికి పడమరవైపు ఉంది.

**4.ఉత్తరమాఢవీధి:** స్వామి పుష్కరిణికి పడమటివైపు పాతపుష్కరిణి ఉండేది. అచ్యుతరాయులు 16వ శతాబ్ధంలో మళ్ళీ తవ్వించి "అచ్యుత రాయకోనేరు"అని పేరు మార్చాడని చెబుతారు. పుష్కరిణిగానే ప్రసిద్ధిచెందింది. ఉత్తరమాఢ వీధిలో ఉత్తరాధిమఠం, తిరుమలనంబి తోళపు కైంకర్యనిలయం, అమోబిలమఠం శ్రీవైఖానస అర్చకనిలయం ఉన్నాయి. ఆలయానికి ఉత్తరదిశలో వరాహస్వామి ఆలయం ఉంది. ఈ వీధిలోనే తాళ్ళపాకవారి ఇల్లుఉండేది. తాళ్లపాక వెంగమాంబ మొదట్లో ఈ ఇంటిలో నివసించేది. ఆమె సమాధి తరిగొండ బృందావనంగా మారింది. గోవిందుని ఆలయం చుట్టూ మాఢ వీధుల్లో చేసే ప్రదక్షిణ మహాప్రదక్షిణం అని పిలుస్తారు.

# తిరుమల సమాచారం

## పుష్పాలన్నీ దేవదేవుని పాద సేవకే



**తిరుమల,సెప్టెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ప్రతి చెట్టూ, ప్రతి రాయి, ప్రతి పుష్పం, లతలు తరులు ఒకటేమిటీ అన్ని ఆద్యంత దేవదేవుని సేవకే అన్నట్లు ముస్తాబవుతాయి. ఏడుకొండల వేంక టేశ్వరస్వామి భక్తజన ప్రియుడేకాదు, పుష్పాలంకారప్రియుడుకూడా. ఇలా వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల కొండపై సాలకట్లవార్షిక బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభమైంది. ఇందుకు తొలిఘట్టంగా మంగళ వారం (రేపు)రాత్రి అంకురార్పణ చేపట్టనున్నారు. ఆలయం పైభాగాన, పరిసరాల్లో, కల్యాణవేదిక ఉద్యానవనం ప్రాంతాల్లో పలు రకాల కళాకృ తులు, ఫల, పుష్ప కళాకృతులు తీర్చిదిద్దారు. స్వామివారి చెంత మేమూ సేవకులమేనంటూ ఆనందపరవశుల వుతున్నారు. దేవలోకంలో శ్రీమహావిష్ణువు కలియుగంలో శ్రీవేంకటేశ్వర స్వామి పుష్పాలతో ఆనందపరవశులవుతారు. అందుకే తిరుమలలో మహిళలు కూడా పుష్పాలు ధరించరాదనేది ఆచారం. ఒకటేమిటి భక్తులు భక్తిభావంతో తన్మయత్వం చెందేలా అద్భుతంగా ఏర్పాట్లు వున్నాయి.

## గొడుగుల ఊరేగింపులో కానుకలు ఇవ్వకండి: టిటిడి విజ్ఞప్తి



**తిరుమల,సెప్టెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామికి ఏటా జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 28వతేదీ రాత్రి గరుడవాహనసేవకు అలంకరించేందుకు చెన్నైనుండి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులా భక్తులు ఎలాంటి కానుకలు అందించరాదని టిటిడి విజ్ఞప్తి చేసింది. భక్తులు అందించే కానుకలు టిటిడికి చేరవని, కానుకలతో టిటిడికి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. తిరుమలేశుని బ్రహ్మోత్సవాల సమయంలో పలు హిందూ సంస్థలు చెన్నై నుండి గొడుగులు ఊరేగింపుగా తీసుకురావడం ఆనవాయితీ. ఈ గొడుగులు 27వతేదీ తిరుమలకు చేరుకుంటాయి. ఆదివారం ఉదయం గొడుగులు ఊరేగింపు చెన్నై నుండి మొదలైన సందర్భంలో టిటిడి విజ్ఞప్తి చేసింది.

## బ్రహ్మోత్సవాల సమయంలో కొండంతా మరింత పరిశుభ్రత

### రెండు బ్యాంక్‌లు క్లీనింగ్ యంత్రాలు విరాళం

**తిరుమల,సెప్టెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్ర పుణ్యక్షేత్రంలో తిరుమలకొండ ఖ్యాతిచెందింది. రోజుకు లక్షమందివరకు భక్తులు వచ్చినా పరిశుభ్రతలో ఎక్కడా రాజీలేని ధోరణితో టిటిడి అధికారులు పర్యవేక్షణ జరుగుతుంది. అలాంటిది దేవదేవునికి తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాల వేళ భక్తులు రోజుకు 2లక్షలమందివరకు కొండపైనే ఉంటారు. భక్తులు వినియోగించి పడేసిన చెత్తాచెదారాన్ని, ఆలయం ముందు, మాఢవీధుల్లో, తిరుమల అంతటా ధుమ్ముకూడా కనిపించకుండా టిటిడి చేస్తున్న కృషికి ఇప్పుడు ఆదివారం ఉదయం రెండు బ్యాంక్‌ల శాఖలు సామాజిక దృక్పధంతో శుభ్రంచేసే యంత్రాలను విరాళంగా అందించాయి. ఐడిబిఐ బ్యాంక్ ఎండి ,సిఈఓ రాకేశ్‌శర్మ 18 క్లీనింగ్‌యంత్రాలను టిటిడికి విరాళంగా అందించారు. ఈ యంత్రాలను ఆలయం ముందు టిటిడి ఆరోగ్యశాఖ డిప్యూటీ ఈఓ సోమన్నారాయణ, ఆరోగ్య అధికారి డాక్టర్



మధుసూదన్‌కు ఐడిబిఐ హెడ్ సాయికృష్ణ, తిరుపతిశాఖ హెడ్ పల్లిరమేశ్, బ్రాంచ్ మేనేజర్ దూడల రాజేశ్ అందజేశారు.

**యుబిఐ బ్యాంక్‌శాఖ:** తిరుమలలో అత్యధిక ధుమ్ము, చెత్తను సులభంగా శుభ్రం చేసేందుకు కొన్ని అధునాతన యంత్రాలను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విరాళంగా అందజేసింది. ఈ యంత్రాలను స్వయంగా టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించి వినియోగించారు. ఆలయం ముందు నీటిని వెద జల్లుతూ శుభ్రం చేసే ఈ యంత్రాలు మరింతగా శుభ్రతలో దోహదపడుతాయి.



## శ్రీవారి దర్శనం ఆనందం

**తిరుమల,సెప్టెంబరు 21ప్రభాతవార్తప్రతినిధి:** పెరటాసి మాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం ఆనందదాయకమని పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సినీనటుడు రఘు, బిజెపి ఏపి ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డిలు వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఐదు లారీల రేషన్ బియ్యం పట్టివేత

**నెల్లూరు క్రైమ్ సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** ఐదు లారీల్లో తరలించడానికి సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యంను నెల్లూరు సివిల్ సప్లై అధికారులు ఆదివారం పట్టుకున్నారు. నగర శివారులోని మూడో మైలు సమీపంలో చెన్నై పోర్టుకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఐదు లారీల రేషన్ బియ్యం జిల్లా సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారి విజయ్ కుమార్ ఆదేశాల మేరకు సి ఎస్ డి టి షేక్ జమీర్ ఇతర సిబ్బంది తమకు వచ్చిన పక్కా సమాచారంతో ఈ దాడులు నిర్వహించారు. పట్టుకున్న ఐదు లారీలను నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. లారీల్లోని సరుకు పిడిఎస్ బియ్యమా లేదా అనేది సోమవారం ఉదయం పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

**GOVERNMENT OF INDIA : MINISTRY OF DEFENCE EX-SERVICEMEN CONTRIBUTORY HEALTH SCHEME, STATION HQ (ECHS CELL), SECUNDERABAD**
**Ph.: 07382361574 | E-mail : echsstnhqsecbad@gmail.com**

### EMPLOYMENT NOTICE

1. ECHS Cell, Headquarters Telangana and Andhra Sub Area invites applications to engage Medical, Para-Medical & Non-Medical Staff on contractual basis for a period of 12 Months for ESMs and Widows of deceased soldiers and 11 Months for Civilian candidates at given locations of ECHS Polyclinics in Telangana and Andhra Pradesh.

| Appointment | Minimum Qualification | Salary (Rs) | Vac | Location of Vacancies (ECHS Polyclinics) |
|---|---|---|---|---|
| OIC Polyclinic | Graduate (Retired Defence Officers Drawing Pension from CDA) | 75,000/- | 06 | Anantpur, Chittoor, Giddalur, Kadapa, Khammam & Nellore |
| Medical Specialist | MD/MS in General Medicine | 1,00,000/ | 04 | Chittoor, Giddalur, Golconda & Secunderabad-I |
| Medical Officer | MBBS | 75,000/- | 26 | Anantpur, Eluru, Giddalur(03), Guntur (03), Kadapa, Khammam, Kurnool, Mahabubnagar, Nellore, Secunderabad-I (09), Secunderabad-II, Vijayawada (02) & Sainikpuri |
| Dental Officer | BDS | 75,000/- | 11 | Eluru, Golconda, Guntur, Karimnagar, Kurnool, Mahabubnagar, Nellore, Secunderabad-I (02), Vijayawada & Sainikpuri |
| Dental Hygienist | Diploma in Dental Hygienist/Class-I DH/DORA Course (Armed Forces) | 28,100/- | 11 | Anantapur, Chittoor, Eluru, Guntur, Kadapa, Khammam, Mahabubnagar, Nellore, Sainikpuri, Secunderabad-I & Secunderabad-II |
| Pharmacist | B Pharmacy **OR** 10+2 with Science and Diploma in Pharmacy | 28,100/- | 13 | Anantur, Chittoor, Golconda, Guntur, Kadapa, Karimnagar, Khammam, Mahabubnagar, Nellore, Secunderabad-I(02), Secunderabad-II, & Vijayawada |
| Lab Technician | B Sc (Medical Lab Tech (MLT) **OR** 10+2 with | 28,100/- | 08 | Anantpur, Karimnagar, Mahabubnagar, Secunderabad-I(02), Secunderabad-II, Vijayawada & Sainikpuri |
| Lab Assistant | DMLT/Class-I Lab Tech Course (Armed Forces) | 28,100/- | 03 | Golconda, Guntur & Secunderabad-II |
| Nursing Assistant | BSc Nursing, GNM/ Diploma/Class-I Nursing Assistant Course Cert from (Armed Forces) | 28,100/- | 11 | Anantpur, Chittoor, Giddalur, Golconda (02), Karimnagar, Mahabubnagar, Secunderabad-I(02), Secunderabad-II & Vijayawada |
| Physiotherapist | Diploma/Class-I Physiotherapist Course (Armed Forces) | 28,100/- | 04 | Chittoor, Giddalur, Golconda & Secunderabad-I |
| IT Net Tech | Diploma/Certificate/Equivalent in IT Networking, Computer Application | 28,100/- | 02 | Secunderabad-I (02) |
| Data Entry Operator/Clerk | Graduate/Class-I Clerical Trade (Armed Force) | 22,500/- | 11 | Anantpur, Eluru, Golconda, Mahabubnagar, Secunderabad-I (04), Secunderabad-II, Sainikpuri & Vijayawada |
| Female Attendant | Literate | 16,800/- | 06 | Chittoor, Eluru, Guntur, Kadapa, Khammam & Sainikpuri |
| Chowkidar | 8th Class or GD Trade for Armed Forces personnel | 16,800/- | 08 | Anantpur, Eluru, Golconda, Guntur, Karimnagar, Khammam, Kurnool & Sainikpuri |
| Driver | 8th Class/ Class-I MT Driver (Armed Forces) | 19,700/- | 07 | Anantpur, Chittoor, Kadapa, Karimnagar, Mahabubnagar, Nellore & Secunderabad-II |
| Safaiwala | Literate | 16,800/- | 10 | Anantpur, Chittoor, Eluru, Giddalur, Golconda, Karimnagar, Khammam, Mahabubnagar, Secunderabad-II & Sainikpuri |
| Peon | 8th Class or GD Trade (Armed Forces) | 16,800/- | 06 | Eluru, Golconda, Guntur, Karimnagar, Secunderabad-II & Sainikpuri |

**PLEASE READ ALL INSTRUCTIONS CAREFULLY**

2. **For Terms & Conditions, Application Form & Remuneration.** For qualifications, work experience and age limits, kindly see website www.echs.gov.in. Application Form can be downloaded from the website under **EMPLOYMENT OPPORTUNITIES**. For additional details, contact on Tele No 07382361574 & email ID : echsstnhqsecbad@gmail.com during working hours. Preference will be given to the Ex-Servicemen. 3. **Last Date of Receipt of Application as per Format Given at our Website.** Application as per format alongwith self attested photocopies of testimonials for educational qualification (with Mark Sheets), work experience, Registration Certificates, Discharge book & PPO will be submitted to Officer-in-Charge, Station HQ ECHS Cell, HQ TASA, Near Rastrapati Nilayam, Secunderabad-500010, Telangana by **05 Oct 2025 (1800 hours)**. Any application received after **05 Oct 2025** will not be accepted. **Online applications will not be accepted. 4. Written Test cum Interview Date, Timing & Venue. Date & time of written test will be intimated to all accepted applicant through email. Candidates meeting the Qualitative Requirements will only be called for written test. Subsequently written test qualified candidates will be called for interview.** Candidates must bring all the original educational certificates, work experience certificate, registration certificate (medical and para medical staff) discharge book, PPO, Service Records, PAN Card, Aadhar Card and two PP size colour photographs at the time of interview. No TA/DA is admissible.

**NOTE : CANDIDATES NOT SUBMITTING COMPLETE / INCORRECT DOCUMENT WILL NOT BE CALLED FOR INTERVIEW**



వార్త


విధి అంటూ ఎవ్వరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.

-లావోసు

# భారతీయులకు 'వీసా' షాక్!


ఎన్నికల తొలిరోజుల్లోనే ' మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటూనినాదం ఎత్తుకున్న శ్వేత సౌధా ధినేత డొనాల్డ్ ట్రంప్ రోజురోజుకీ అటువైపుగా అడుగులు వేస్తున్నారు.ఎవరేమనుకున్నా కాని, ఎవ రేమైపోయినా కానీ తాను పట్టిన కుందేలుకి మూడేకాళ్ల నే ధోరణిలో ప్రవర్తిస్తున్నారు.రేపటి పర్యవసానాలు ఎలా ఉంటాయో ఆలోచించకుండానే భారతీయులపై ఒంటికాలి మీద లేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు భారతీయ తయారీ వస్తువులపై 25శాతం నుంచి 50శాతం మీదు గా నూరు శాతం సుంకాలనైనా వేయడానికి వెనుకాడబో నని హెచ్చరికలు చేశారు. ఒకపక్క భారత ప్రధాని నరేంద్రమోడీ తనకు 'జిగ్రీ దోస్త్' అంటూనే ఆయన నేతృత్వం వహించే భారత దేశంపైన సుంకాలు వడ్డిస్తూనే ఉన్నారు. ఏ కోశానా స్నేహధర్మం పాటిస్తున్నట్లు లేదు. ఆది నుంచి బెదిరిస్తున్నట్లుగానే భారతీయ విద్యార్థులకు గోల్డెన్ షేక్ హ్యాండ్ ఇచ్చేశారు.ఏటా అమెరికా ఉద్యోగాల కోసం ఎగబడుతున్న భారతీయ ఉద్యోగార్థులకు హెచ్1బి వీసా దరఖాస్తు రుసుంను 1 లక్ష డాలర్లకు పెంచేశారు. భారతీయ కరెన్సీలెక్కలో రూ.88 లక్షలన్నమాట. ఆపైన వడ్డనసుంకాలుంటాయి. తమ దేశంలో ఉద్యోగానికి, ఉపా ధికి తమ వారే సరిపోతారన్న ధోరణిలో ట్రంప్ ఇలాంటి సుంకాలు, రుసుముల పెంపు పథకాలను రచిస్తున్నారు. పరోక్షంగా భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు రాచి రంపాన పెడుతున్నారని అనుకోవచ్చు. ఇలా దరఖాస్తు రుసుంలు పెంచడం వలన అమెరికా కంపెనీల మీద పెనుభారం పడుతోంది. అమెరికా టెక్ కంపెనీల ప్యాకే జీల మాటెలా ఉన్నా కంపెనీలన్నీ హెచ్1బి దరఖాస్తు చార్జీలు తామే పెట్టుకుంటాయి. అలాంటి ఒప్పందంపైనే మన దేశం నుంచి ఉద్యోగార్థులు అమెరికా ఉద్యోగాలకు వెళ్తుంటారు. ఇలా ఒక్కసారిగా ట్రంప్ వీసా దరఖాస్తుల రుసుం పెంచడంలో అమెరికన్ కంపెనీలు భారతీయుల్ని అమెరికాకు తీసుకెళ్లడంలో వెనుకడుగు వేస్తాయని, ఆ నేపథ్యంలోనే అమెరికాలోఉన్న ఏస్థాయి కంపెనీ అయినా అమెరికా జాతీయుల్నే తమవద్ద ఉద్యోగాలకు తీసుకుం టుందని ట్రంప్ అభిలాష. అమెరికాలో నిరుద్యోగం ప్రబ లకుండా ట్రంప్చర్యలు పనికివస్తాయని అనుకునే వారుం డవచ్చు. ఉండకపోవచ్చు.కానీ ట్రంప్ 2.0పాలనలో'అన్నీ మనమే, అన్నీ మనకే' అనేధోరణిలో ముందడుగు వేస్తు న్నారు. తాజాగా అమెరికన్ హెచ్1బి వీసా నిబంధనలు మార్చాడు.1990లో అమెరికా వెళ్లే విదేశీయులకుహెచ్1బి వీసా నిబంధనలకు రూపకల్పన చేశారు. ఏటా 85వేల హెచ్1బి వీసాలకు అవకాశం ఉండగా అందులో 70 శాతంమంది భారతీయులే సంసిద్ధులౌతారు. 3,20,791 మంది భారతీయులకు హెచ్1బి వీసాలున్నాయి. ఈసారి వీసా కోసం ఎంపికలు కూడా లాటరీ పద్ధతిలో ఉంటాయి. తాజా విధానంలో లాటరీ విధానం ఎత్తేశారు. కొత్తగా హెచ్1బి వీసా మంజూరుకి ఎన్నో సమస్యలు అడ్డొస్తాయి. రానురాను విమాన చార్జీలు కూడా పెరిగే అవకాశముంటుంది. ఇవన్నీ అమెరికా వెళ్లేందుకు తహ తహలాడే విద్యార్థులను నిరుత్సాహపరచడానికే ఉద్దేశిం చాయి. కోటి రూపాయలు కడితేనే హెచ్1బి వీసా అన్న అమెరికా ప్రభుత్వ నిర్ణయం తర్వాత అక్కడున్న విదేశీ విద్యార్థుల్లో ఆందోళన బయలుదేరింది. టెక్ కంపెనీలు, ఉద్యోగుల మధ్యరుసుముల చెల్లింపుల విషయమై రేకెత్తిన సందేహాల నివృత్తికి ఆయా కంపెనీలు తమ ఉద్యోగులతో కలువనున్నాయి. వెకేషన్ ప్లాన్లో ఉన్న ఉద్యోగులను రద్దు చేసుకుని అమెరికాకు తిరిగి వచ్చేయాలని ఆయా కంపెనీల అడ్వయిజరీలు అందించాయి.ట్రంప్ వీసా విధా నాల్లో మార్పులను సంపూర్ణంగా విశ్లేషించి కానీ ఉద్యోగ స్తుల ప్యాకేజీలలో మార్పు ఉంటుందా? లేక ట్రంప్ పెంచిన భారాలను ఎవరు భరించాలి? అన్న అంశాలపై చర్చ ఉంటుంది. రుసుం భారం కొత్తదరఖాస్తులకే వర్తిస్తా యా? అన్నవిషయంపై 2,3రోజుల్లో కానీ ఓకొలిక్కిరావు. దరఖాస్తు పరిమితి మూడు ఏళ్లు, 6 ఏళ్లుగా ఉంటుందని ప్రకటించారు. తొలుత దరఖాస్తు చేసుకునే సమయంలోనే రుసుం ఉంటుంది. రెన్యువల్ సమయంలో కూడా ఏదేని మొత్తం చెల్లించాల్సి ఉంటుందా?అన్న వివరాలు తెలి యాలి. కాగా కొంత సమాచారం మేరకు లక్ష డాలర్లు వార్షిక ఫీజుగానే నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇంతవరకు హెచ్1బి వీసా దరఖాస్తు రుసుం 215డాలర్లుగా ఉండేది. ఇదిలా ఉండగా ట్రంప్ గోల్డ్ కాయిన్ను కూడా ప్రవేశపె డ్తున్నారు. 10 లక్షల డాలర్లు ఉంటుంది. గోల్డ్కాయిన్ల ద్వారా వచ్చే ఆదాయం 100 బిలియన్ డాలర్ల మొత్తం ఉండొచ్చు. దానిని అమెరికా అభివృద్ధి కోసం ఖర్చుబెట్ట నున్నారు. ఇది కేవలం సంపన్నుల కోసం మిలియన్ డాలర్ల 'గోల్డ్కార్డ్' వీసా నిర్దేశించబడింది. అమెరికా పౌర సత్వం పొందేందుకు మార్గం సుగమం చేసే 'గోల్డ్కార్డ్' వీసాకు 2మిలియన్ డాలర్లు చెల్లించే పద్ధతిన ప్రవేశపెట్టా రు. ఈ రెండు కొత్తవీసా కేటగిరిలను విదేశీయుల కోసం ప్రత్యేకించారు.ఎలాంటి సభ ఆమోదాలు లేకుండానేట్రంప్ తన స్వబుద్ధితో వీటిని ప్రకటించారు. కాంగ్రెస్ ప్లాటినం కార్డుకు ఆమోదం తెలపాల్సిఉంటుంది. కంపెనీలు తమ ఉద్యోగులను స్పాన్సర్ చేయాలంటే 2 మిలియన్ డాలర్లు చెల్లించాలి. 5 మిలియన్ డాలర్లు ఫీజు చెల్లించి ట్రంప్ ప్లాటినమ్కార్డు అందుబాటులోకి వస్తుంది. 270రోజులు అమెరికాలో ఉంటేఎలాంటి విదేశీ ఆదాయ పు పన్ను చెల్లించనక్కర్లేదనే వెసులుబాటు ఉంటుంది. ఇలాంటి ట్రంప్ ఆలోచనలు కేవలం వలస వ్యతిరేకులను సంతృప్తి పరచడానికి తీసుకున్నవేనని అనుకుంటున్నారు. కష్టపడి పనిచేసే తత్వమున్న అమెరికన్లను ఉపాధి విదేశీయులు అడ్డుపడుతున్నారనే యోచనతోనే ట్రంప్ కొత్తతరహా వీసా విధానాలను ప్రవేశపెట్టినట్లు భావిస్తున్నారు.

పైపై ఆకారాలు చూసి మంచి చెడ్డలు నిర్ణయించకండి. అలా చేసేవారు కేవలం సంకుచిత స్వభావులు.



ఆస్కార్‌వైల్డ్

మనిషి ఒంటిపై దుస్తులు వేసుకున్నా ముఖం మీద చిరునవ్వు లేనిచో ముస్తాబు పూర్తికానట్లే.



మహాత్మా గాంధీ

# వరద బురదలో విశ్వనగరం!

**ప్రతిసారి వర్షంపడితే నగరం స్తంభించడం కొత్త విషయం కాదు. కానీ ఈసారి వరుసగా వారం రోజులపాటు వర్షం పడటం వలన సమస్యలు మరింత పెరిగాయి.కాలువలు శుభ్రం చేయకపోవడం, డ్రైనేజీలు మూసుకుపోవడం, రోడ్లపై నీరు చేరడం ఇవన్నీ జిహెచ్ఎంసి పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి. అధికారుల వైఫల్యం వల్లే వర్షం ప్రజలకు విపత్తుగా మారిందని పౌరులు ఆగ్రహిస్తున్నారు. ప్రజలు ఇప్పుడు ఒకటే మాట చెబు తున్నారు. విశ్వ నగరమని గొప్పలు చెప్పుకుంటారు, కానీ వారం రోజుల వర్షం పడగానే నగరం విషాద నగరంగా మారిపోతుంది. ఇక్కడ జీవించడం ఒక కష్టసాధ్యమైన పని అవుతోంది. ఈ సమస్యలు ఎప్పటికి తీరుతాయో తెలియదు అని.వర్షం అనేది ప్రకృతి వరం అయినప్పటికీ,దాన్ని ఎదు ర్కొనే ప్రణాళికలు లేకపోతే అదిప్రజలకు విపత్తు అవుతుంది. ఈవర్షం ప్రజలకు ఇబ్బందులు మాత్రమేకాదు, పాలకుల వైఫల్యాన్ని కూడా బహిర్గతం చేసింది అనేది నగ్నసత్యం.**



మన్నారం నాగరాజు

వారం రోజులుగా దంచి కొట్టిన వర్షాలు కాస్త శాంతించాయి. తెలంగాణ వ్యాప్తంగా అన్ని డ్యాంలు వాటి స్థాయిలకు నిండి ఫుల్ అవ దంతో మిగులు జలాలను దిగువ ప్రాంతాలకు వదులుతున్నారు.ఇంకా గత పదేళ్లల్లో ఎప్పుడు లేనంత వర్షా లు హైదరాబాద్లో కూడా పడ్డాయి. వారం రోజుల నుంచి ఇప్పటి వరకు హైదరాబాద్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు. ఇది గడిచిన పదేళ్లలోనే అత్యంత ఎక్కువ వర్షం పాతం అంటున్నారు. గత ఐదు రోజులుగా హైదరాబాద్లో కురిసిన భారీ వర్షం సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. ఇక ఓ గంటసేపు వాన గట్టిగా కురిస్తే, హైదరాబాద్ చెరువైపోతుంది. అలాంటిది, రోజుల తరబడి వర్షం హైదరాబాద్ని ముంచెత్తితే పరిస్థితి ఎలా వుంటుంది.? దాదాపు కోటి పైచిలుకు మంది జనాభా. పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు, పలువురు మంత్రులు, సాఫ్ట్వేర్ రంగానికి కేరాఫ్ అడ్రస్, పారిశ్రామికవేత్తలకు నిలువెత్తు నిద ర్శనం, ఆకాశ హర్మ్యాలు.. హైదరాబాద్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కానీ, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న ట్టు తయారయ్యింది. భారీ వర్షాలతో హైదరాబాద్ పరిస్థితి. గత పాలకుల నిర్వాకం అని లైట్తీసుకుంటే కుదరదిప్పుడు. టిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు పది సంవ త్సరాలు పై బడిన హైదరాబాద్లో ఏం మార్పులు తీసుకొ చ్చారు? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేని స్థితిలోవుంది. ఇక హైదరాబాద్ నగరం గత వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాల వలన మరోసారి కుదేలైంది. వర్షం అంటే సాధారణంగా ప్రకృతి ప్రసాదం, పంటలకు ఆరోగ్యం, నగరానికి చల్లదనం అని అనుకుంటారు. కానీ హైదరాబాద్ ప్రజలకు వర్షం అనగానే ఆనందం కన్నా భయం ఎక్కువ అవుతోంది. ఎందుకంటే ఒక గంట పాటు వర్షం కురిసినా నగరంలో జీవితం పూర్తిగా స్తంభిస్తుంది. రోడ్లు చెరువుల్లా మారిపోతాయి, ట్రాఫిక్ జామ్లు అంతులేని క్యూలా మార తాయి. లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతాయి, బస్తీల్లో మురికినీరు చేరుతుంది. ఈ వారం రోజులుగా ప్రతి రోజు ఎప్పుడో ఒక సమయంలో కురిసిన వర్షం నగరాన్ని మళ్లీ మళ్లీ పరీక్షించింది. మొదటి రోజు వర్షం కురిసినప్పుడే ప్రధాన రోడ్లపై వాహనాలు కదలకుండా నిలిచిపోయాయి. రెండవ రోజు పరిస్థితి మరింతగా దిగజారింది. మూడవ రోజు నుంచే పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయిం ది. నాలుగవ రోజు మురికినీరు పొంగిపొర్లి బస్తీల్లోకి చేరాయి. ఐదవ రోజు పాత భవనాలు కూలిపోయాయి. ఆరో, ఏడవ రోజు వర్షం కురిసే సమయానికి ప్రజలు ఇళ్ల లో నుంచే బయటికొచ్చేందుకు భయపడ్డారు. ట్రాఫిక్ సమస్య మొదటి నుంచే పెద్ద ఇబ్బంది. వర్షం పడగానే హైదరాబాద్లోని ప్రధాన రోడ్లు నిలిచిపోతాయి. హైటెక్ సిటీ, మియాపూర్, గచ్చిబౌలి, మణికొండ, కూకట్పల్లి, అమీర్పేట్, పంజాగుట్ట, ఎర్రమంజిల్ వంటి ప్రాంతాల్లో వాహనదారులు గంటల తరబడి నిలబడిపోయారు. ఒక కిలోమీటరు దూరం వెళ్లడానికి ఒక గంట పట్టింది. ఆటోలు దొరకలేదు. బస్సులు రాకపోవడంతో ప్రజలు తడిసి ముద్ద య్యారు. మెట్రో స్టేషన్లలో జనం నిలిచిపోయి రైళ్లు రావడా నికే గంట సమయం పట్టింది. రెండు చక్రాల వాహనదారు లు వర్షపు నీటిలో గుంతల్లో పడిపోయి గాయపడ్డారు.చాలా చోట్ల కార్లు నీటిలో ఇరుక్కుపోయాయి. వర్షం పడితే నగరం స్తంభించడం ఇప్పుడు సహజమైన దృశ్యంలా మారింది. లో తట్టు ప్రాంతాల్లో పరిస్థితిమరింత దారుణంగా ఉంది. అల్వా ల్, మలక్పేట్, ముషీరాబాద్, షేక్ పేట, బహదూర్పురా,



బోయిన్పల్లి, చంద్రాయణగుట్ట, మాదన్నపేట, అంబర్పేట్, కాచిగూడ, హిమాయత్ నగర్, యూసుఫ్గూడ, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో వర్షపు నీరు మురికికాలువ నీటితో కలసి ఇళ్లలోకి చేరింది. రాత్రివేళలు ప్రజలు నీటిని బయటకు తోసేందుకు బకెట్లు పట్టుకుని గడిపారు. ఇళ్లలోని సామాను లు తడిసి పాడైపోయాయి. వృద్ధులు, పిల్లలు ఆ మురికి నీటిలోనే గడపాల్సి వచ్చింది.కొన్నిచోట్ల బస్తీలలో గుడిసెలు కూలిపోయాయి. ప్రజలు పొరుగు ఇళ్లలో లేదా పాఠశాల భవనాలలో తలదాచుకున్నారు.విద్యుత్ సమస్య ఈ వారం ప్రజలకు మరొక కష్టం తెచ్చింది. వర్షం కురిసిన ప్రతీసారి చెట్లు వేరుతో సహ కూలిపడి విద్యుత్ తీగలపై పడడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కొన్ని కాలనీలు ఒకే రోజులో 8-10 గంటల పాటు చీకటిలోనే గడిపాయి. విద్యుత్ లేకపోవడంతో ఇళ్లలోని మోటర్లు పని చేయక తాగునీరు సేకరించడంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బం ది పడ్డారు. చీకటిలో దోమలసమస్య మరింతగా పెరిగింది. ఆరోగ్య సమస్యలు కూడా తీవ్రంగా తలెత్తాయి. వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగాయి. ఫలితంగా డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ కేసులు పెరుగుతున్నాయని ఆసు పత్రులు చెబుతున్నాయి. పిల్లల్లో జ్వరం, దగ్గు, జలుబు కేసులు పెరిగాయి. పలు ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో నిండిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా వందలాది కేసులు నమోదయ్యాయి. ఈ వారం రోజుల వర్షం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపింది.పాత భవనాలు, గోడలు కూలిపోవడం వలన కొన్ని చోట్ల ప్రాణనష్టం కూడా సంభ వించింది. అధికారులు పాత ఇళ్లను ఖాళీ చేయమని నోటీసులు ఇచ్చినా, పేద కుటుంబాలకు వెళ్లడానికి వేరే చోటు లేకపోవడంతో ప్రమాదం తప్పలేదు. పాత నగరంలోని కొన్ని ఇళ్లు కూలిపోవడంతో ప్రజలు భయంతో గడిపారు. జిహెచ్ఎంసి సిబ్బంది అత్యవసరంగా సహాయం చేసినా, సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. చిన్న వ్యాపారులు, రోడ్డు పక్క దుకాణదారులు ఈవర్షంతో తీవ్రంగా నష్టపో యారు. వర్షంపడగానే వీధుల్లో కస్టమర్లు కనిపించకపోవ డంతో అమ్మకాలు పడిపోయాయి. వర్షపు నీటితో దుకాణా లు తడవడంతో సరుకులు పాడైపోయాయి. రోజువారీ ఆదా యం మీద ఆధారపడి జీవించే వ్యాపారులు ఈ వారం ఆర్థి కంగా ఇబ్బంది పడ్డారు. పండ్ల వ్యాపారులు, కూరగాయల అమ్మకందారులు నష్టపోయారు. మార్కెట్లలో సరుకులు తడవడంతో ధరలు పెరిగాయి. విద్యార్థులు కూడా ఇబ్బంది పడ్డారు. వర్షం పడే సమయాల్లో స్కూల్ బస్సులు సమ యానికి రాలేకపోవడంతో పిల్లలు గంటల తరబడి నిలబ డ్డారు. రోడ్లపై ట్రాఫిక్ వల్ల ఆలస్యమవడంతో పాఠశాలలకు సమయానికి చేరుకోలేకపోయారు. కొన్ని చోట్ల పాఠశాలలు ముందుగానే విద్యార్థులను వదిలేయాల్సి వచ్చింది. తల్లిదం డ్రులు వర్షంలో పిల్లలను తీసుకువెళ్లడం కోసం కష్టపడ్డారు. ఉద్యోగులు, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేసేవారు, ఈ వారం రాత్రివేళ ఇళ్లకు చేరుకోవడం చాలా కష్టపడ్డారు.వర్షం పడగానే ఆఫీసుల వద్ద వాహనాలు కదలకుండా నిలిచిపోవ డంతో చాలామంది తమ కార్యాలయాల్లోనే ఎక్కువసేపు గడిపారు.కొందరు రాత్రి 10-11 గంటలకు మాత్రమే ఇళ్లకు చేరుకున్నారు. మెట్రో స్టేషన్లలో జనం నిలబడి రైళ్ల కోసం వేచి చూశారు. ఆటోలు, క్యాబ్లు దొరకకపోవడంతో ఉద్యో గులు ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్ రోడ్ల అసలు పరిస్థితి ఈ వర్షాల వలన బహిర్గతమైంది. ఎన్ని కోట్లతో రోడ్లు వేశా మంటున్నా, వారం రోజుల వర్షానికే గుంతలు, గోతులు బయటపడ్డాయి. వర్షపు నీటిలో దాగి ఉన్న గుంతల్లో వాహా నాలు పడిపోవడం తరచూ జరిగింది. ట్రాఫిక్ పోలీసులు, జిహెచ్ఎంసి సిబ్బంది తాత్కాలికంగా బారికేడ్లు పెట్టినా, సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. ప్రతిసారి వర్షంపడితే నగరం స్తంభించడం కొత్త విషయం కాదు. కానీ ఈసారి వరుసగా వారం రోజులపాటు వర్షం పడటం వలన సమ స్యలు మరింత పెరిగాయి.కాలువలు శుభ్రం చేయకపోవడం, డ్రైనేజీలు మూసుకుపోవడం,రోడ్లపై నీరు చేరడం ఇవన్నీ జిహెచ్ఎంసి పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తాయి. అధికారుల వైఫల్యం వల్లే వర్షం ప్రజలకు విపత్తుగా మారిందని పౌరు లు ఆగ్రహిస్తున్నారు. ప్రజలు ఇప్పుడు ఒకటే మాట చెబు తున్నారు. విశ్వ నగరమని గొప్పలుచెప్పు కుంటారు, కానీ వారం రోజుల వర్షం పడగానే నగరం విషాద నగరంగా మారిపోతుంది. ఇక్కడ జీవించడం ఒక కష్టసాధ్యమైన పని అవుతోంది. ఈ సమస్యలు ఎప్పటికి తీరుతాయో తెలియదు అని.వర్షం అనేది ప్రకృతి వరం అయినప్పటికీ,దాన్ని ఎదు ర్కొనే ప్రణాళికలు లేకపోతే అదిప్రజలకు విపత్తు అవుతుం ది. ఈవర్షం ప్రజలకు ఇబ్బందులు మాత్రమేకాదు, పాలకుల వైఫల్యాన్ని కూడా బహిర్గతం చేసింది అనేది నగ్నసత్యం. ●

# స్వీయ డిజిటల్ సమృద్ధి అవసరం

సయ్యద్ నిసార్ అహ్మద్

భారతదేశం ప్రపంచ పట్టంలో ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ నేటి సమాజంలో ఓ విషయం లో వెనబడివున్నామన్న సందేహం మాత్రం కలుగుతోంది. అన్ని రంగాలతోపాటు మనదేశం డిజిటల్ పరంగా అభివృద్ధి సాధించాల్సిన అవసర ఎంతోవుంది.డిజిటల్ పరంగా ఇంకా ఇతరులపై ఆధారపడి ఉన్నాం. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషి యేటివ్ (జీటీఆర్ఐ) నివేదిక ప్రకారం, సాఫ్ట్వేర్, క్లౌడ్ సేవ లు, సోషల్ మీడియా వంటివి ప్రధానంగా విదేశీ ముఖ్యం గా అమెరికా సంస్థల నియంత్రణలో ఉండటం వల్ల మన ఆర్థిక వ్యవస్థ, భద్రత, స్వతంత్రతకు ముప్పు ఏర్పడుతోం ది. ఇది కేవలం సాంకేతిక విషయం కాదు, ఇది మన దేశ మనుగడకు సంబంధించిన అంశం.మన డిజిటల్ అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం వల్ల కలిగే ప్రమాదాలు చాలానే ఉన్నాయి. ప్రస్తుతం పాన్ ఇండియా పేమెంట్లు, పన్నుల చెల్లింపు వ్యవస్థలు, ప్రభుత్వ పోర్టల్స్, బ్యాంకింగ్ నెట్వర్క్లు వంటి ముఖ్యమైన సేవలు నేడు పూర్తిగా డిజిటల్ వ్యవస్థలపై ఆధారపడి కొనసాగుతున్నాయి. ఒకవేళ ఏదేని విదేశీ విధాన నిర్ణయం లేదా వాణిజ్య వివాదం కారణంగా ఈసేవలు నిలిచిపోతే మన దేశంమొత్తంస్తంభించి పోతుంది. గతంలో బలహీనమైన దేశాలు అవసరాల కోసం విదేశీయులపై ఆధారపడటం వల్ల ఎదుర్కొన్న సమస్యలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఇది కేవలం ఊహాజనితంకాదు, నిజంగా జరగగల ప్రమాదం. ఈ సమస్యను అధిగమించడా నికి జీటీఆర్ఐ ఒక స్పష్టమైన సూచన చేస్తోంది. 2030 నాటికి 'డిజిటల్ స్వరాజ్ మిషన్'ను స్థాపించుకోవాల్సిన ఆవశ్యతను తెలియజేసింది. ఈ మిషన్ ద్వారా దేశీయ ఆపరేటింగ్ సిస్టమ్లు, క్లౌడ్ మౌలికసదుపాయాలు, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు, స్థానిక సోషల్ మీడియా ప్లాట్ఫార మ్లు అభివృద్ధి చేయాలి. ఇది చిన్నపాటి వ్యాపారాల కోసం కాదు, మన దేశ రక్షణ,ఆర్థిక, డేటా సార్వభౌమత్వం వంటి కీలకమైన అంశాల కోసం ఇది అత్యంత అవసరం. ఈ రోజుల్లో డేటా అనేది డబ్బుతో సమానం. భారతీయ విని యోగదారుల భారీ డేటా విదేశీ సంస్థల చేతుల్లోకి వెళ్తోంది, అవి వాటి కృత్రిమ మేధ (ఏఐ)వ్యవస్థలకు ఇంధనంగా పని చేస్తున్నాయి. మన డేటాను వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించుకోనివ్వడం అనేది చమురు లేదా ఖనిజాలు వంటి వ్యూహాత్మక వనరులను ఇతరులకు అప్పగించడం లాంటిదే. దీనివల్ల మన స్వతంత్రత దెబ్బతింటుంది. ప్రభు త్వం, పరిశ్రమలు, విద్యా సంస్థలు ఈ సమస్యను పరిష్క రించడానికి కలిసి పనిచేయాలి. ఇందుకోసం కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. డిజిటల్ స్వరాజ్యం కోసం స్పష్టమైన విధానాలు, గడువులు, బడ్జెట్లు, పబ్లిక్ప్రైవేట్ భాగస్వామ్య నమూనాలను రూపొందించాలి. దేశీయ ఆపరేటింగ్ సిస్టమ్ లు, క్లౌడ్ డేటా సెంటర్లు, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టాలి. పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డీ)కి ప్రోత్సాహం ఇవ్వాలి. వినియోగ దారుల డేటాను దేశీయ నియంత్రణలో ఉంచే విధానాలను కఠినంగా అమలు చేయాలి. డేటా స్థానికీకరణ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగు ణంగా దేశీయ సాఫ్ట్వేర్ మరియు క్లౌడ్ సేవల నాణ్యతను పెంచాలి. డిజిటల్ ప్రపంచంలో పౌరుల పాత్ర, వారి డేటా విలువ గురించి అవగాహన కల్పించాలి. ●



# ప్రజావాక్కు

## ఇది పాలన లోపమా?

**గవర్నర్లు,** రాష్ట్రపతులు చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులను ఏవో కారణాలు చూపించి సంతకం చేయక, చేయకపోవడానికి తగిన కారణాలు చెప్పక తమ దగ్గరే చాలాకాలం తొక్కిపెట్టడం వలన పరిపాలన,ప్రజల సంక్షే మం కుంటుపడుతుంది.ఇది ప్రజాప్రభుత్వాన్ని అణగద్రొ క్కడమని సాక్షాత్తు అత్యున్నత న్యాయస్థానం నొక్కి వక్కా ణించింది. అందుచేత బిల్లులను ఓ కాలపరిమితి లోపల తప్పక ఆమోదించాలని సుప్రీంకోర్టు సూచనచేసింది. ఏ బిల్లుఅయినా రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా ఉందని అనిపిస్తే న్యాయసలహాలు తీసుకునివెనక్కి పంపవచ్చు. మార్పులను సూచించవచ్చు. రిజర్వేషన్ల కాలపరి మితిని ఎప్పటికప్పుడు పెంచుకుంటూపోతున్నారంటే వారిజీవి తంలో ఆర్థిక, సామాజిక వికాసాం ఇంకా అనుకున్నంత స్థాయికిఎదగనట్టేకదా!ఇదిపాలనలోపమా లేక మరొకటా?

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలి

**ఇటీవల** కురిసిన భారీ వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాలు బాగా అతలాకుతలం అయ్యాయి. చాలా చోట్ల వాగులు, వంకలపై ఉధృతిని మించి వర్షపు నీరు ప్రవహించింది. దీనివల్ల బాహ్య ప్రపంచానికి కొద్దిసేపు సంబంధాలు తెగి పోయాయి.చాలావాగులపై బ్రిడ్జిలునిర్మించాలని డిమాండ్ ఉన్నప్పటికీ వాటి ప్రతిపాదనలు పేపర్లకే పరిమితం అవుతున్నాయి. సంబంధిత వాగులపై బ్రిడ్జిల నిర్మాణం జరగడానికి బడ్జెట్ను కేటాయించాలి. అలాగే సంబంధిత అధికారుల నుంచి ఎక్కడెక్కడ వాగులపై బ్రిడ్జిల నిర్మాణ అవసరమోప్రతిపాదనలు తీసుకోవాలి.భారీగావర్షాలు కురి సినప్పుడుజనజీవనానికిఎలాంటిప్రాణనష్టంజరగకూడదు.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

## జీవవైవిధ్య పరిరక్షణ

**మానవునికి** ప్రకృతి, జీవవైవిధ్యం రెండు కళ్లు వంటివి. ఆధు నిక మానవుని జీవనశైలి మార్పు వలన పర్యావరణ లేమితోపుడమివేడెక్కిపోవటంతోపాటు జీవవైవిధ్యం దెబ్బ తింటుంది.ప్రపంచవ్యాప్తంగా అత్యధికవన,జల, జీవరాశు లున్న దేశాల్లో ఇండియాది 8వ స్థానం. భారత్లో ఉన్న 18 జీవావరణ ప్రదేశాల పరిరక్షణకు ప్రజల్లో అవగావన కల్పించడంలో ప్రభుత్వాలు మరింత కృషి చేయాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## సరికొత్త ఆశ

**నేపాల్** కుదుటపడుతోంది ఒక్కరోజులోనే బితావాహ పరిస్థితి చూసిన దేశం ఇవ్వాళ శాంతి వైపు అడుగులు వేస్తూ సరికొత్త నవోదయం వైపుచూస్తున్నాయి.అందుకు తగ్గట్టుగానే నలుగురు నిపుణులతో మంత్రివర్గం ఏర్పాటు చేసిన సుశీల ఇప్పటికే పని ప్రారంభించారు. ప్రజాస్వామిక విలువలు హక్కుల రక్షణ అవినీతి ఆశ్రిత పక్షపాతం వల్ల పడిన మరకలు తుడిచివేసే దిశగా సరికొత్త ప్రభుత్వం అడుగులు వేయాలి. అంత మాత్రమే కాదు ఇటీవల చాలా దేశాలలో పౌర ప్రభుత్వాలను గద్దె దించి ఆర్మీ సేనలు గద్దె నెక్కిన నేపథ్యం చూసాం. కానీ ఇప్పుడు నేపాల్ ఆర్మీ చీఫ్ మధ్యవర్తిత్వం వహించి దేశాన్ని ఒక గాడిన పెట్టడానికి ప్రయాత్నించడం ఒక గొప్ప సందర్భం బంగ్లాదేశ్ పాఠం చారిత్రక తప్పిదాలకు దారి చూపుతుండగా నేపాలి సందర్భం సరికొత్త ఆశను చిగురింపజేస్తుంది.

- భారత అవినాష్, జనగామ

## వనరుల సదుపాయం కల్పించాలి

**విజ్ఞాన** శాస్త్రాన్ని కేవలం వారి చదువులో భాగంగా పరిశోధన చేస్తూ ఒక దృక్పథంతో చేపట్టిన ప్రయోగ ఫలితాలు మనిషి జీవనానికి, ప్రాణరక్షణకు,సౌలభ్యానికి తోడ్పడే మహానుభావుల త్యాగం అమూల్యం, చిరస్మరణీయం. వాటి ఫలితాలు అనుభ వించడం చాలా తేలిక. కావున అటువంటి ఆశయాన్ని, కృషిని గుర్తిస్తూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగంతో పాటు మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తే మరిన్ని రంగాల్లో కొన్ని సమస్యలు పరిష్కారం అవ్వొచ్చు. వీటికోసం దేశంలో పరిశో ధన చేసే విద్యార్థులకు ఆర్థిక,సహాయం, ప్రోత్సాహం విరివిగా కల్పించాలి. వారికి అన్ని వనరులు కల్పిస్తే వయస్సు పెరిగినా లక్ష్య సాధనకోసం వారు శ్రమించగలరు.

- బొల్లోజు మేఘానాథం, విశాఖపట్నం

## కఠిన చర్యలు అవసరం

**మద్యం** సేవించి డ్రైవింగ్ హైదరాబాద్లో ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారింది.వాహనదారులే కాకుండా, అమా యక ప్రయాణికులు,బాటసారులు కూడా ఈ ప్రమాదానికి గుర వుతున్నారు.పట్టుబడిన వారిలో ఎక్కువమంది 18 నుండి 40 ఏళ్లమధ్యవారే.వారిరక్తంలో మద్యం స్థాయిలు ప్రమాద కరంగా ఎక్కువగా ఉన్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. ఆరోగ్య సేవలపై భారం పెరుగుతోంది.

-వి. కృష్ణ కుమార్, హైదరాబాద్

మన వి

ఎడిట్ పేజీకి..


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నానాటికి తీసికట్టుగా మారుతున్న ప్రభుత్వ విద్య

శ్రీ శ్రీ కుమార్

దేశంలో ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటింది. కేంద్ర విద్యా శాఖ యుడైస్ ప్లస్ 2024-25 నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్రపాలిత ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లే. కేంద్ర ప్రభుత్వం బాలికల విద్య పెరగడంకోసం ఏర్పరిచిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యా లయం అరుణాచల్ ప్రదేశ్లో మహిళా ఉపాధ్యాయుల కోసం విద్యార్థినులు 65 కిలోమీటర్లు పాదయాత్ర చేశారని కూడా వార్తలు చదివాం. ఇది చాలా దారుణమైన విషయం గా చెప్పుకోవాలి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు యుడైస్ వెల్లడించింది. దేశంలో ప్రతి పాఠశాలకు ఏడుగురు టీచర్లు, ప్రతి 24 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నట్లు పేర్కొంది. ఈ లెక్కన ఒక్కో పాఠశాలలో సగటున 168మంది విద్యార్థులు ఉన్నట్లు అర్థమవుతుంది. టీచర్ల స్థానంలో తెలంగాణ 10వ, ఏపీ 12వస్థానాన్ని పొందాయి.చండీగఢ్ రాష్ట్రంలో మాత్రం అత్యధికంగా ఒక్కో పాఠశాలలో సగటున 1222 మంది విద్యార్థులు ఉండటం గమనార్హం. దేశంలో 7993 పాఠ శాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేకపోగా అక్కడ 20,817 మంది టీచర్లు పనిచేస్తున్నట్లు గణాంకాలు తెలుపుతున్నా యి. లక్షకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. వాటి లో దాదాపు 34 లక్షల మంది విద్యార్థులు నమోదు అయి నట్లు తెలుస్తోంది. బాలికల ఎన్రోల్మెంట్లో మాత్రం పెద్దగా వృద్ధి లేకపోవడం శోచనీయం. కాగా మహిళా టీచర్లసంఖ్య 54 ఉండటం వారికి ఈ వృత్తిపట్ల ఆసక్తిని తెలియజేస్తున్న ది. ఇక పాఠశాలల్లో మౌలిక వసతుల్లో కొంత పురోభివృద్ధి కనిపించింది. కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యాలు పెరిగినా అవి ఏ మేరకు విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయి.అనేది మదింపు జరగాల్సిఉంది. మొత్తం మీద డ్రాపౌట్ రేట్ తగ్గి నట్లుగా నివేదిక తెలుపుతున్నది. విద్యుత్తు, మౌలిక వసతు లు రక్షిత నీటి సరఫరా, బాలబాలికలకు టాయిలెట్స్ విష యంలో కొంత పురోభివృద్ధి కనపడటం ఆశావహంగాఉంది. యుడైస్ ప్లస్ గణాంకాలు ప్రైమరీ, మధ్యంతర, సెకండరీ పాఠశాలల వారీగా, రాష్ట్రాల వారీగా పాఠశాలల సంఖ్య, వాటిలో ఎన్రోల్మెంట్ ఏ విధంగా ఉందో వివరిస్తున్నాయి. దేశంలో 25 కోట్ల మంది విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు హాజరవుతున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పడిపోయింది. 10,046 పాఠశాలలుమూతపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుతుండగా ప్రైవేటు పాఠశా లల సంఖ్య స్వల్పంగా పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో476 ప్రైవేట్ పాఠశాలలు పెరిగాయి. అదే క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు 7, ఎయిడెడ్ పాఠశాలలు 38తగ్గడం గమనా ర్హం. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలలు మూసుకుపోతుంటే ప్రైవేట్ పాఠశాలలు దూసుకుపోతున్నాయి. 37 రాష్ట్రాలు,



కేంద్రపాలిత ప్రాంతాల్లో కలిపి 2022-23 నుండి 2024 25 వరకు అన్నిరకాల సమాచారం యుడైస్ ప్లస్ నివేదిక లో లభ్యమవుతుంది.ఒక ప్రక్కన దేశంలో విద్యపట్ల అవగా హన పెరిగిందని ఉపాధ్యాయుల సంఖ్య కోటి దాటిందని, చదువుకునే విద్యార్థుల సంఖ్య 25 కోట్లకు దాటిందని విద్య పట్ల అవగాహన పెరిగి తల్లిదండ్రులు తమ పిల్లలనుబడిలో చేర్పిస్తున్నారని సంతోషించాలా లేక ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తూ నడుపుతున్న పాఠశాలల్లో విద్యార్థుల నమోదు క్రమంగా తగ్గుతూ కొంతమంది వ్యక్తుల, సంస్థల లాభాలకై నడిచే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుండ ని బాధపడాలా? చాలా కొద్దిమంది మాత్రమే సమాజ శ్రేయ స్సు దృష్ట్యా లాభాలు లేకుండా సేవా ప్రాతిపదికన పాఠ శాలలు నడిపే వాళ్లు ఉన్నారు. అసలు ప్రభుత్వ విద్యపై ప్రజలకు ఎందుకు నమ్మకం సన్నగిల్లుతున్నదో ప్రభుత్వాలు కానీ అధికారులు కానీ సమగ్ర సమీక్ష జరపడం లేదు. అందరూ మంచి అర్హతలతో,ఉన్నత చదువులతో, శిక్షణతో, ఎంపిక పరీక్ష లాంటి అనేక ఆటంకాలు దాటుకుని వచ్చిన వారే ప్రభుత్వ ఉపాధ్యాయులు. అదేవిధంగా ప్రభుత్వ బడు లలో చదివేవారు పేదలు బడుగు బలహీన వర్గాల పిల్లలే. దేశంలో వారి సంఖ్యకు కొదవ లేదు. కానీ ఆశ్చర్యకరంగా ప్రభుత్వం నడిపే బడులలో విద్యార్థుల నమోదు తగ్గుతున్న ది. పేద వర్గాల పిల్లలు కూడా ప్రైవేటు బడులలోనే చదువు నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారు. అది ఎంత ఆర్థిక భార మైనా వారి తల్లిదండ్రులు వెనకాడడం లేదు. కేంద్ర ప్రభు త్వం విద్యపై నిర్వహించిన కాంప్రహెన్సీవ్ మాడ్యులర్సర్వే 2025 (ఏప్రిల్-జూన్) ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్స రంలో ట్యూషన్ల కోసం దేశంలో సగటున చేస్తున్న వ్యయం 2400కు కోట్లకు పైగానే ఉండటం ఆశ్చర్యకరం. ఇది ప్రభు త్వ పాఠశాలల ఉనికికే ప్రమాదం. సరియైన సమయంలో సరియైన నిర్ణయం సరియైన చర్యలు తీసుకొనకపోతే వాటి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. నిజానికి పల్లెటూర్లలో మారుమూల ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం బడులు నడుపు తుంది. కానీ ప్రజల్లో వాటిపట్ల ఆదరణ తగ్గింది. సమీప పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పు తున్నారు. పర్యవసానంగా కొన్నిచోట్ల ప్రభుత్వ బడులు మూసివేయాల్సిన అగత్యం ఏర్పడింది.ఎన్నికలలో కొన్నిచోట్ల ఒకటి, రెండు ఓట్లకోసం పోలింగ్ బూతులు కేటాయించి నట్లు (అది ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలబెట్టడం కోసం) ఒకరి ద్దరు విద్యార్థుల కోసం ప్రభుత్వం బడి నడపడం సాధ్యం కాదు. అట్టి బడులను మూసివేస్తారు లేదా సమీపంలోని గ్రామాలలోని బడులలో విలీనం చేస్తారు.ఈరకంగా దేశంలో పదివేలకు పైగా ప్రభుత్వ బడులు మూతపడడం శోచనీ యం.యుడైస్ ఆగస్టు 2025 ప్రకారం తెలంగాణలో రెండు వేలకు పైగా ప్రభుత్వ బడులలో జీరో హాజరు నమోదువల్ల వాటిని మూసి వేయడం జరిగింది. ఇది దేశంలో రెండో స్థితిలో ఉంది. 78 శాతం బడులలో 100 కంటే తక్కువ మంది విద్యార్థులు చదువుతున్నారు. 35పాఠశాలల్లో ఒకటి నుండి 30 మంది మాత్రమే పిల్లలు ఉండడం ప్రమాద ఘంటికలను మోగిస్తున్నది. "అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన ప్రభుత్వ బడుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉంది. ఉపాధ్యాయుల కొరత, తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు బోధన జరగకపోవడం, ఇంగ్లీష్ మీడి యం ఎక్కువగా అందుబాటులో లేకపోవడం వంటి అంశా లు ప్రభుత్వ విద్యను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ●

# హెచ్-1బి వీసా కొత్త మార్గదర్శకాలు ఇవే..




## లక్ష డాలర్లు ఒక్కసారి చెల్లిస్తే చాలు

### ఇప్పటికే వీసా ఉన్నవారికి కొత్త ఫీజు వర్తించదు

### వారి ప్రయాణ హక్కులకు ఎలాంటి విఘాతం లేదు

**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్, వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ హెచ్-1బి వీసాపై చేసిన ప్రకటన తీవ్ర గందరగోళం సృష్టించింది. దీంతో శ్వేతసౌధం మళ్లీ పలు అంశాలపై స్పష్టతనిచ్చి గందరగోళం తొలగించే యత్నం చేసింది. ఈ క్రమంలో లక్ష డాలర్లు వన్‌టైమ్ ఫీజుగా తేలింది. అమెరికా కాలమానం ప్రకారం సుమారు ఉదయం 9.31 గంటలకు అమల్లోకి వచ్చింది.

ఈ నిబంధన సెప్టెంబరు 21 కంటే ముందే దాఖలు చేసిన హెచ్-1బి వీసా పిటిషన్‌లకు వర్తించదని అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) వెల్లడించింది. హెచ్-1బి వీసా కేటాయించాలని కంపెనీలు అధికారికంగా చేసుకొనే దరఖాస్తును పిటిషన్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటికే ఆమోదం లభించిన పిటిషన్లు కూడా దీని పరిధిలోకి రావని వెల్లడించింది. ఇక ఇప్పటికే హెచ్-1బి వీసా చెల్లుబాటులో ఉన్నవారు కూడా అమెరికాకు రాకపోకలు సాగించవచ్చని తెలిపింది. ఈ మేరకు యుఎస్‌సిఐఎస్ డైరెక్టర్ జోసఫ్ ఎడ్‌లో ఒక మెమోలో వెల్లడించారు. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు తమ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వీసాదారుల ప్రయాణ హక్కులపై కొత్త నిబంధన ప్రభావం చూపదన్నారు.

**భారత ఎంబసీ హెల్ప్‌లైన్ ఏర్పాటు..**

అమెరికా ప్రభుత్వం హెచ్-1బి వీసా ఫీజును భారీగా పెంచడంతో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం స్పందించింది. భారత దౌత్య కార్యాలయం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం +1-202-550-9931 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సప్ చేయాలని సూచించింది. భారతీయులకు మాత్రమే అత్యవసర సాయం పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపింది. హెచ్-1బి వీసాల్లో అత్యధికంగా 72 శాతం వరకు భారతీయులకే కేటాయిస్తున్నారు.

**పండుగ, పెళ్లి ప్రయాణాలు రద్దు**

హెచ్-1బి వీసా రుసుం అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, వైట్‌హౌస్ చేసిన పరస్పర విరుద్ధ ప్రకటనలు గందరగోళానికి గురిచేశాయి. ఈవిషయంలో సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. హెచ్-1బి వీసా రుసుమును లక్షల డాలర్లకు పెంచుతున్నట్లు తొలుత డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేశారు. దీంతో వీసా హోల్డర్లు, దరఖాస్తుదారులు భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో యుఎస్‌లో ఉన్న టెక్ కంపెనీలు.. తమ ఉద్యోగులు వెంటనే యుఎస్‌కు తిరిగి రావాలంటూ మెయిల్స్ పంపించాయి. ఇది అనేక మందిని కలవరపాటుకు గురిచేసింది. ఇప్పుడు దేశం వీడితే మళ్లీ యుఎస్‌లోకి అడుగు పెట్టలేమేమో అని కంగారుపడ్డారు. దీంతో తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. ట్రంప్ ప్రకటన చేసిన కాసేపటికే 'లక్ష డాలర్లు అనేది వన్‌టైమ్ ఫీజు మాత్రమే' అని వైట్‌హౌస్ ప్రకటన చేసింది. ఈ క్రమంలోనే అనేకమంది తమ విమానటికెట్‌లను రద్దుచేసుకోవాల్సి వచ్చింది. శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టునుంచి భారత్‌కువస్తోన్న ఓవిమానం టేకాఫ్‌కు కొద్ది సేపటి ముందు భారతీయ ప్రయాణికులు దిగిపో యారని సమాచారం. ఈ నేపథ్యంలో విమానం 3 గంటలు ఆలస్యంగా నడిచిందంటూ ఓ వ్యక్తి పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తనపెళ్లి కోసం చేయాల్సిన ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చిందంటూ మరో వ్యక్తి పోస్టు పెట్టినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలొస్తున్నాయి.



# ఏడు యుద్ధాలను ఆపా!

## నాకు నోబెల్ ఇవ్వాల్సిందే

### డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటన

**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పాత పాట పాడారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక ఏడు యుద్ధాలను ఆపినందుకు తనకు నోబెల్ శాంతి బహుమతి రావాలన్నారు. న్యూయార్క్‌లో కార్నర్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు ఇచ్చిన విందులో పాల్గొన్న ట్రంప్ 60 శాతం యుద్ధాలను వాణిజ్యంతోనే ఆపానని చెప్పారు. "ప్రపంచ వేదికపై తాము ఎన్నో గొప్ప పనులు చేస్తున్నాం. శాంతి ఒప్పందాలను కుదిరేలా చేస్తున్నాం. అనేక యుద్ధాలను ఆపేస్తున్నాం. ముఖ్యంగా భారత్- పాక్ ఉద్రిక్తతలను, థాయిలాండ్- కాంబోడియా, ఆర్మేనియా -అజర్‌బైజాన్, కొసావో-సెర్బియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఈజిప్ట్-ఇథియోపియా, రువాండా-కాంగో యుద్ధాలను ఆపాము" అని ట్రంప్ చెప్పుకొచ్చారు. తాను వాణిజ్యాన్ని అడ్డం పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా ఈ 7 పెద్ద యుద్ధాలను ఆపాను. వాటిలో 60 శాతం ఉద్రిక్తతలు అమెరికా వాణిజ్య ఒప్పందాలు చేసుకోదేమోననే భయంతోనే ఆగిపోయాయని వివరించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలిగితే, నాకు నోబెల్ శాంతి బహుమతి కచ్చితంగా వస్తుందని చాలా మంది చెప్పారు. అది సరే కానీ, మిగతా ఏడు యుద్ధాల సంగతేంటి? అని ప్రశ్నించారు. తాను ఇప్పటి వరకు ఏడు యుద్ధాలను ఆపాను. అందుకైనా నోబెల్ ఇవ్వాలికదా! అని పేర్కొన్నారు. పుతిన్‌తో మంచిసంబంధాలు ఉండటంతో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని సులభంగా నిలువరించవచ్చని తొలుత భావించాను. అయితే అది చాలా సంక్లిష్టంగా ఉందన్నారు. కానీ ఏదో ఒక రీతిలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తానని తాను భావిస్తున్నానని ట్రంప్ అన్నారు.

# ఎయిర్‌బేస్ తిరిగి ఇవ్వకుంటే అఫ్గాన్‌పై కఠిన చర్యలు: ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, సెప్టెంబర్ 21:** బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను తిరిగి ఇచ్చేయాలని లేని పక్షంలో అఫ్గాన్‌పై కఠిన చర్యలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. ఈ మేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. న్యూయార్క్‌లో మీడియా సమావేశంలోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారు. బగ్రామ్ ఎయిర్ బేస్ స్వాధీనం చేసుకునే అంశంపై అఫ్గానిస్థాన్‌తో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. దాన్ని తిరిగి తీసుకుంటామని, ఒక వేళ వారు అలా చేయకపోతే తాను ఏం చేస్తానో ఎవరూ ఊహించలేరని వ్యాఖ్యానించారు. బగ్రామ్ ఎయిర్ బేస్‌ను అమెరికాకు తిరిగి ఇచ్చేయాలని ట్రంప్ డిమాండ్ చేశారు. అయితే ఎయిర్ బేస్‌ను స్వాధీనం చేసుకోవడానికి అమెరికా బలగాలను ఆ ప్రాంతానికి పంపుతారా అని ఓ విలేకరి ప్రశ్నించారు. దానికి బదులిచ్చేందుకు ట్రంప్ నిరాకరించారు.

**ఎయిర్‌బేస్ ఇవ్వం... మా జోలికొస్తే దీటుగా బదులిస్తాం: తాలిబన్లు**

బగ్రామ్ వైమానిక స్థావరాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్‌ను తాలిబన్లు తీవ్రంగా తిరస్కరించారు. కాబూల్‌లో ఆదివారంనాడు అఫ్గన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఫసిహుద్దీన్ ఫిత్రాత్ 'ఎయిర్‌బేస్ తిరిగివ్వడం సాధ్యం కాదు, అఫ్గనిస్తాన్ పూర్తిగా స్వతంత్ర దేశం. ఏ విదేశీ శక్తిపైనా ఆధారపడదు. తామెలాంటి బెదిరింపులకు, దురాక్రమణదారులకు భయపడం. కాదని, ఎవరైనా తమ జోలికొస్తే దీటుగా బదులిస్తాం' అని హెచ్చరించారు.



# గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులు

## రెసిడెన్షియల్‌కాంప్లెక్స్‌పై దాడిలో 34 మంది మృతి

**గాజా సిటీ, సెప్టెంబరు 21:** ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న గాజా దాడుల్లో తాజాగా 34 మంది చనిపోయారు. రాత్రివేళల్లో జరిపిన దాడుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఓవైపు ఐక్యరాజ్యసమితి సమావేశాలు జరగనున్న సందర్భంలోనే ఈ దాడులుజరిగాయి. ప్రపంచంలోని 140కిపైగా దేశాలు పాలస్తీనాను గుర్తిస్తామనిప్రకటించినప్పటికీ ఇజ్రాయెల్ మొండిగా తన దాడులు కొనసాగిస్తూనే ఉంది. షిఫా ఆసుపత్రిలో మొత్తం 14 మంది చనిపోయారని, రాత్రి వేళ జరిగిన దాడుల్లోనే ఎక్కువమంది చనిపోతున్నారు. గాజా దక్షిణ భాగంలో ఒక రెసిడెన్షియల్ బ్లాక్‌పై జరిగిన దాడిలో పౌరులు మరణించినట్లు ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది చెపుతున్నారు. ఈ వారంలో ప్రారంభించిన ఇజ్రాయెల్ ఆపరేషన్ మరింతగా పెరుగుతూ పోతోంది మధ్యప్రాచ్యంలో మరింతగా ఉద్రిక్తతలకకు దారితీస్తోంది. కాల్పుల విరమణ అనేది ఇప్పట్లో సాధ్యం కాదన్న అంశం తేటతెల్లం అవుతోంది. హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేంతవరకూ తమ దాడులు ఆగవని, పాలస్తీనియన్లు ఆప్రాంతం నుంచి వెళ్లిపోవాలని పిలుపునిస్తోంది. ఈ దాడులు మరికొన్ని నెలలపాటు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. యూఎన్ సమావేశాలు 23నుంచి ప్రారంభం అవుతున్నాయి. అగ్రరాజ్యాలు యుకె, ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, మాల్టా, బెల్జియం, లగ్జెంబర్గ్, పోర్చుగల్ దాడులు కొనసాగిస్తామని చెపుతున్నారు. ఇప్పటివరకూ జరిగిన దాడుల్లో 65 వేల మంది చనిపోయారు. 90శాతం జనాభాకు మానవతా సాయం కూడా అందడంలేదని తెలుస్తోంది.

# ఇక దేశవ్యాప్తంగా 'సర్' : ఇసి అలర్ట్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** బీహార్‌లో చేపట్టినట్లే ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. అక్టోబర్- నవంబర్ మాసాల్లో చేపట్టనున్నట్లు సంకేతాలిస్తూ, ఈ నెల 30లోగా సన్నద్ధం కావాలని ఈ మేరకు అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఇసి ఆదేశాలిచ్చింది. పుట్టిన స్థలం రికార్డులను పరిశీలించి ఓటరు జాబితా నుంచి అక్రమ విదేశీ వలసదారులను తప్పించడం ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యం. కేంద్ర ఎన్నికల సంఘం అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఇటీవల రాష్ట్రాలు, కేంద్ర ప్రాంత పాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించింది. రాబోయే 10-15 రోజుల్లో ఎస్ఐఆర్ రోల్‌అవుట్‌కు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఇసి ఆదేశాలిచ్చింది. ఈ నెల 30 తేదీ లోపు చివరిసారిగా నిర్వహించిన ఎస్ఐఆర్ ఓటర్ లిస్ట్‌ను సిద్ధంగా ఉంచాలని పేర్కొంది. గత ఎస్ఐఆర్ తర్వాత ఓటర్ల జాబితాలను పలు రాష్ట్రాల సిఇఒలు ఇప్పటికే తమ వెబ్‌సైట్‌లో ఉంచారు. న్యూఢిల్లీలో చివరిసారిగా 2008లో ఎస్ఐఆర్ నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లో 2006లోచివరిసారిగా ఎస్ఐఆర్ నిర్వహించారు. చాలా రాష్ట్రాల్లో చివరిసారి ఎస్ఐఆర్ 2002-04 మధ్య జరిగింది. బీహార్ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించనున్నట్టు ఇసి ఇటీవల ప్రకటించింది. 2026లో అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది.

# హెచ్1బి వీసాలవల్ల అమెరికన్లలో పెరుగుతున్న నిరుద్యోగం

## కొలువులన్నీ విదేశీ ఉద్యోగులకే పోతున్నాయని వైట్‌హౌస్ వెల్లడి




**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** హెచ్‌వన్‌బి వీసాలు దుర్వినియోగాన్ని అరికట్టేందుకే వీసా దరఖాస్తు రుసుం పెంచడం జరిగిందని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. హెచ్‌వన్‌బి వీసాలు 2003లో 32 శాతం వరకూ పెరిగితే ఇటీవలి కాలంలో 65 శాతానికి చేరాయి. దీనివల్ల అమెరికా పౌరుల్లో నిరుద్యోగం పెరుగు తోందని, హెచ్‌వన్‌బి వీసాల దుర్వినియోగంతో అమెరికా పౌరులకంటే విదేశీయులు తక్కువ జీతాలకే రావడంవల్ల తమ పౌరులకు అన్యాయం జరుగుతోందన్న భావన పెరిగిందని, అందుకోసమే లక్షడాలర్లు ఫీజును నిర్ణయించినట్లు చెపుతోంది. కంప్యూటర్ సైన్స్ పట్టభద్రుతుల్లో నిరుద్యోగం 6.1శాతం, కంప్యూటర్ ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో 7.5శాతం నిరుద్యోగం పెరిగిందని, బయాలజీ, చరిత్ర పట్టభద్రులకు అంతకంటే రెట్టింపుస్థాయిలో నిరుద్యోగం పెరిగిందని అన్నారు. విదేశీ స్టెమ్ వర్కర్లు అమెరికాలో 2000 నుంచి 2019 వరకూ చూస్తే రెట్టింపుకంటే ఎక్కువ మంది ఉన్నారని, అందువల్లనే అమెరికాలో నిరుద్యోగం పెరిగి స్టెమ్ ఉద్యోగులకు ఉపాధిపెరుగుతోందని వైట్‌హౌస్ స్పష్టంచేసింది. మొత్తం 44.5శాతం పెరిగిందని వైట్‌హౌస్ స్పష్టంచేసింది. అమెరికా కంపెనీలు ఇపుడు హెచ్‌వన్‌బి వర్కర్ల స్థానంలో అమెరికా ఉద్యోగులను నియమించుకుంటున్నాయని ఇదొక శుభపరిణామం అని అన్నారు. ఒక కంపెనీ 5189 మంది హెచ్‌వన్‌బి వర్కర్లను 2025లో ఆమోదిస్తే అదే కంపెనీ ఈ ఏడాది 16 వేల మంది ఉద్యోగులను తొలగించిందని మరో కంపెనీ 1698మంది హెచ్‌వన్‌బి వర్కర్లకు ఆమోదం తెలిపితే 2400 మంది అమెరికా ఉద్యోగులను ఒరెగాన్‌లోని కంపెనీ తొలగించిందని గుర్తుచేసారు. మూడో కంపెనీ కూడా 2022నుంచి 27వేల మంది ఉద్యోగులను తొలగించిందని, ఈ కంపెనీకి 25,075 మందికి హెచ్‌వన్‌బి అప్రూవల్ ఇచ్చిందన్నారు. మరో కంపెనీ 1000 మందికిపైగా అమెరికన్ ఉద్యోగులను తొలగించిందని, 1137 హెచ్‌వన్‌బి అప్రూవల్స్ తీసుకుందని వైట్‌హౌస్ తెలిపింది. అమెరికాఫస్ట్, అమెరికన్‌ఫస్ట్ అన్న తమ ధృఢసంకల్పానికి అనుగుణంగానే ఈనిర్ణయం తీసుకున్నట్లు వైట్‌హౌస్ వెల్లడించింది. ట్రంప్ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి అమెరికాలో జన్మించిన వారికి ఉద్యోగాలు లభిస్తున్నాయని, అదే బైడెన్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో అన్ని ఉద్యోగాలు విదేశీ వర్కర్లకే కేటాయించారని గుర్తుచేసింది. విదేశీ జమల్లో కూడా 71 నుంచి 72శాతం భారతీయులకే వెళుతున్నట్లు గుర్తించామన్నారు. అందువల్లనే హెచ్1బి వీసా ఫీజులను లక్ష డాలర్లకు పెంచకపతప్పలేదని వైట్‌హౌస్ వివరణ ఇచ్చింది.

# శత్రువులపై ప్రతీకారం తీర్చుకోవాలి

## అటార్నీ జనరల్ పామ్ బోండీకి ట్రంప్ రహస్య సందేశం!


**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ అటార్నీ జనరల్ పామ్ బోండీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. ఈ మేరకు ఓ పోస్టు పెట్టారు. అయితే ఈ పోస్టుపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. బోండీకి ట్రంప్ వ్యక్తిగతంగా మెసేజ్ పెట్టబోయి.. బహిరంగంగా పోస్టు పెట్టారంటూ నెటిజన్లు పేర్కొంటున్నారు. అసలేం జరిగిందంటే.. తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందంటూ పామ్ బోండీతో ట్రంప్ పేర్కొన్నారు. 'మనం ఇక ఆలస్యం చేయలేం. ఇది మన కీర్తి, విశ్వసనీయతను చంపేస్తుంది. వారు నన్ను రెండుసార్లు అభిశంసించారు. అభియోగాలు మోపారు. న్యాయం జరగాల్సిన సమయం వచ్చింది' అని రాసుకొచ్చారు. మాజీ ఎఫ్‌బిఐ డైరెక్టర్ జేమ్స్ కోమీ, కాలిఫోర్నియా డెమొక్రటిక్ సెనెటర్ ఆడమ్ షిఫ్, న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్‌ను ఉద్దేశిస్తూ ఆయన ఈ పోస్టు పెట్టారు. కొంతకాలం నుంచి వీరితో ట్రంప్‌కు వైరం నడుస్తోంది. ఈ క్రమంలో వారిపై చర్యలను తీసుకోవాలనే ఉద్దేశంతో ఆయన ఈ పోస్టు పెట్టినట్లుగా ఉంది. ట్రంప్ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బోండీకి వ్యక్తిగతంగా మెసేజ్ పెట్టబోయి.. ఆయన ఆన్‌లైన్‌లో పెట్టిఉంటారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే, దీని గురించి అమెరికా అధికారులు స్పందించలేదు. మరోవైపు బోండీని ప్రశంసిస్తూ ట్రంప్ మరో పోస్టు పెట్టారు. యుఎస్ అటార్నీ జనరల్‌గా ఆమె అద్భుతంగా పనిచేస్తోందన్నారు. కానీ, తన విధానాలను ముందుకు తీసుకెళ్లేందుకు వర్జీనియాలోని లిండ్సే హాలిగాన్ వంటి ప్రాసిక్యూటర్ అవసరమని అభిప్రాయపడ్డారు. ఆమెను యుఎస్ అటార్నీగా నామినేట్ చేస్తానని ప్రకటించారు. లిండ్సే అందరికీ సమాన న్యాయం చేస్తారని వ్యాఖ్యానించారు.

# కాశ్మీర్‌లోనూ గాజా పరిస్థితులే

## మళ్లీ నోరు పారేసుకున్న పాక్ ప్రధాని

**లండన్, సెప్టెంబరు 21:** పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మరో కాశ్మీర్‌పై విషయం కక్కారు. గాజాలో పరిస్థితే కాశ్మీర్‌లోనూ ఉందని అక్కసు వెళ్లగక్కారు. కశ్మీర్ సమస్య పరిష్కారమైతేనే భారత్- పాక్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సాధారణ స్థితికివస్తాయని అన్నారు. లండన్‌లో పాక్ జాతీయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈవివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇరుప్రాంతాల్లో శాంతిస్థాపనకు భారత్ చొరవ చూపాల్సి ఉంటుందన్నారు. "భారత్-పాక్ ఇరుగుపొరుగు దేశాలు. కలిసిమెలిసి సహజీవనం సాగించాల్సి ఉంటుంది. అయితే కశ్మీర్ అంశం పరిష్కారమయ్యేంత వరకూ ఇరుదేశాల సంబంధాల్లో సాధారణ పరిస్థితి నెలకొనడం సాధ్యం కాదు. కశ్మీర్ ప్రజల రక్తం వృథా కారాదు" అని షెహబాజ్ అన్నారు. కశ్మీర్ అంశం పరిష్కారం కాకుండా ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పవచ్చని ఎవరైనా నమ్మితే వాళ్లు ఫూల్స్ ప్యారడైజ్‌లో విహరిస్తున్నట్టేనని పేర్కొన్నారు. కశ్మీర్ సమస్యపై నాలుగు యుద్ధాలు చేశామని, ఇందుకోసం లక్షలాది డాలర్లు ధార పోసామని, ఆనిధులను పాకిస్థాన్ ప్రజలఅభివృద్ధి, అభ్యుదయానికి ఉపయోగించి ఉండొచ్చని వ్యాఖ్యానించారు. పొరుగుదేశానికి సహకరించడానికి బదులు పోరాట వైఖరినే ఇండియా ప్రదర్శిస్తోందని తప్పుపట్టారు. మనం శాంతిగా జీవనం సాగించాలా, పోరాటం కొనసాగించాలా? అయితే పరస్పర ప్రేమ, పరస్పర గౌరవంతో జీవించాలన్నదే మన అభిమతం అని షెహబాజ్ అన్నారు. కశ్మీర్ అంశంపై మాట్లాడుతూనే గాజాలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాన్ని షెహబాజ్ ప్రస్తావించారు.

# 53వేల ప్యూన్‌పోస్టులకు 25 లక్షల దరఖాస్తులు




## రాజస్థాన్‌లో పెరుగుతున్న నిరుద్యోగం

**జైపూర్; సెప్టెంబరు 21:** దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతుంది. చదువుకు తగిన జాబ్ రాకపోవడంతో ఏదో ఒక జాబ్‌లో సెటిలవ్వాలన్న ధోరణిలోకి వచ్చేస్తున్నారు. రాజస్థాన్‌లో ఇటీవల ప్యూన్ పోస్టులకు ఇచ్చిన నోటిఫికేషన్‌చూస్తే నివ్వెరపోవాల్సిందే. మొత్తం 53,479 ప్యూన్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా 24.76 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ పోస్టులకు టెన్త్ అర్హత కాగా డిగ్రీ/బీటెక్, ఎంఎస్సీ, ఎంబీఏ, లా, పీహెచ్‌డీలు చేసిన వాళ్లే ఎక్కువగా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ప్యూన్ పోస్టుల కోసం సుమారు 25 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2018 నుంచి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ఇంకా సక్సెస్ కాలేకపోయాను. కనీసం ప్యూన్ జాబ్ వచ్చినా కూడా నిరుద్యోగిగా ఉండే బాధ తప్పుతుందని జైపూర్‌లోని గోపాలపుర ప్రాంతంలో కోచింగ్ తీసుకుంటున్న కమల్ కిశోర్ తెలిపారు. తాను ఎంఏ, బిఇడి పూర్తి చేశానని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఉద్యోగం రావడం అంటే జీవితానికి భద్రతఅన్నట్లే ప్యూన్‌గా నీళ్లు ఇవ్వడమైనా సరే ఏ అవకాశాన్ని కోల్పోవద్దని భావించామని పిజి పూర్తి చేసిన తనూజా యాదవ్, ఎంఏ, బిఇడి పూర్తిచేసిన సుమిత్రా చౌదరి అభిప్రాయపడ్డారు. ప్యూన్ పోస్టుల కోసం చివరి ఐదు గంటల్లోనే దాదాపు 1.11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అంటే ప్రతి ఆరు సెకన్లకు ఒక అప్లికేషన్ నమోదైంది. ఇంత భారీ ట్రాఫిక్ కారణంగా సైట్ తరచూ క్రాష్ అయ్యింది. దీనివల్ల అప్లికేషన్ ప్రక్రియలో పలువురు సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారు. కొందరి డాక్యుమెంట్లు అప్‌లోడ్ కాలేవు. దీంతో అప్లికేషన్ గడువును పొడిగించాలని పలువురు నిరుద్యోగులు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను వేడుకుంటున్నారు. చిన్న చిన్న పోస్టులకు లక్షల్లో దరఖాస్తులు రావడం రాజస్థాన్‌లో ఇదే తొలిసారి ఏమీ కాదు. గతంలో 2399 ఫారెస్ట్ గార్డు పోస్టుల కోసం దాదాపు 22 లక్షల దరఖాస్తులువచ్చాయి. ఇదిలా ఉంటే, ప్రస్తుతం రాజస్థాన్‌లో అధికారిక లెక్కల ప్రకారం 18 లక్షల నిరుద్యోగులు రిజిస్టరయ్యారు. అయితే మొత్తం నిరుద్యోగుల సంఖ్య 35 లక్షల వరకు ఉండొచ్చని అంచనా.

# సంక్షిప్తంగా..

## వాణిజ్య ఒప్పందం చర్చలకోసం అమెరికాకు కేంద్ర మంత్రి గోయల్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు తిరిగి ఊపందుకున్నాయి. ఈ ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ఖరారు చేసే లక్ష్యంతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం అమెరికాలో పర్యటించనుంది. ఈ నెల 22న ఈ బృందం అమెరికాకు బయలుదేరి వెళ్లనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయానికి చెందిన అధికారులు భారతదేశానికి వచ్చి చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. సెప్టెంబరు 16న అమెరికా చీఫ్ నెగోషియేటర్ బ్రెండన్ లించ్ నేతృత్వంలోని బృందం ఢిల్లీలో పర్యటించింది. భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ నేతృత్వంలోని అధికారులతో వారు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

## అసోం రైఫిల్స్ కాన్వాయ్‌పై మిలిటెంట్ల దాడి: ఇద్దరు మృతి

**ఇంఫాల్,సెప్టెంబరు 21:** మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై దాడి జరిగింది. ఒక వాహనంలో ఉన్న వ్యక్తులు భద్రతా సిబ్బంది కాన్వాయ్‌పై కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఇద్దరు జవాన్లు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీ మణిపూర్‌లో పర్యటించిన రోడ్డు మార్గంలో ఈ సంఘటన జరిగింది. ఇంఫాల్ శివారులోని జాతీయ రహదారిపై వెళ్తున్న అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై మెరుపు దాడి జరిగింది. ఒక వ్యాన్‌లో వచ్చిన వ్యక్తులు గన్స్‌తో కాల్పులు జరిపి పారిపోయారు. అస్సాం రైఫిల్స్‌కు చెందిన నాయిబ్ సుబేదార్ శ్యామ్ గురుంగ్, రైఫిల్‌మ్యాన్ రంజిత్ సింగ్ కశ్యప్ ఈ కాల్పుల్లో మరణించారు. మరో ఐదుగురు జవాన్లు గాయపడ్డారు. వారిని ఇంఫాల్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ కాల్పులకు సంబంధించి మణిపూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను భద్రతా సిబ్బంది శనివారం అదుపులోకి తీసుకున్నారు.

## నిషేధిత ఎల్టీటిఇ పునరుద్ధరణకు శ్రీలంక మహిళ కుట్రలు




**చెన్నై, సెప్టెంబరు 21:** నిషేధిత తమిళ ఉగ్రవాద సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం ఎల్టీటీఇ పునరుద్ధరణకు శ్రీలంక మహిళ ప్రయత్నించింది. నకిలీ పాస్‌పోర్ట్ కేసులో అరెస్టై జైలులో ఉన్న ఆమెపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేపట్టింది. మనీలాండరింగ్ ఆరోపణలపై ఆమెను ప్రశ్నించనున్నది. శ్రీలంక జాతీయురాలైన లెచ్చుమనన్ మేరీ ఫ్రాన్సిస్కా 2019 డిసెంబర్‌లో టూరిస్ట్ వీసాపై భారత్‌కు వచ్చింది. అయితే వీసా గడువు ముగిసిన తర్వాత కూడా చెన్నైలో ఉండటంతో పాటు నకిలీ పత్రాల ద్వారా భారత్ పాస్‌పోర్ట్ పొందింది. ఈ నేపథ్యంలో 2021 అక్టోబర్‌లో చెన్నై విమానాశ్రయంలో మేరీ ఫ్రాన్సిస్కాను తమిళనాడు సిఐడి అధికారులు అరెస్ట్ చేశారు. భారత్‌లో అక్రమంగా నివసించడం, నకిలీ పాస్‌పోర్ట్ పొందడం వంటి నేరాలపై ఆమెపై కేసు నమోదు చేశారు. నిషేధిత ఎల్టీటీఇ పునరుద్ధరణ, ఆ సంస్థ కార్యకలాపాలకు వనరులను సమీకరించడానికి మేరీ ఫ్రాన్సిస్కా కుట్ర పన్నినట్లు దర్యాప్తులో బయటపడింది. యాక్టివ్‌గా లేని బ్యాంకు ఖాతాలను యాక్సెస్ చేయడం, ఎల్టీటీఈ క్యాడర్ల పునఃసమూహానికి సహాయపడేందుకు నిధులు మళ్లించేందుకు ఆమె ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి.

## సాధారణ సంబంధాలకు కాశ్మీర్ సమస్యే ప్రధాన అవరోధం



**లండన్, సెప్టెంబరు 21:** కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభించకుండా భారత్‌తో సాధారణ సంబంధాలు సాధ్యమవుతాయని ఎవరైనా అనుకుంటే, అది పగటి కలలు కనడమే అవుతుందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి సమావేశాలకు హాజరయ్యే ముందు లండన్‌లో ఆయన ప్రవాస పాకిస్థానీలతో జరిగిన సమావేశంలో మాట్లాడిన షరీఫ్ ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనాలంటే కశ్మీర్ అంశాన్ని తేల్చాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ పొరుగు దేశాలు. మనం కలిసే జీవించాలి. కానీ కశ్మీరీ ప్రజల త్యాగాలు వృథా కారాదు. వారి రక్తం ప్రవహిస్తున్నంత కాలం శాంతి సాధ్యం కాదు. భారత్ సహకరించే ధోరణిలో కాకుండా యుద్ధ వైఖరితో వ్యవహరిస్తోందని షెహబాజ్ విమర్శించారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడిపై అంతర్జాతీయ దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో భారత్‌తో జరిగిన నాలుగు యుద్ధాల వల్ల తమ దేశం బిలియన్ల కొద్దీ డాలర్లను నష్టపోయిందని షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ డబ్బును పాకిస్థాన్ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఖర్చు చేసి ఉంటే దేశం ఎంతో అభివృద్ధి చెందేదని అన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# వశిష్ట గోదావరికి అఖండ హారతి

## విశేషంగా కదిలి వచ్చిన భక్తులు



ప్రభాతవార్త నరసాపురం : స్థానిక ఎన్టీఆర్ వలందర ఘాట్ లో ఆదివారం సాయంత్రం గోదావరి నదికి హారతినిచ్చా రు. ఈ కార్యక్రమానికి భక్తులు విశేషంగా వచ్చారు. వేద పండితులు అర్చకులు పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు మహా శివునికి పూజలు చేశారు. మహిళలు గోదావరికి హారతి పాటలు పాడారు.



# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను

## వినియోగించుకోండి:కలెక్టర్ నాగరాణి

భీమవరం సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : నేడు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ( పి జి ఆర్ ఎస్) ఉదయం 10.00 గంటల నుండి మ.1.30 గంటల వరకు జరుగుతుందనిజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిపిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం. ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్సైట్ నందు వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# నేటి నుంచి దసరా వేడుకలు

## పందిళ్ల లో విగ్రహ స్థాపనలు

**ప్రభాతవార్త నరసాపురం :** దసరా వేడుకలకు నగరాలు గ్రామాలు అన్ని ఆలయాలు సిద్ధమయ్యాయి. పందిళ్ళలో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. నవరాత్రులు ఎంతో భక్తిశ్రద్ధలతో వేడుకగా జరిపేందుకు వైభవపీతంగా అలంకరించారు. అమ్మవారి దేవాలయాలను మామిడి తోరణాలతో ను విద్యుత్ దీపాలతోను పూలదండలతోనూ అలంకరించారు.



# తణుకు ప్రతిష్టను ఇనుమడింపజేసిన గౌరహరి


## - అభినందించిన తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ
## - మ్యూజిక్ డైరెక్టర్ గౌరహరిని సత్కరించిన ఎమ్మెల్యే

తణుకు, సెప్టెంబర్ 21 ( ప్రభాత వార్త) : సంగీత దర్శకత్వం వహించిన రెండు చిత్రాలు పాన్ ఇండియాలో ఘన విజయం సాధించి పెట్టిన సంగీత దర్శకుడు గౌర హరి తణుకు ప్రతిష్టను మరింత ఇనుమడింపజేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జై హనుమాన్, మిరాయ్ చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన తణుకు పట్టణానికి చెందిన గౌర హరి ఆదివారం తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడారు. తణుకులో విద్యాభ్యాసం చేసిన సినీరంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సాధించుకున్న గౌరహరి భవిష్యత్తులో మరిన్ని విజయవంతమై చిత్రాలు అందించాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఉత్తమ సంగీత దర్శకుల జాబితాలో ఆయన పేరు సాధించాలని కోరారు. అనంతరం మిరాయ్ చిత్రం ప్రదర్శిస్తున్న లక్ష్మీ థియేటర్ వద్ద నిర్వహించిన సంబరాల్లో పాల్గొని ప్రేక్షకులు, గౌరహరితో కలిసి ఎమ్మెల్యే రాధాకృష్ణ చిత్రాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాలంచెల్లిన శీతల పానీయాలు విక్రయాలు

## - లోపించిన ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



వేలేరుపాడు,సెప్టెంబర్ 21, ప్రభాత వార్త : వేలేరుపాడు మండలంలో కాలం చెల్లిన శీతల పానీయాలు, ఆహార పదార్థాల అమ్మకాలు యదేచ్చగా జరుగుతున్నాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు కానీ మండలంలోని అధికారులు కానీ ఎటువంటి తనిఖీలు నిర్వహించకపోవడంతో చిన్నపిల్లలకు సైతం కాలం చెల్లినటువంటి శీతల పానీయాలను ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు షాపు యజమానులు. మండలంలో ఆదివారం చిన్న పిల్లలతో వచ్చిన కుటుంబానికి కాలం చెల్లిన శీతల పానీయాల మాజా బాటిల్ను విక్రయించారు శాపు యజమాని,అది గమనించిన కస్టమర్ ఇదేంటి అని అడగగా చూసుకోలేదని మరియొక బాటిల్ని ఇచ్చారు, కాలం చెల్లిన శీతల పానీయల బాటిల్ ను గమనించుకుంటే పిల్లలకు ప్రమాదం జరిగేదని కస్టమర్ వాపోయాడు. షాపు యజమానిని ఈ విషయమై నిలదీయగా తమకేమీ తెలియదని చూసుకోలేదని డీలర్లే ఇలాంటి బాటిల్ని మాకు సరఫరా చేస్తున్నారు అన్నట్టుగా మాట్లాడారు. ఇలాంటి కాలం చెల్లిన శీతల పానీయాలు, ఆహార పదార్థాలు అమ్ముతున్నటువంటి షాపు యజమానుల పైన మరియు డీలర్ల పైన కూడా చర్యలు తీసుకోవాలని వారిపై భారీ జరిమాణాలు విధించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎటువంటి తనిఖీలు నిర్వహించకపోవడంతోనే చాలా షాపుల్లోనూ కాలం చెల్లినటువంటి శీతల పానీయాలు, ఆహార పదార్థాలు ఎక్కువగా విక్రయిస్తున్నట్లు మండల ప్రజలు వాపోయారు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కోరారు.

# ఉద్యాన, వాణిజ్య పంటలను పరిశీలించిన

## తెలంగాణ మంత్రి తుమ్మల,

జీలుగుమిల్లి, సెప్టెంబర్-21, ప్రభాతవార్త: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకులు కొల్లూరి రాంబాబు వ్యవసాయ క్షేత్రాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల కొల్లూరి సాగు చేస్తున్న ఉద్యాన పంటలు మరియు వాణిజ్య పంటల సాగు గురించి రాంబాబును అడిగి తెలుసుకున్నారు. వాణిజ్య పంటలను లాభసాటిగా సాగు చేస్తున్న కొల్లూరి రాంబాబును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మాజీ జడ్పిటిసి సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, దమ్మపేట సొసైటీ అధ్యక్షులు రాఘవరావు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కుక్కల ధర్మరాజు, రాఘవ రెడ్డి, చిత్తపురి శేఖర్, దొడ్డ ప్రసాద్, చౌదరి రెడ్డి, కాసాని మంగేశ్వరరావు, మద్దిపాటి ప్రసాద్, అడ్వకేట్ గంగరాజు, గారు,మరియురైతులు పాల్గొన్నారు.



# జిఎస్టి సంస్కరణలు మధ్యతరగతి ప్రజలకు వరం

## నెల రోజుల పాటు జీఎస్టీపై అవగాహన -తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు, సెప్టెంబర్ 21 ( ప్రభాత వార్త) : దేశప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 చారిత్రాత్మకమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. నరేంద్రమోదీ 2014లో తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి ఉపయోగపడ్డాయని అన్నారు. ఆదివారం తణుకు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పన్నుల వ్యవస్థలో పారదర్శకతను తీసుకువచ్చి వ్యాపార అభివృద్ధితోపాటు పారిశ్రామిక అభివృద్ధి చెందుతుందని చెప్పారు. 2017లో జీఎస్టీ విధానం తీసుకురావడం వల్ల దేశంలో వ్యాపారవర్గాలు, పరిశ్రమలకు అనేక పెట్టుబడులు వచ్చాయన్నారు. దీంతో సరళతరమైన పన్నుల విధానం అమలు చేయడంతో దేశంలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. జీఎస్టీ అమలుతో చారిత్రాత్మక నిర్ణయంతో భవిష్యత్తులో దేశ ఆర్థిక ప్రగతికి దిశ నిర్దేశం చేసే విధంగా ప్రణాళికలు చేశారన్నారు. జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో జీఎస్టీ 2.0 అమలును స్వాగతించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఈ విధానం కారణంగా రాష్ట్రంలోని ప్రజలకు ప్రత్యక్షంగా భారం తగ్గుతుందని, వ్యాపారులకు లాభాలు చేకూరతాయన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలు వినియోగించే నిత్యావసరాల ధరలు తగ్గుతాయని అంతే కాకుండా వ్యవసాయ అధారిత పరికరాలపై జీఎస్టీ తొలగించడం పెద్ద ఊరట అన్నారు. జీఎస్టీ 2.0 విధానంపై రాష్ట్రంలో నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. తణుకు నియోజకవర్గంలో సైతం కూటమి నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు ఎమ్మెల్యే రాధాకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



# చనుబండలో బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

చాట్రాయి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా సేవ పరివార్ పక్షోక్షాలలో భాగంగా ఆదివారం చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో బిజెపి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు ఓబిల్లినేని రాజా, ఎస్సీ మోర్చా నాయకులు బుర్రె శ్రీకర్ లతో గ్రామ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి స్వయంగా పాల్గొని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జ్యోతి మాట్లాడుతూ స్వచ్ఛభారత్ నినాదం ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని పరిసరాలు పరిశుభ్రంగా శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని ఆమె తెలిపారు. స్వచ్ఛభారత్ పై ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. సందర్భంగా సచివాలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తుక్కును తొలగించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు చిదిరాల వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు రాజా, దార్ల సురేష్, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, మోదుగు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై దాడి చేసి బంగారం దొంగిలించిన నిందితుడు అరెస్ట్

మొగల్తూరు సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త)ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై దాడి చేసి ఆమె మెడలో బంగారం దోచేసిన నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబందించి నిందితుడును చూపుతూ నరసాపురం సిఐ దుర్గాప్రసాద్ విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన బళ్ళ సూర్య ఆదిలక్ష్మి అనే 55 సంవత్సరాల వయస్సు గల మహిళ 30 సంవత్సరాలుగా భర్తను వీడి ఒంటరిగానే తన ఇంటిలో నివాసం ఉంటుందన్నారు. కొద్దిపాటి మొత్తాలను వడ్డీలకు ఇస్తూ జీవనం సాగిస్తుందన్నారు. గ్రామానికి చెందిన మారోజు శ్రీనివాస్ అనే వ్యక్తి తన కులవృత్తి చేసుకుంటూ ఆదిలక్ష్మీ వద్ద గతంలో రూ.10వేలు అప్పు తీసుకున్నాడన్నారు. ఆ బకాయి ఇవ్వకుండానే మళ్ళీ మరో రూ.20వేలు అప్పు అడిగాడన్నారు. అప్పుల విషయం ఇద్దరి మధ్య చర్చలు కొనసాగుతుండగా ఆదిలక్ష్మి తన ఇంటిలో ఉన్న కొద్దిపాటి కలపను అమ్మమ్మని శ్రీనివాస్ ను అడిగి కలప చూసేందుకు ఇంటికి రమ్మని చెప్పిందన్నారు. శనివారం ఉదయం ఆదిలక్ష్మి కలప చూపుతుండగానే శ్రీనివాస్ అమెపై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చడంతో ఆమె సహ తప్పి గట్టిగా అరుస్తూ కిందకి పడిపోవడంతో సరిహద్దు నివాసితులు గమనించి ఇంటిలోకి వచ్చే సరికి శ్రీనివాస్ ఆమె మెడలోని బంగారు బొందు తెంపుకోవడంతో పాటు ఆమె చెవి దిద్దులు దొంగిలించుకుని ఇంటి వెనుకబాగం నుండి పరారయ్యాడన్నారు. సమీప నివాసితులు ఆదిలక్ష్మీని ఆసుపత్రికి తరలించగా బాదితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆదివారం ఉదయం కాళీపట్నం చేపల చెరువు వద్ద దాక్కుని ఉన్న నిందితుడు శ్రీనివాస్ ను అరెస్ట్ చేసి బంగారం రికవరి చేశామని నిందితుడుని కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు సిఐ తెలిపారు. ఈసమావేశంలో ఎస్ఐ జి.వాసు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



# సోలార్ వినియోగంపై శిక్షణ

చాట్రాయి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సోలార్ వినియోగంపై విజయవాడలో శిక్షణ తీసుకున్నట్లు చాట్రాయి జూనియర్ లైన్మెన్ వినోద్ కుమార్ చెప్పారు. సోలార్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తానని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇచ్చిన శిక్షణ ద్వారా ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించి సోలార్ పై అవగాహన తీసుకొస్తారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ ఎస్టీలకు సోలార్ ఉచిత పథకం చాలామందికి దీని వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియదని వారికి తెలియచెప్పేందుకు శిక్షణ పొందినట్లు చెప్పారు. ప్రతి ఇంట్లో 3కె.వి వరకు సోలార్ పెట్టుకుంటే కేంద్ర ప్రభుత్వం 78వేల రూపాయలు సబ్సిడీ ఇస్తోందని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరనున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం ఉన్నతాధికారులు ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు చెప్పారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యానికి భరోసా ఎమ్మెల్యే రోషన్ కుమార్



చింతలపూడి.. ప్రభాత వార్త :చింతలపూడి నియోజకవర్గంలో పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆరోగ్యశ్రీ వర్తించని పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు ప్రభుత్వానికి ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి తన సహాయ నిధి నుండి ఇతోదికంగా చేయూత అందిస్తున్నారని రోషన్ కుమార్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం ఆర్ ఎఫ్ ద్వారా ఆర్థికంగా ఆదుకునే ఆ కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుస్తున్నారని పేర్కొన్నారు కార్యక్రమం లో భాగంగా చింతలపూడి మండలం చింతంపల్లి నుంచి దావలూరి నాగేశ్వరావు 63,700/- బదుగు సత్యనారాయణ 71200/- ఆవుల అంజలి - 36218/- మొత్తం 1,71,118/- విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి. ఈ కార్యక్రమం లో జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు, చింతంపల్లి కిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మన తెలుగుకు వన్నెతెచ్చిన భాషా సేకరుడు గురజాడ

ఏలూరు ప్రభాతవార్త : స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం మహాకవి, గొప్పరచయిత,సంఘసంస్కర్త, సాహితీకారుడు,అభ్యుదయ కవితాపితామహులు గురజాడ అప్పారావుగారి "163 వ" జయంతి ఘనంగా నిర్వహించి నట్లు డిప్యూటీ లైబ్రేరియన్ ఎ. నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా గురజాడఅప్పారావు చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు గిడుగు రామ్మూర్తి గారితో కలసి తెలుగు వాడుకభాషావ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన "కన్యాశుల్కం"నాటకాన్ని1890 వసంవత్సరంలో పూర్తి వాడుక భాషలోరచించారు. 1892లోనాటకపుతొలి ప్రదర్శన జరిగింది. ఇప్పుడు మనకు దొరుకుతున్న"కన్యాశుల్కం" రెండవ కూర్పును1909వ సంవత్సరంలోరచించారు. ఈయనరచించినగొప్ప గేయాల్లో దేశంగర్వించదగినది, "దేశమునుప్రేమించుమన్నా మంచిఅన్నదిపెంచుమన్నా వొట్టిమాటలుకట్టిపెట్టవోయ్ గట్టిమేల్ తలపెట్టవోయ్" దేశభక్తిగీతం ఇప్పటికీ జనం గుండెల్లోచిరస్థాయిగా నిలిచిపోయింది. ఈయన తెలుగు సాహిత్యంలోవాడుకభాషఒరవడికికృషి చేసినవారిలోముఖ్యులు. కాబట్టిఈయనకు"కవిశేఖర" అనేబిరుదుకూడాఉంది. అని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాకేంద్రగ్రంథాలయం సిబ్బంది, మరియుపాఠకులు పాల్గొన్నారు.



# శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మొగల్తూరు సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో 216 నేషనల్ హైవేను అనుకుని ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకుని దర్శించుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ఉభయగోదావరి జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన పర్యవేక్షణ నిర్వహించారు. భక్తులకు పులిహార మరియు అరటి పండ్లు పంపిణీ చేయగా మహిళా భక్తులకు రెండు చొప్పున గాజులు అందజేశారు.

## ఐశ్వర్య దుర్గకు అభిషేకం



అత్తిలి- సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త): అమావాస్య ఆదివారం సందర్భంగా అత్తిలి రామన్నపేట లో రాహు గ్రహం అధిష్టాన దేవత అయిన ఐశ్వర్య దుర్గా దేవి కి అభిషేకం , కుంకుమపూజ , పుష్పార్చ న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు చేబోలు రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పూజ కార్యక్రమాన్ని తిలకించి తీర్థ ప్రసాదములను స్వీకరిం చారు. సోమవారం నుండి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రతిరోజు ప్రత్యేక అర్చనలు నిర్వహించనున్నట్లు అర్చకుడు రామలింగేశ్వర శర్మ తెలిపారు.

## వైయస్సార్ కాలనీ రోడ్లు నిర్మించాలి



అత్తిలి/ ఇరగవరం- సెప్టెంబరు 21 ఇరగవరం లోని వైయస్సార్ కాలనీలో రోడ్లు ప్రమాదాల నిలయం గా మారాయని సిపిఎం పార్టీ మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. ఆయన కాలనీలో తిరిగి అక్కడ రోడ్ల పరిస్థితులను పరిశీలించారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కనీస సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. ఈ కాలనీలో రోడ్లు వర్షం వస్తే ప్రజలు నడవలేనిస్థితి లో ఉన్నాయని, వర్షం లేనప్పుడు గుంతకలతో ప్రమాదాలు జరుగు తున్నాయని అన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, స్కూల్ కి వెళ్లే ఆటోలు తో నిత్యం తిరిగే రోడ్లపై వర్షపు నీరు నిలువ ఉండడం వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ముందుగా గుంతలను పూడ్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయులకు సత్కారం.



అత్తిలి / గణపవరం -సెప్టెంబర్ 21 ( ప్రభాత వార్త ):గణపవరం జెడ్ పి బాలుర ఉన్నత పాఠశాల లో అవిడి ప్రసాద్, మద్దాల నాగన్నలకు మండల విద్యాధికారి జి బాలయ్య , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి. వీరవేణి ఘనంగా సన్మానం చేసారు. బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట సింహాద్రి అప్పారావు , క్లస్టర్‌లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మెగా డిఎస్సి -2025లో సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా వారు ఎంపికయ్యారు. వీరు ఇద్దరూ ఒకే మండలాల్లో ఎం టి ఎస్ ఉపాధ్యాయులు గా పనిచేస్తున్నారు.

## అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త కుటుంబ సభ్యులపై కేసు.

అత్తిలి -సెప్టెంబర్ 21 (ప్రభాత్ వార్త )అత్తిలి మండలం వరిగేడు గ్రామానికి చెందిన వివాహితపై ఆడబిడ్డ పుట్టిందని వేధించడంతోపాటు అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి. ప్రేమ రాజ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2023 ఆగస్టు నెలలో వరిగేడు గ్రామానికి చెందిన మెగంటి దత్తాత్రేయతో అదే గ్రామానికి చెందిన యువతతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో నాలుగు లక్షలు నగదు, 20 సెంట్ల పొలం, ఐదు కాసుల బంగారు తో పాటు ఆడపడుచు లాంచనాలు కూడా జరిపారు. వారికి ఒక పాప జన్మించడం తో కుటుంబ సభ్యులు వేదించడంతోపాటు అదనపు కట్నం తేవాలని కూడా వేధిస్తు జూన్ 7వ తేదీన ఇంటి నుండి వెళ్ళగొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. భార్య ఫిర్యాదు మేరకు భర్త మరో ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమ రాజు తెలిపారు.

## బాల్య దశలో పిల్లల సంరక్షణ ముఖ్యం

. అత్తిలి: బాల్య దశలో పిల్లల సంరక్షణతో పాటు విద్య కూడా ఎంతో ముఖ్యమని ఐసిడిఎస్ తిరుపతిపురం సెక్టర్ పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి అన్నారు. అత్తిలి మండలం వరిగేడు గ్రామంలో స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం కింద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పోషకాహారంతో పాటు మునగాకు, మెంతికూర రోజు వారి ఆహారంగా ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ కేంద్రంలో బాలమృతం క్రింద ఇడ్లీ, రాగి పిండితో ఇడ్లీ రోజు వారి ఇవ్వాలని కోరారు. పి హెచ్ సి వైద్యురాలుఎం సురేఖ ప్రధానమంత్రి మాతృ వందన యోజన కార్యక్రమాన్ని వివరించారు. హెల్త్ అసిస్టెంట్ స్వరూప, ఎం ఎస్ కె . సంధ్యారాణి, ఆశా వర్కర్లు,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పితాని చేతుల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



పెనుమంట్ర-ప్రభాతవార్త,: పోడూరు మండలం కొమ్ముచిక్కాల క్యాంపు కార్యాలయంలో ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అనారోగ్యం బారిన పడి చికిత్సలు పొందిన లబ్ధిదారులకు ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని జుత్తిగ గ్రామనికి చెందిన తాడి సూర్య మోహనలక్ష్మి కి రూ. 20,000 వేలు, జుత్తిగ నరేంద్ర కుమర్కి రూ. 20,000 వేలు, కే రత్నకుమారి కి రూ. 23,800 వేలు మొత్తం రూ. 63,000 వేలు విలువ గల చెక్కులను అందించారు ఈ కార్యక్రమంలో జుత్తిగ టిడిపి నాయకులు టిడిపి అధ్యక్షులు గొలుగురి శ్రీనివాస్ రెడ్డి, నల్లమిల్లి నర్సిరెడ్డి, సొసైటీ చైర్మన్ వీరవల్లి రాంబాబు, మాజీ టిడిపి అధ్యక్షులు పులగం అమ్మిరెడ్డి, వీరవల్లి సత్యనారాయణ, నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## మావుళ్ళమ్మ ఆలయం అమావాస్య చండీ హెూమం



భీమవరం సెప్టెంబర్ 21ప్రభాతవార్త :అమావాస్య చండీ హెూమం భీమవరం పట్టణ ఇలవేలుపు శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం అమావాస్య సందర్భంగా చండీహెూమం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ వేదపారాయణ దారులు హెూమాన్ని నిర్వహించారు. 62 మంది దంపతులు హెూమం లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మినగేష్ ఆధ్వర్యంలోకార్యక్రమం జరిగింది.

## ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు



వేలేరుపాడు, సెప్టెంబర్ 21, ప్రభాత వార్త : వేలేరుపాడు మండలంలో ఘనంగా ప్రతి యేడు నిర్వహించే బతుకమ్మ సంబరాలను ఆదివారం శివకాశీపురం, ఎర్రబోరు, రుద్రంకోట మరియు మండలంలోని మరికొన్ని గ్రామాలలో ఘనంగా ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ బతుకమ్మ సంబరాలను మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై అంగరంగ వైభవంగా పూజలను నిర్వహించుకుని తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మతో ముగింపు పలుకుతారు. సెప్టెంబర్ 21 ఆదివారం నుండి ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు సెప్టెంబర్ 30 మంగళవారం వరకు నిర్వహిస్తారు. ప్రతిరోజు సాయంత్రం వేళ ఆడపడుచులందరూ రంగురంగుల పూలను, పత్రాలను సేకరించి అందరూ ఒకచోట చేరి అందమైన బతుకమ్మలను పేర్చి అందరూ కలిసి ఆలయం వద్ద చేరి ఆటపాటలతో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం చేస్తారు 1.ఎంగిలిపూల బతుకమ్మ 2.అటుకుల బతుకమ్మ 3.ముద్దపప్పు బతుకమ్మ, 4.నానబియ్యం బతుకమ్మ, 5.అట్ల బతుకమ్మ,6.అలిగిన బతుకమ్మ 7.వేపకాయల బతుకమ్మ,8.వెన్న ముద్దల బతుకమ్మ,9.సద్దుల బతుకమ్మ అంటూ తొమ్మిది రోజులపాటు తొమ్మిది రకాల పేర్లతో అమ్మవారిని కొలుస్తూ పూజలను నిర్వహిస్తారు. ఆహ్లాదకరమైన వాతావరణం నడుమ మండలంలోని ఆడపడుచులు బతుకమ్మ సంబరాలను ఆదివారం ప్రారంభించారు.

## ఆదిత్యడిగ్రీ కాలేజీ లో పరిశుభ్రతా కార్యక్రమం



భీమవరం సెప్టెంబర్ 21 ప్రభాతవార్త : భీమవరం శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో క్యాంపస్ పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణంలోని గార్డెన్ లోని కలుపు మొక్కలను తొలగించడం, గార్డెన్ ను శుభ్రపరచడం వంటి సేవా కార్యక్రమాలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అనురాధ,అధ్యాపకులు కుమారి జి.నిర్మల, విద్యార్థి వాలంటీర్లు ఉత్సాహంగాపాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, కళాశాల ఏ ఓ జయ్ కుమార్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం విద్యార్థులు పాల్గొన్నారు.

## తూర్పు తాళ్లలో రోడ్డు పనులకు భూమి పూజ





ప్రభాతవార్త నరసాపురం రూరల్ : నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు పంచాయతీ చామకూరి మెరకలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించబడనున్న సీసీ రోడ్ కు ఈరోజు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక వసతుల పనులు చేపడతామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, వలవల నాని, మైల వసంతరావు, బందెల రవీంద్ర, వాతడి కనకరాజు, పోలిశెట్టి నళిని, దేశీనీడి గంగాధర్, బల్ల హనుమంతు, రావూరి సురేష్, పులపర్తి సత్యనారాయణ, పులపర్తి వంశీ, పులపర్తి రాంబాబు, వలవల మురళి తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, జనసైనికులు, వీర మహిళలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

## కోటి విలువైన ఇరిగేషన్ భూమి ఆక్రమణ



కైకలూరు సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త): ఈ మధ్యకాలంలో ఎక్కడ చూసినా ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. ఖాళీ స్థలం కనబడితే చాలు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. పేదవాడికి ఓ న్యాయం, బడా బాబులకు ఓ న్యాయమా అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఎక్కడో కాదు మండవల్లి మండలంలోని లోకుమూడి రెవిన్యూ పరిధిలో కైకలూరు నుండి కోరుకొల్లు వెళ్ళే ప్రధాన రహదారి పక్కనే 30 సెంట్ల ప్రభుత్వ ఇరిగేషన్ భూమిపై సమీప గ్రామం లోని ప్రజాప్రతినిధులు కన్ను పడింది. కోట్ల విలువైన ప్రభుత్వ ఇరిగేషన్ భూముల స్థలాలను ఆక్రమించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. యథేచ్ఛగా అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో ప్లాట్ రూ. 6లక్షల నుంచి రూ. 8 లక్షలకు విక్రయించారనే వదంతులు లేకపోలేదు. అంతేకాకుండా ఏకంగా ఇరిగేషన్ అధికారుల అండదండలతో పట్టా భూమికి ఎదురుగా 30 సెంట్ల ప్రభుత్వ భూమిలో కాలువ అడ్డురాకుండా రెండు వైపులా కాంక్రీట్ గోడలు కట్టి ప్లేట్లు ఏర్పాటు చేసి మట్టితో కప్పారు. గతంలో కొందరు స్థానికులు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పేదవాడు ఇల్లు లేక ఒక సెంటులో గుడిసె వేసుకుంటే హడావిడి చేసే అధికారులు రోడ్డు పక్కగా ఉన్న లక్షల విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా వారిపై ఎందుకు చర్యలు తీసుకోరని పలువురు ప్రశ్నిస్తున్నారు. పేదవారికి ఓ న్యాయం ? బడా బాబులకు ఒక న్యాయమా అంటూ బడా బాబులకు చట్టాలు వర్తించవా? అన్న వాదనలు లేకపోలేదు. సాధారణంగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా, కట్టడాలు నిర్మించినా తక్షణమే అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి. ఈ విషయం పై ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా స్థలం ఆక్రమణకు గురయిన విషయం తెలిసిందని, సిబ్బందిని పంపి హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేశామన్నారు. చట్టం ముందు అందరూ సమానమని ఇరిగేషన్ స్థలాలు అక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలవకు ఇరువైపులా కట్టిన కాంక్రీట్ వాళ్ళను తొలగించి,ఆక్రమణలకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని పేదవారికి లేదా ప్రభుత్వ భవనాలకు కేటాయించి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా? లేకపోతే బడా బాబులకు కొమ్ము కాస్తారో వేచి చూడాలి?

## పాము కాటుకు మహిళ మృతి

చాట్రాయి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త : కూలి పనులకు వెళ్లి పాము కాటికి గురై మహిళ మృతి చెందిన సంఘటన చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు ప్రకారం చిన్నంపేట గ్రామానికి చెందిన తేళ్లూరి జయచింత (45) ఆదివారం ఉదయం తోట పనుల కోసం వెళ్ళింది. తోటలో పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో వైద్య పరీక్షల నిమిత్తం చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా ఆమె ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి భర్త ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ మండల నాయకుడు అత్తులూరి శ్రీనివాసరావు పమర్శించారు. ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మహిళ మృతితో చిన్నంపేటలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## కాలుకి గాయం యువకుడి ప్రాణాన్ని తీసింది

చాట్రాయి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త : కాలుకి గాయం అయిందని విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే కాలు తీయడంతో పాటు ప్రాణాలు పోయిన సంఘటన చాట్రాయి మండలం పర్వతాపురం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం చట్రాయి మండలం పర్వతాపురం గ్రామానికి చెందిన చొప్పరపు రాజేష్ (25), కూలి పనులకు వెళ్తూ ఉంటాడు. చెట్లు నరికేందుకు కూలికి వెళ్ళిన రాజేష్ కు చెట్టు నరుకుతుండగా కొమ్మ అతని కాలిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం నిమిత్తం విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్ళగా కాలు బోను విరిగిందని కాలు తీసేయాలని చెప్పారని కుటుంబీకులు తెలిపారు. అయితే కాలు తీసిన తర్వాత రాజేష్ మృతి చెందాడని కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు. ఆసుపత్రుల్లో వైద్యం సరిగ్గా చేయలేదని యువకుడి ప్రాణాలు బలి అయ్యాయని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతుడు రాజేష్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. యువకుడు మృతితో పర్వతాపురంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుడు రాజేష్ ను పరతాపురం సర్పంచ్ మిద్దె శివాజీ పలువురు పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## మండవల్లికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన దేవానంద్ కి అభినందన సభ



మండవల్లి సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త) : మండవల్లి గ్రామానికి జాతీయస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన డా.దేవానంద్ కుమార్ కి గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ నెల 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు తీసుకోవడంపై ఆదివారం మండవల్లి నాగేంద్ర స్వామి కళ్యాణ మండపం నందు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అభినందన సభలో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని రాష్ట్రల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు,పాలిటెక్నికల్ కళాశాలల్లో ఉపాధ్యాయులు మొత్తం 4 లక్షల పైగా దరఖాస్తు చేసుకోగా డా.మెండా దేవానంద్ కుమార్ ఎంఏ,బీఈడీ,ఎంఈడి,ఎన్.ఈ.టి,ఎంఫిల్, పి. హెచ్.డి తెలుగు శాఖ అధ్యక్షులు జాతీయ స్థాయిలో 19వ స్థానంగా నిలవడం ప్రశంసనీయమన్నారు. ఈ అభినందన సభను నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేయమని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెండ ఝాన్సీ సురేష్ బాబు, చేబోయిన వీర్రాజు, డా. సుధాబత్తుల విజయ్ కుమార్, కూనపురెడ్డి కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, గుమ్మడి వెంకటేశ్వరరావు, బొమ్మనబోయిన గోకర్ణ, గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన మానవతా



మండవల్లి సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త) : రోడ్డు ప్రమాదంలో జీవనోపాధి కోల్పోయిన కూనపరెడ్డి పాండురంగ అనే నిరుపేద కుటుంబానికి గన్నవరం గ్రామంలో మండవల్లి మండల అధ్యక్షులు కూనపరెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారులు మరియు ఉమ్మడి క్రిష్ణాజిల్లా కేరీర్ గైడెన్స్ చైర్మన్ ప్రొఫెసర్ సూదాబత్తుల విజయకుమార్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులు మరియు రూ 7 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. గత నెలలో గ్రామానికి చెందిన కూనపురెడ్డి పాండురంగ అనే వ్యక్తి ముఠా కూలి పనుల నిమిత్తం సింగరాయపాలెం గ్రోవెల్ కంపెనీకి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కానుకొల్లు గ్రామం వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి యాక్సిడెంట్ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అతని చేతి మణికట్టు విరగగా శాస్త్ర చికిత్సలు చేశారు. కాగా జీవనోపాధి కోల్పోయి కుటుంబ పోషణ ఇబ్బందికర పరిస్థితులు మధ్య కొనసాగుతున్న నేపథ్యంలో ఆ కుటుంబానికి మండవల్లి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ తరుపున నిత్యావసర సరుకులు మరియు 5 వేల రూపాయలు మరియు గ్రామస్తులు గాది వెంకటేశ్వరరావు ఆ కుటుంబానికి రెండు వేల రూపాయల కలిపి 7 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండవల్లి శాఖ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి కిన్నిబాబు, తలపంటి ప్రసన్నాంజనేయులు, విసీ అవగాహన సభ్యులు గంజాల శ్రీనివాసరావు, గ్రామస్తులు గాది వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఫ్ నిధులు





నరసాపురం ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం ప్రభాతవార్తనరసాపురం శాసనసభ్యులు నాయకర్ నరసాపురం మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ?11,35,345 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంలో అందని వైద్య సాయం...

### - 75 మందికి 32 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి రామానాయుడు



పాలకొల్లు ప్రభాతవార్త: రాష్ట్రంలో గత జగన్ ప్రభుత్వంలో పేద మధ్యతరగతి వర్గాలకు వైద్య సాయం అందలేదని నేడు కూటమి ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు అందిస్తున్నామని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మానవత్వంతో పనిచేసే కూటమి ప్రభుత్వం ను అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని.. జరిగిన మేలును పదిమందికి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేద వర్గాలకు వైద్యం కోసం ఖర్చుపెట్టిన సొమ్మును అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధి ని పునరుద్ధరించారన్నారు. పాలకొల్లులో ఆయన కార్యాలయంలో నియోజకవర్గం లో పేద వర్గాలకు వైద్య ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధిగా 75మందికి రూ32 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు.

పేదలకు వైద్య సాయం అందించలేని మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోనే ఏడాది కాలంలో 7కోట్లు13లక్షలు వరకు అందించమన్నారు. వారం వారమే కాదు నాలుగైదు రోజుల్లోనూ పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయంగా వైద్యానికి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి వర్గాలు వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ సాయం కోసం ఒకసారి దరఖాస్తు చేసుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మంజూరు అయిన తర్వాత పిలిచి ఇస్తున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో వైసీపీ నాయకులకు దరఖాస్తు చేసుకుంటే డ్రైన్ల, కాలువల వెంబడి పడవేసేవారని ఆ పార్టీ నాయకుడు దరఖాస్తు చేసుకుంటేనే దిక్కు లేదన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ చంద్రబాబు ఫోటోలు ఇంట్లో పెట్టుకుని ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా క్షేమంగా సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లడంతో పాటు 14 లక్షల కోట్లు అప్పు పెట్టి ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం చేశాడన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సమర్థతతో సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు అందిస్తున్నారన్నారు. పెన్షన్ సొమ్ము పెంపు, తల్లికి వందనం, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్న క్యాంటీన్లో, రైతులకు పెట్టుబడి సాయంగా 20 వేలు, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటివి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని తో పాటు పోలవరం ప్రాజెక్టు, ఇతర ప్రాజెక్టులు పరుగులు పెడుతున్నాయి అన్నారు. రాష్ట్రంలో టిడిపి జనసేన బిజెపి కలయిక అన్ని వర్గాల ప్రజలకు మేలైన పాలన అందుతుందన్నారు. ఒకే రోజు 75 మందికి 32 లక్షలు వైద్యసాయం అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి రామానాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్,కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, జీవి, మహమ్మద్ జానీ, పీతల శ్రీనివాస్ , బోణం నాని, పాలవలస తులసిరావు, కొల్లి కొండ ప్రసాద్, తుల రామలింగేశ్వరరావు, రియా, బిట్టా లక్ష్మీనారాయణ, ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ , మండేల రాంప్రసాద్ తదితరులు మాట్లాడారు.



# తెర



## అడవి గద్దను చంపాలంటే..

పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదుచూస్తున్న ఓజీ మరో మూడు రోజుల్లో థియేటర్స్‌లో విడుదల కానుంది. దీంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన ఓజీ మేనియా నడుస్తోంది. ఇక ఈ మధ్యనే ఈ చిత్రం నుంచి వాషి యో వాషి అనే జపాన్ హైకూను రిలీజ్ చేసిన విషయం తెల్సిందే. సుజీత్ రాసిన ఈ హైకూను పవన్ ఆలపించాడు. ఇక జపాన్ రాకపోయినా కూడా ఫ్యాన్స్.. ఎలా అయినా ఆ లిరిక్స్‌కు అర్థం తెలుసుకోవాలని చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆ సాంగ్ కింద ఇంగ్లిష్‌లో దానికి అర్థం చెప్పుకొచ్చారు. దానిని తెలుగులోకి అనువదించి ఎట్టకేలకు తెలుగు అర్థాన్ని కనిపెట్టేసారు ఫ్యాన్స్. ఈ హైకూ చెప్పడానికి ముందు పవన్.. ఇమ్రాన్ హష్మికి ఒక వార్నింగ్ ఇస్తాడు. ఓమీ.. ఓ మై డియర్ ఓమీ, ఎగెరెగిరి పడుతున్నావ్. నీలాంటివాడిని ఎలా నేలమీదకు దించాలో నాకు బాగా తెలుసు. చిన్నప్పుడు నా గురువు చెప్పిన హైకూ చెప్తాను విను అంటూ వాషి యో వాషి మొదలుపెడతాడు. ఇక ఈ హైకూకు తెలుగులో అర్థం ఏంటంటే.. గద్దా.. ఓ గద్దా.. నువ్వో అడివి గద్దను చంపాలనుకుంటే, మొదట నువ్వు దాని రెక్కలు తెగ నరకాలి, అది నేలమీద పడ్డాక దాని కళ్లు పీకేయాలి, ఒకసారి అది గుడ్డిది అయ్యాకా.. అది ఎటు పోవడానికి ఉండదు. అప్పుడు దాని కాళ్లు నరికితే ఇక ఎక్కడికి కదల్లేదు. అప్పుడు దాని రాకాసి గుండెను బయటకు లాగాలి. గద్దా.. ఓ గద్దా ..ఇది ఆ హైకూకు మీనింగ్. అంటే ఇలానే ఓజీ.. ఓమీని నాశనం చేస్తానని స్వీట్‌గా వార్నింగ్ ఇచ్చాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ హైకూ మీనింగ్ నెట్టింట వైరల్‌గా మారింది.

**దేశవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ బిజినెస్ రూ. 5 కోట్లు**

పవన్ కళ్యాణ్ ఓజీ పోస్టర్లు, వీడియోలతో సోషల్ మీడియా మారుమోగుతోంది. ఇప్పటికే మూవీ అడ్వాన్స్ బుకింగ్స్ మొదలవగా.. టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. పవన్ ఫ్యాన్స్ ఓజీ టికెట్లపై దండయాత్ర చేస్తున్నారు. ఇలా బుకింగ్స్ ఓపెన్ చేయగానే అలా క్లోజ్ అయిపోతున్నాయి. బుక్ మై షో క్రాష్ అయిపోయే రేంజ్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ జరుగుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ లోని పలు ప్రముఖ థియేటర్లు హౌజ్ ఫుల్ బోర్డులు తిప్పేశాయి. బుక్ మై షోలో సంధ్యా, శ్రీరాములు, ఏఎంబీ, గోకుల్, సుదర్శన్, బీఆర్ హైటెక్ మాదాపూర్ ఏషియన్ వంటి ప్రముఖ థియేటర్లు హౌజ్ ఫుల్ చూపిస్తున్నాయి. ఏఎంబీ గచ్చిబౌలిలో ఎర్లీ మార్నింగ్ నుంచి నైట్ లాస్ట్ షో వరకు ఒక్క టికెట్ కూడా ఖాళీ లేదు. మిగిలిన థియేటర్స్ కూడా దాదాపు ఫుల్ అయిపోయాయి.. అక్కడక్కడ ఖాళీ ఉన్నాయి. రేపటి వరకు అవి హౌజ్ ఫుల్ అయిపోతాయని తెలుస్తోంది. హైదరాబాద్‌కి చెందిన ఓ అభిమాని ఏకంగా లక్ష రూపాయలు పెట్టి ఓజీ టికెట్ కొన్నాడు. ఇంకా ట్రైలర్ కూడా విడుదల కాకముందే ఈ స్థాయిలో హైప్ క్రియేట్ అవడం ప్రేక్షకుల్లో ఓజీ క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతోంది. కేవలం ఇండియాలోనే అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల ద్వారా రూ. 5 కోట్ల బిజినెస్ చేసినట్లు సమాచారం. ఇండియాతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఓజీ ఫీవర్ పీక్స్‌లో ఉంది. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియాలో వీటి అడ్వాన్స్ బుకింగ్స్‌కి ఊహించని స్పందన లభించింది. ఇక నార్త్ అమెరికాలో 50,000 కంటే ఎక్కువ అడ్వాన్స్ బుకింగ్స్‌తో రికార్డు క్రియేట్ చేసింది.

## ఇది కేవలం సినిమా కాదు.. జీవితం

**బ్యూటీ సక్సెస్ మీట్‌లో నిర్మాత విజయ్ పాల్ రెడ్డి**



అంకిత్ కొయ్య, నీల, వీకే నరేష్, వాసుకి ప్రధాన పాత్రలో విజయ్ పాల్ రెడ్డి అడిదల, ఉమేష్ కుమార్ భన్సల్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం బ్యూటీ. ఏ మారుతి టీం ప్రొడక్ట్, వానరా సెల్యూలాయిడ్, జీ స్టూడియో బ్యానర్లపై నిర్మించిన ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని ఆర్.వి. సుబ్రహ్మణ్యం అందించగా.. జె.ఎస్.ఎస్. వర్ధన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో.. ..వీకే నరేష్ మాట్లాడుతూ బ్యూటీ మూవీలోని సోల్ మా అందరినీ ప్రమోషన్స్‌లో ఎక్కువ మాట్లాడించేసింది. ఆ సోల్ ఇప్పుడు ఆడియెన్స్‌కి కనెక్ట్ అవుతోంది. నా కెరీర్‌లో 350 మూవీలు చేసి ఉంటాను.. ఈ చిత్రానికి వచ్చిన రివ్యూలు నా జీవితంలో ఇంత వరకు రాలేదు. నా కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. కానీ ఈ మూవీ నాకు మాత్రం ఎంతో స్పెషల్. ప్రతీ ఒక్కరికీ, అన్ని వర్గాల వారికి కనెక్ట్ అయ్యే చిత్రమిది. అందరి మనసులకు హత్తుకునే మూవీని తీసిన వర్ధన్‌ను చూస్తుంటే గర్వంగా ఉంది. సుబ్బు మంచి కథను ఇచ్చారు. సాయి కుమార్ కెమెరావర్క్ ఎంతో అందంగా అనిపించింది. విజయ్ పాల్ రెడ్డి ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ఒకే నెలలో సక్సెస్, ఫెయిల్యూర్ చూశాడు. నిండు కుండ తొణకదు అన్నట్టుగా నిర్మాత ఉన్నారు. అని అన్నారు.

..అంకిత్ కొయ్య మాట్లాడుతూ.. బ్యూటీ అందరికీ రీచ్ అయింది. క్లైమాక్స్ తరువాత అందరూ కన్నీళ్లు తుడుచుకుంటున్నారు. అదే మా విజయం అని అన్నారు. డైరెక్టర్ జె.ఎస్.ఎస్ వర్ధన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 15 థియేటర్లను విజిట్ చేశాను. ప్రతీ ఒక్కరూ మూవీని ఎంజాయ్ చేస్తున్నారు. ఏదో ఒక చోట.. ఎక్కడో ఓ సీన్‌కు ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతారు అని అన్నారు.

నిర్మాత విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ మన జీవితాల్ని చూపించే, ప్రతీకగా నిలిచే చిత్రమిది. ఇది కేవలం సినిమా కాదు.. జీవితం అని అన్నారు. ..హీరోయిన్ నీల మాట్లాడుతూ బ్యూటీ మూవీని ఇంతలా ఆదరిస్తున్న మీడియాకి, ప్రేక్షకులకు థాంక్స్ అని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ బ్యూటీలాంటి మంచి చిత్రాలు వచ్చినప్పుడు మీడియా ఎప్పుడూ సపోర్ట్ చేస్తూనే ఉంటుంది అని అన్నారు. రైటర్ ఆర్.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతీ రోజూ షోలకు డిమాండ్ పెరుగుతోందన్నారు. మహిళలు అయితే సినిమా చూసిన తరువాత కంటతడి పెట్టుకుంటున్నారు అని అన్నారు. కెమెరామెన్ సాయి కుమార్ ధారా తదితరులు మాట్లాడారు.



## హాలీవుడ్.. వెబ్ సిరీస్‌లో..

ఇటీవల 3 బీహెచ్‌కే మూవీతో మంచి విజయంతో పాటు సినీ విమర్శకుల నుంచి కూడా మంచి ప్రశంసలు అందుకున్న సిద్ధార్థ్ ఓ జాక్ పాట్ కొట్టాడు. తాజాగా ఆయన ఓ హాలీవుడ్ వెబ్ సిరీస్‌లో నటించేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. అన్‌కస్టమైజ్డ్ ఎర్త్ అనే పేరుతో రూపుదిద్దుకునే ఈ వెబ్ సిరీస్ మొత్తం 8 ఎపిసోడ్‌లు. తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కనుంది. ఫ్రిధా పింటో కథానాయిక కాగా రితేష్ భద్ర దర్శకుడు. వార్నర్ బ్రదర్స్ టెలివిజన్‌తో కలిసి జాన్‌వెల్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ప్రేమ, సంస్కృతి సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిర్మించే ఈ వెబ్‌సిరీస్‌ను అన్ని వర్గాల ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేసేలా రూపొందించనున్నట్టు దర్శకుడు వెల్లడించారు. బాధ్యత కలిగిన ఒక గృహిణి.. తన మాజీ ప్రియుడిని చూడగానే ఆమె జీవితంలో చోటుచేసుకునే మార్పులు, ఒక వ్యాపారవేత్త తన బిజినెస్, ప్రేమ బ్యాలెన్స్ చేయలేక ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారన్న రెండు వేర్వేరు కథాంశాలను బ్యాలెన్స్ చేస్తూ రూపొందిస్తున్నట్టు దర్శకుడు వివరించారు.

## కాదంబరిని స్ఫూర్తిగా తీసుకోవాలి



నటుడు కాదంబరి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మనం సైతం ఫౌండేషన్ పుష్కర మహోత్సవం హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో ఘనంగా జరిగింది. పన్నెండేళ్లుగా సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఈ ఫౌండేషన్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాదంబరి కిరణ్ మాట్లాడుతూ, 'సీనియర్ జర్నలిస్ట్ జీ. కృష్ణ స్ఫూర్తితోనే సమాజిక సేవ ఆలోచన వచ్చింది. 12 ఏళ్లుగా చేస్తున్న ఈ సేవా కార్యక్రమాల్లో ఎందరో మహానుభావులు ఆశీర్వదించారు. మద్దతు తెలిపారు. వారందరి సహకారంతోనే ఈ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నాం అని అన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ, రాజకీయాలకు సామాజిక సేవలకు సంబంధం లేదు. భారతీయుల్లో సేవా భావం ఉంటుంది. కిరణ్ సేవలకు మా మద్దతు ఉంటుంద్ని అని పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ, 'సమాజంలో ఒకరికొకరు తోడైతేనే మనుగడ ఉంటుందన్నారు. మనం సైతం ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు నా మద్దతు ఉంటుంది అని ఫిలిం నగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్య నారాయణ తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సమాజం కోసం ఎంతో కొంత సేవ చేయాలని కోరుకునే కిరణ్‌కు మనందరి సపోర్ట్ ఉండాల్లి అని అన్నారు. సినీ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 'ఆపదలో ఉన్నవారికి సేవ చేస్తే భగవంతుడు మనకు మేలు చేస్తాడు. కిరణ్‌కు దేవుడు మంచి మనసు ఇచ్చాడ్ను అని పేర్కొన్నారు. టీవీ9 జర్నలిస్ట్ ప్రుథ్వీ మాట్లాడుతూ, కరోనా సమయంలో ఆయన సేవా కార్యక్రమాలు నేను ప్రత్యక్షంగా చూశాను. ఎంతో మందికి నిత్యావసరాలతో పాటు ఆర్థిక సహాయం చేశార్ను అని కొనియాడారు. జర్నలిస్ట్ సాయి మాట్లాడుతూ, 'సినిమా వాళ్లు సాధారణంగా తమ ప్రచారాన్ని, ఎదుగుదలను కోరుకుంటారు. కానీ కాదంబరి కిరణ్ సమాజం కోసం నిరంతరం సేవ చేస్తారు. ఆయనను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాల్లి అని అన్నారు. టీవీ5 మూర్తి మాట్లాడుతూ, 'ప్రపంచంలో ఎన్నో సంస్థలు ఉన్నా, కాదంబరి కిరణ్ మనలో ఉన్న మనిషిని గుర్తు చేస్తున్నారు. ఎవరికైనా కష్టం వస్తే కన్నీళ్లు వస్తాయి. కానీ మనిషికి కష్టం వస్తే కాదంబరి కిరణ్ వస్తాడ్ను అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కాజా సూర్యనారాయణ, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, అశోక్ కుమార్, సురేష్ కొండేటి, టీఆర్ఎస్ రాఘవ, సాంబశివరావు, డీవీ రావు తదితరులు పాల్గొన్నారు.



## 600 మంది డ్యాన్సర్లతో మాస్ సాంగ్

మాస్‌కు కేరాఫ్ నందమూరి బాలకృష్ణ. ఆయనకు తోడు బోయపాటి శ్రీను కలిస్తే ఇక ఊరమాసే. వీరిద్దరి సినిమా అంటూ అభిమానుల అంచనాలు కూడా ఊరమాస్ స్థాయిలో ఆకాశాన్ని తాకుతుంటాయి. వీరిద్దరి కలయిక వస్తున్న నాలుగో చిత్రం అఖండ2: తాండవం. సంయుక్త మీనన్ కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్రలో కనిపిస్తారు. ఎం.తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో 600 మంది డ్యాన్సర్ల నేపథ్యంలో బాలకృష్ణపై మాస్ సాంగ్‌ను తెరకెక్కిస్తున్నారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. బాలకృష్ణ మాస్ మూమెంట్స్‌తోనూ... తమన్ బాణీతోనూ అదిరిపోయేలా ఈ పాట ఉంటుంది. థియేటర్లలో అభిమానుల్ని, ప్రేక్షకుల్నీ ఉర్రూతలూగించడం పక్కా. భారీ హంగుల మధ్య చిత్రీకరణ జరుగుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ అద్భుతమైన స్పందన వచ్చింది. ఇందులో బాలకృష్ణ మునుపెన్నడూ కనిపించని రీతిలో, ఉగ్రమైన అవతారంలో కనిపిస్తారని చిత్ర బృందం తెలిపింది.

## చిత్తూరు యాసలో డబ్బింగ్

అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రస్తుతం తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్ లో చేస్తున్నాడు. ఈ సినిమా టాకీ పార్ట్ 80 పూర్తి అయింది. ఇంకా క్లైమాక్స్ షూట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం టీమ్ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ను శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉంది. ఇందులో భాగంగా అఖిల్ వచ్చే వారం నుంచి డబ్బింగ్ చెప్పనున్నాడని తెలుస్తోంది. అన్నట్టు తన పాత్రకు చిత్తూరు యాసలో అఖిల్ డబ్బింగ్ చెప్పనున్నాడు. అందుకోసం అఖిల్ ప్రత్యేకంగా చిత్తూరు యాసను నేర్చుకున్నాడట. కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.

## ఇది మీకు తగిన గుర్తింపు

దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం సొంతం చేసుకున్న మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్‌ను సినీ సెలబ్రిటీలు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మోహన్‌లాల్‌ను అభినందిస్తూ



సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నా ప్రియమైన లాలెట్టన్, ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు వరించినందుకు హృదయపూర్వక అభినందనలు. మీ అద్భుతమైన ప్రయాణం, ఐకానిక్ పెర్ఫార్మెన్స్ భారతీయ సినిమాను సుసంపన్నం చేశాయి. నిజంగా ఇది మీకు తగిన గుర్తింపు అని పేర్కొన్నారు. అంతేకాదు మోహన్‌లాల్‌తో ఉన్న ఫోటోని షేర్ చేశారు.



## సెన్సేషనల్ రికార్డ్

యంగ్ హీరో తేజ సజ్జా వరుస విజయాలతో ఓవర్సీస్‌లో అరుదైన రికార్డ్ సాధించాడు. హనుమాన్ తర్వాత తాజాగా విడుదలైన మిరాయ్ కూడా 2.5 మిలియన్ డాలర్స్ వసూళ్లు రాబట్టింది. దీంతో ప్రభాస్ (సలార్, కల్కి), ఎన్టీఆర్‌ల సరసన తేజ నిలిచాడు. వరుసగా రెండు సినిమాలతో ఈ మార్క్ దాటిన మూడో హీరోగా గుర్తింపు తెచ్చుకున్నాడు. పాన్ ఇండియా రేంజ్‌లో దూసుకెళ్తున్న తేజ, భారీ బడ్జెట్లు, స్టార్ డైరెక్టర్ల అవసరం లేకుండానే కంటెంట్‌తోనే స్టార్ రేంజ్ వసూళ్లు సాధించగలమని నిరూపించాడు.

యంగ్ హీరో తేజ సజ్జా హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన మిరాయ్ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, ఆయన కుమార్తె కృతి ప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. ఈ మూవీలో రితికా నాయక్, మంచు మనోజ్, శ్రియ, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. పాన్ ఇండియా చిత్రంలో రిలీజైన మిరాయ్ ఫస్ట్ డే ప్రపంచవ్యాప్తంగా రూ.27.2 కోట్లు వసూలు చేసింది. ఐదు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ మూవీ ఫస్ట్ వీక్‌లో రూ.112.10 కోట్లు వసూలు చేసింది. రెండో వారంలోనూ తన ప్రభావం చూపిస్తూనే ఉంది. ఇందులో తేజ, మంచు మనోజ్ యాక్టింగ్,, ఇద్దరి మధ్య వచ్చే యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్‌కి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. మిరాయ్ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఓవర్సీస్ లోనూ దుమ్మురేపుతోంది. నార్త్ అమెరికాలో తాజాగా 2.5 మిలియన్ డాలర్ క్లబ్‌లోకి ఎంటరై అరుదైన ఘనతని అందుకుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా ప్రకటించింది. యూఎస్ బాక్సాఫీస్ వద్ద మిరాయ్ దూసుకుపోతోందని, ప్రేక్షకుల ప్రేమ, అభిమానంతో నార్త్ అమెరికాలో 2.5 మిలియన్ డాలర్ల కలెక్షన్లు దాటి 3 మిలియన్ డాలర్ల మార్క్ దిశగా పయనిస్తున్నామని మేకర్స్ ప్రకటించారు.

## ఈసారి సెంటిమెంట్ టచ్చే



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా మారాడు. నిజం చెప్పాలంటే ఆయన ఏది పట్టుకున్నా బంగారంగానే మారుతుంది. హీరోగా సక్సెస్, డైరెక్టర్‌గా సక్సెస్, నిర్మాతగా సక్సెస్.. ఇలా ఏ సినిమాలో అయినా ధనుష్ ఉన్నాడు అంటే అది కచ్చితంగా విజయాన్ని అందుకుంటుంది. ఇక తాజాగా ధనుష్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం ఇడ్లీ కొట్టు డాన్ పిక్చర్స్ వండర్‌బార్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్ పై ఆకాష్ భాస్కరన్ ధనుష్ మరియు ధనుష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఇడ్లీ కొట్టు సినిమాలో ధనుష్ సరసన నిత్యా మీనన్, షాలిని పాండే నటిస్తుండగా.. అరుణ్ విజయ్ , సత్యరాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఎప్పటిలానే ధనుష్ ఈసారి కూడా సెంటిమెంట్ తో కొట్టేశాడు. తండ్రికొడుకుల మధ్య అనుబంధం ఈ సినిమాలో చాలా ఎక్కువ చూపించబోతున్నారని తెలిసింది. కథ విషయానికొస్తే.. మురళీ (ధనుష్) వాళ్ల నాన్న కుల వృత్తి ఇడ్లీ కొట్టు. గ్రామంలో వారి ఇడ్లీ కొట్టు చలా ఫేమస్. ఇంకా చెప్పాలంటే ఆ గ్రామనికే మూల స్తంభం ఆ ఇడ్లీ కొట్టు. తండ్రిలానే మురళీ కూడా చెఫ్ అవుతాడు. కానీ, తండ్రి కొట్టు కాకుండా సిటీలో అశ్విన్ (అరుణ్ విజయ్) తండ్రి రెస్టారెంట్‌లో చెఫ్‌గా చేరతాడు. అతడు వచ్చాకా ఆ రెస్టారెంట్ షేర్స్ బాగా పెరుగుతాయి. అది అశ్విన్‌కి నచ్చదు. ఎంత కష్టపడి పనిచేసినా మురళీని పనోడిగానే చూస్తారు. ఇంకోపక్క కొడుకు తన వారసత్వాన్ని వదిలి బయట పనిచేయడం ఇష్టం లేని మురళీ తండ్రి మరణిస్తాడు. ఇక మురళీ.. తన తండ్రి చివరి మాట వలన స్వంత వూరికి చేరుకొని తండ్రి ఇడ్లీ కొట్టునే నడపడం మొదలుపెడతాడు. మురళీ వెళ్లిపోవడంతో అశ్విన్ రెస్టారెంట్ కుప్పకూలుతుంది. దీంతో అశ్విన్.. మురళీ ఇడ్లీ కొట్టును ఏం చేశాడు.. ? తండ్రి మాట వినకుండా అశ్విన్.. మురళీపై పగ ఎలా తీర్చుకున్నాడు.. ? అసలు మురళీ జీవితంలోకి వచ్చిన కళ్యాణి ఎవరు.. ? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. ధనుష్ సినిమా అంటే.. కచ్చితంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించే అంశాలు ఉంటాయి. ఇడ్లీ కొట్టు ఒక తండ్రి కలను కొడుకు ఎలా నిజం చేశాడు. ఆయన గౌరవాన్ని ఎలా కాపాడాడు. ట్రైలర్ లో కూడా తండ్రీకొడుకుల బాండింగ్‌ను బాగా చూపించారు. సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం మరో హైలెట్. మొత్తానికి ట్రైలర్ తోనే సినిమాపై అంచనాలను పెంచేశారు. కచ్చితంగా ధనుష్ మరో హిట్ అందుకోవడం గ్యారెంటీ అని నెటిజన్స్ చెప్పుకొస్తున్నారు. మరి ఈ సినిమాతో ధనుష్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలంటే అక్టోబర్ 1 వరకు ఆగాల్సిందే.

## హారర్ జోనర్‌లోకి ఎంట్రీ!



ఆంధ్ర కింగ్ తాలూకా తరువాత ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని కొత్త సినిమా ఖరారైనట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ ఆర్కా మీడియా వర్క్స్ నిర్మించనుండగా, కిశోర్ అనే కొత్త దర్శకుడు దీనితో తెరంగేట్రం చేయబోతున్నారు. ఇప్పటి వరకు రామ్ ప్రయత్నించని ఓ కొత్త జానర్‌లో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. విభిన్నమైన హారర్ థ్రిల్లర్‌గా కథను సిద్ధం చేస్తున్నారని సినీ వర్గాల సమాచారం. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జోరుగా కొనసాగుతుండగా, అన్ని అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది ప్రారంభంలో చిత్రీకరణ మొదలయ్యే అవకాశం ఉందని టాక్.

టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని త్వరలో ఆంధ్రా కింగ్ మూవీతో ప్రేక్షకుల్ని అలరించేందుకు రాబోతున్నాడు. ఇటీవల కాలంలో సరైన హిట్ లేని రామ్ తాజా చిత్రంపై భారీ ఆశలు పెట్టుకున్నాడు. ఇందులో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. ఈ చిత్రం తర్వాత రామ్ చేయబోయే ప్రాజెక్టుపై తాజాగా క్లారిటీ వచ్చింది. రామ్ ఇప్పటివరకు లవ్, యూత్, ఫ్యామిలీ, యాక్షన్ జోనర్లో మాత్రమే నటించగా తొలిసారి హారర్ జోనర్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఆర్కా మీడియా వర్క్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న ఈ సినిమాకు కిశోర్ అనే కొత్త దర్శకుడు పరిచయం కానున్నాడు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్, అన్నీ అనుకున్నట్లే జరిగితే వచ్చే ఏడాది ఆరంభంలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం తెలుగులో హారర్ జోనర్ నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. చానాళ్లుగా హిట్ లేని బెల్లంకొండ శ్రీనివాస్ ఇటీవల కిష్కింధపురి అనే హారర్ చిత్రంతో వచ్చి సూపర్‌హిట్ అందుకున్నాడు. ఈ చిత్రం కేవలం మూడు రోజులోనే బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల్లోకి ఎంటరైంది. ఈ నేపథ్యంలోనే రామ్ కూడా హారర్ జోనర్ తనకు కలిసొస్తుందని నమ్ముతున్నాడట.


2006లో దేవదాస్ సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన రామ్, మొదటి సినిమాతోనే మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేశాడు. ఆ తర్వాత జగడం, మస్కా, రెడీ లాంటి చిత్రాలతో యూత్ హీరోగా పేరుపొందాడు. 2011లో వచ్చిన కందిరీగ ఆయన కెరీర్ టర్నింగ్ పాయింట్‌గా మారింది. ఆ తర్వాత ఎందుకంటే ప్రేమంటా, ఒంగోలు గిత్త, పండగా చేస్కో చిత్రాలతో ఓ మోస్తరు హిట్లు అందుకున్నాడు. 2019లో విడుదలైన ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్‌లో మాస్ ఇమేజ్ పెంచిన బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీనికి పూరీ జగన్నాథ్ దర్శకుడు. ఆ తర్వాత రెడ్, ది వారియర్, స్కంద వంటి చిత్రాల్లో యాక్షన్ యాంగిల్‌ని చూపించినా ప్రేక్షకులు పట్టించుకోలేదు.

## భారీ స్టంట్స్ ప్రాక్టీస్



తమిళ స్టార్ హీరో సూర్య - వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా రాబోతుంది. ఇప్పటికే, ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించిన చిత్ర యూనిట్, ఇటీవలే లాంగ్ షెడ్యూల్‌ను శరవేగంగా పూర్తి చేసుకుంది. కాగా, తాజాగా ఈ మూవీ కొత్త షెడ్యూల్ కోసం రెడీ అవుతుంది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీన్స్ ను షూట్ చేయనున్నారు. ఈ సీన్స్ కోసం సూర్య స్టంట్స్ కూడా ప్రాక్టీస్ చేస్తున్నాడట. ఇక ఈ సినిమాకు వెంకీ అట్లూరి విశ్వనాథన్ అండ్ సన్స్ అనే ఆసక్తికర టైటిల్‌ను ఫిక్స్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా ఈ సినిమాలో అందాల భామ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. జి వి.ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలోనే ఇచ్చేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఇంతకీ ఈ సినిమా ఏ రేంజ్ లో విజయాన్ని అందుకుంటుందో చూడాలి. ఈ సినిమా పై మాత్రం భారీ అంచనాలు ఉన్నాయి.

## దీపిక రేంజ్ బ్యూటీ కోసం వేట




కల్కి 2తో దీపిక పదుకొనేకు బంధం తెగిపోయింది.. ఈ సినిమా నుంచి ఆమెను తప్పించేసారు.. ఇదంతా గతం. మరి ఫ్యూచర్ ఏంటి..? కల్కి 2లో దీపిక ప్లేస్ రీ ప్లేస్ చేసే ఆ హీరోయిన్ ఎవరు..? ఆమె స్థాయిలో ప్యాన్ ఇండియన్ ఇమేజ్ ఉన్న స్టార్ ఎవరు..? ప్రభాస్ క్రేజ్‌ను మ్యాచ్ చేసేంత సత్తా ఉన్న బ్యూటీ ఎవరు..? ఇప్పుడు ఇవే ప్రశ్నలు ఫ్యాన్స్‌కు ఉత్సంఠ రేకిస్తున్నాయి. షూటింగ్ మొదలవ్వక ముందే తమ సినిమా ఈ రేంజ్‌లో ట్రెండ్ అవుతుందని అస్సలు ఊహించి ఉండరు కల్కి 2 మేకర్స్. త్వరలోనే ఈ చిత్ర షూట్ మొదలు కానుంది.. కానీ ఆలోపే దీపికను సినిమా నుంచి తప్పించి బాంబ్ పేల్చారు దర్శక నిర్మాతలు. పైగా జరిగింది నువ్వెలాగూ మార్చలేవు.. కానీ జరగబోయేది నీ చేతుల్లోనే ఉంటుందంటూ పోస్ట్ చేసారు దర్శకుడు నాగీ. దీపిక పదుకొనేను తీసేసిన తర్వాత కల్కి 2 హీరోయిన్ రేసులో ఎవరెవరు ఉన్నారనేది ఆసక్తికరంగా మారిందిప్పుడు. దీపిక రేంజ్ ఇమేజ్ ఉన్న బ్యూటీ ప్రియాంక చోప్రా.. కానీ ఈమె ఎస్ఎస్ఎంబి29తో బిజీగా ఉన్నారిప్పుడు. సో.. రేస్ నుంచి ప్రియాంక లేనట్లే. కత్రినా కైఫ్, కృతి సనన్ లాంటి వాళ్లు ఈ క్యారెక్టర్‌కు అంతగా సూట్ అవ్వరు.. అంటే వాళ్లు కూడా లేనట్లే. సాహోలో నటించిన శ్రద్ధా కపూర్ వైపు నాగీ అడుగులు పడతాయా లేదంటే సౌత్ ఫీల్ కోసం మృణాళ్ ఠాకూర్ లాంటి హీరోయిన్ వైపు వెళ్తారా అనేది కూడా ఆసక్తికరమే. అన్నింటికీ మించి హిట్ పెయిర్ కావాలనుకుంటే కల్కి 2 బెస్ట్ ఆప్షన్ అనుష్క శెట్టి కూడా అవ్వొచ్చు. బాహుబలిని మించిన కథ వస్తే.. ప్రభాస్‌తో నటిస్తానని ఈ మధ్యే చెప్పారు స్వీటీ. కల్కి 2లో దీపిక స్థానాన్ని భర్తీ చేయబోయే హీరోయిన్ ఎవరైనా.. ప్రభాస్ కటౌట్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిందే. దీపిక చాలా హైట్.. కాబట్టి నెక్స్ కల్కి 2లోకి ఎంట్రీ ఇవ్వబోయే భామకు ఎత్తు కీలకమే. ప్రస్తుతానికి చాలా మంది పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఈ బంపర్ ఆఫర్ ఎవరికి దక్కుతుందో మరికొన్ని రోజుల్లోనే తేలనుంది.

## వారానికోసారి ..



రోజూ అందం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే సమయం ఉండక పోవచ్చు. కానీ వారానికి ఒక్కసారైనా ఈ విషయాలపై కొంత సమయం కేటాయించా లంటున్నారు నిపుణులు.

◆ వారానికి ఒక్కసారైనా హెర్బల్ నూనెలతో శరీరానికి మద్దన చేసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. చర్మం కాంతిమంతంగా మారుతుంది.

◆ తీరిక దొరికినప్పుడల్లా ముఖంలో పేరుకున్న మృత కణాలను తొలగించు కునేందుకు స్క్రబ్ చేసుకుకంటాం. అలానే వారానికోసారైనా శరీరం మొత్తానికి అంటే.. వీపు, మెడ, కాళ్లకు కూడా స్క్రబ్ అవసరం.డీప్ క్లెన్సింగ్ మిల్క్‌ని అందుకోసం ఉపయోగించచ్చు. పాలు, పంచ దార వంటి.. సహజసిద్ధమైన పదార్థాలనూ వాడచ్చు.

◆. చర్మంపై మృతకణాలు పోయి నిగారింపు రావాలంటే కనీసం అప్పుడప్పుడు ముఖానికి ఫేసియల్ అవసరం. అలాగని పార్లర్‌కే వెళ్లాలని లేదు. ఇంట్లో పండ్ల గుజ్జులో కూడా ప్యాక్‌లు వేసుకోవచ్చు. తద్వారా ట్యాన్ పోయి ముఖం తాజాగా కనిపిస్తుంది.

## తెలుసుకుందాం..



కేథరిన్ జాన్సన్.. అమెరికాకు చెందిన గణిత శాస్త్రజ్ఞురాలు. నాసా ఉద్యోగినగా పనిచేసిన ఈమెను అమెరికన్ హ్యూమన్ కంప్యూటర్‌గా పిలుస్తారు. నాసా వ్యోమగాములను చంద్రుని మీదకు పంపించ టం, తిరిగి వారిని సురక్షితంగా కిందకు రప్పించటంలో ఈవిడ గణిత నైపుణ్యాలు ఎంతగానో తోడ్పడ్డాయట.

## ఆమెకు 'వింగ్స్ ఆఫ్ స్టీల్' అవార్డు..



విశాఖ స్టీల్ ప్లాంట్ సంస్కరణల్లో భాగంగా కార్మికుల తొలగింపు, స్వచ్ఛంద పదవి విరమణ (వీఆర్ఎస్)లతో క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటి సమయంలో వనరుల విభాగానికి బాధ్యతలు నిర్వర్తించడం కత్తిమీద సామే. కానీ ఆ సంకల్పంతో అధిగమిస్తున్నారు నల్లి భాను. ఆ సేవలకు ఇండియన్ స్టీల్ అసోసియేషన్(ఐఎస్ఏ) నుంచి 'వింగ్స్ ఆఫ్ స్టీల్' పేరుతో ఈ ఏడాది జెండర్ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు.

మాది తూర్పుగోదావరి జిల్లా. నాన్న భాస్కరరావు నీటిపారుదల విభాగంలో చీఫ్ చేసి రిటైరయ్యారు. మేం నలుగురు పిల్లలం. ఏదైనా సొంతగా మనమే చేసుకో ప్రోత్సహించే వారు నాన్న. మా అమ్మకి పిల్లలు బాగా చదువుకోవడం, ఉద్యోగం ఇష్టం. కాకినాడ జేఎన్టీయూలో ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉండా ప్లాంటులో ఉద్యోగానికి ఎంపికయ్యాను. మేనేజ్మెంట్ ట్రైనీ(టెక్నికల్)గా నా ప్రస్తానం ఎపి ఐఐసీలో పనిచేసిన తాళ్లూరి జయబాబుతో వివాహ మైంది. మాకు ఇద్దరు ఆ ప్లాంటులో ఉద్యోగం చేస్తూనే ఎంబీఏ (మార్కెటింగ్), పాండిచ్చేరి విశ్వ విద్యాలయ కంప్యూటర్ అప్లికేషన్‌లో మాస్టర్స్ పూర్తి చేశాను.

**మానవ వనరులపై అధ్యయనం ...**

విజయవంతంగా శిక్షణను పూర్తిచేశాక మేనేజ్‌మెంట్ సర్వీసెస్ విభాగానికి పంపారు. రెండు దఫాలుగా 20ఏళ్లపాటు అక్కడ పనిచేశాను. ఇండస్ట్రియల్ రిలేషన్స్(ఐఆర్) అంటే చర్చలు జరపడం, అందరినీ సమన్వయం చేసి ఒప్పించడంలో విజయవంత మయ్యేదాన్ని. ఉద్యోగులకు నెలవారీ ప్రోత్సాహకాలను ఆటోమేటిగ్గా గణన చేసేందుకు ఒక ప్రోగ్రాం తయారుచేశాను. దీనికి ఉద్యోగి తక్షణ గుర్తింపు (ఈఐఆర్ఎస్) కింద అవార్డు అందుకున్నాను. మానవ వనరుల ప్రణాళిక, ప్రోత్సాహకాలు, క్వాలిటీ సర్కిల్స్, వాల్యూ ఇంజినీరింగ్, ప్రొబేషన్ స్కీం... వంటి పనుల్ని సమర్థంగా నిర్వహించాను. 2030 నాటికి ప్లాంటులో ఎగ్జిక్యూటివ్ నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగాల్లో ఎంత మానవ వనరులుండాలి, నియామక ప్రణాళిక ఎలా ఉండాలనే అంశాలపైన అధ్యయనం చేశాను. ఫిట్‌నెస్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు ఎంత ఉండాలి, ఏ వయసు వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలి... లాంటి విషయాలపైనా సూచనలు చేశాను. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్(విశాఖ స్టీల్ ప్లాంటు)లో ప్రవేశపెట్టిన 'క్వాలిటీ సర్కిల్స్' వల్ల ఎంత ఉపయోగం జరిగింది? ఏ స్థాయికి మారింది? అనే అంశాలపైన దక్షిణ కొరియాలోని చాంగ్‌వాన్ నగరంలో జరిగిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ (ఐసిక్యూసిసి) సదస్సులో పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చాను. అంతకముందు ఫిలిప్పైన్స్‌లోని మనీలాలో క్వాలిటీ సర్కిల్స్‌పై జరిగిన సదస్సులోనూ పాల్గొన్నాను. ఇలా క్వాలిటీ సర్కిల్స్‌పై పత్రాలు సమర్పించి కంపెనీకి అనేక అవార్డులు తెచ్చారు.

**సహనంతో వినాలి..** ట్రైనింగ్ డిపార్ట్మెంట్ హెచ్వోడీగా, ఉక్కు గెస్ట్ హౌస్ నిర్వహణ... లాంటి భిన్నమైన విధుల్నీ నిర్వహించా. ప్రస్తుతం హెచ్ఆర్ జీఎంగా పనిచేస్తున్నా. కార్మికుల సమస్యలను ఓపిగ్గా వింటే ఎలాంటి పరిస్థితి అయినా సాధారణ స్థితికి వస్తుంది. వాళ్లు చెప్పేది విని, వాదనలకు దిగకుండా సహనంతో సమస్య పరిష్కారంపై చర్చించాలి. స్టీల్ ప్లాంటులో పనిచేసిన మహిళల్లో బహుశా నేను రెండో హెచ్‌ఓడి అనుకుంటా. నేటి తరం అమ్మాయిలు ఎక్కువ, తక్కువ ఈ గోలకు వెళ్లకుండా పని ప్రదేశంలో సమన్వయంతో ముందుకెళితే విజయంతో ప్రణాళికగా ముందుకెళ్లడం, కొత్త విషయాలపై అవగాహన పెంచుకోవడం, ఎవరి సమస్య పరిష్కరించాలో తెలిస్తే ఎలాంటి రంగమైనా నాయకత్వ స్థానంలో రాణించగలరు. ఆడపిల్లకు చదువు ఎంత ముఖ్యమో నాకు తెలుసు. అందుకే నా దృష్టికి వచ్చిన వారి చదువుకు తోడ్పాటు అందిస్తా. ఫోరం ఆఫ్ విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టారు (డబ్ల్యుఐపిఎస్)కు ఎక్కువ కాలం నాయకత్వ బాధ్యతలు చేపట్టా. దీని ద్వారా కొందరు అమ్మాయిల చదువుకునేలా చూశాను. రెవెన్యూ, వైద్యం క్రిడలు వంటి ప్రభుత్వ శాఖల్లో వాళ్లు కొలువులు సాధించారు.

## నేడు దుర్గమ్మ అలంకరణ

## బాలత్రిపుర సుందరీదేవి



"హ్రీంకారాసన గర్భితానల శిఖాం సౌః క్లీం కళాం బిభ్రతీం
సౌవర్ణాంబర ధారిణీం వరసుధాధౌతాం త్రినేత్రోజ్జ్వలం
వందే పుస్తక పాశమంకుశధరాం స్రగ్భూషితాముజ్జ్వలం
త్వాంగౌరీం త్రిపురాం పరాత్పర కళాం శ్రీచక్ర సంచారిణీమ్"

శరన్నవరాత్రి ఉత్సవాలలో మొదటి రోజు దుర్గమ్మ శ్రీ బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తుంది. బాలాదేవి మంత్రం సమస్త దేవీ మంత్రాల్లోకెల్లా మొదటిది అయిన బాలాదేవి అనుగ్రహాన్ని పొందితేనే శ్రీ ఆదిపరాశక్తి అనుగ్రహాన్ని పొందగలం. అందుకే దుర్గాదేవిని బాలాత్రిపుర సుందరదేవిగా అలంకరిస్తారు. త్రిపురుని భార్య అయిన త్రిపుర సుందరీదేవి, అంటే ఈశ్వరుడి భార్య అయిన గౌరిదేవి అని అర్థం. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం త్రిపుర సుందరీదేవి అధీనంలో ఉంటాయి. అభయహస్త ముద్రతో, అక్షమాల ధరించిన ఈమెను ఆరాధిస్తే మనోవికారాలు తొలగిపోతాయి. ఈ తల్లి నిత్యసంతోషం ప్రసాదిస్తుంది. త్రిపుర సుందరీదేవి శ్రీచక్రంలోని త్రిపురాత్రయంలో మొదటి అధిష్టాన దేవతగా భక్తులచే పూజలందు కుంటుంది. షోడశవిద్యకు ఈమే అధిష్టాన దేవతగా నిలిచివుంటుంది. అందుకే ఉపాసకులు బాలా త్రిపుర సుందరీదేవి అనుగ్రహం కోసం బాలార్చన చేస్తారు. సత్సంతానాన్ని అనుగ్రహించే దేవతగా బాలా త్రిపుర సుందరీ దేవి భక్తుల పూజలందుకుని వారిని అనుగ్రహిస్తుంది. ఈ రోజు రెండు నుంచి పదేళ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపంగా పూజచేసి కొత్త బట్టలు పెట్టాలి.

**అలంకారం:** అమ్మవారిని లేత గులాబి వర్ణంతో వున్న పట్టుచీరను అలంకరిస్తారు.

**మంత్రం:** "ఓం ఐం హ్రీం శ్రీం బాలా త్రిపుర సుందర్యైః నమోనమః" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.

**నివేదన:** అమ్మవారికి పులిహోర, రవ్వకేసరి నివేదన చేసి, త్రిశతీ పారాయణ చేయాలి.

**- భట్టిప్రోలు నటరాజ కుమార్**

## నేడు అటుకుల బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో రెండవ రోజైన అశ్వయుజ శుద్ధ పాద్యమినాడు అటుకులు పెట్టతారు. కాబట్టి అటుకుల బతకమ్మ అని పిలుస్తారు. తంగేడు, గునుగు, తదితర పూలను రెండు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు.

**ఈ రోజు నైవేద్యం :** బెల్లం, అటుకులు.

## అపరాధ భావం లేకుండా..



పసిపాపను వదిలేసి విధులకు వెళ్లాలంటే ఏ తల్లికి మనసొప్పుతుంది? ఇంట్లో వాళ్లని చూసుకునేదుకు ఎవరూ లేకపోతే ఆ ఇబ్బంది వర్ణనాతీతం. అలాగని కేర్‌టేకర్‌ని నియమించుకున్నా ఎన్నో భయాలు. మరేం చేయాలి? మీకోసం ఈ చిట్కాలు. పాప అన్నం సరిగా తిందో లేదో నిద్రపోతుందో, ఆడుకుంటుందో.. అంటూ బోలెడు సందేహాలు, అనుమానాలు వస్తుంటాయి. దీనికి బెంగ ఎందుకు? ఇంట్లో రెండు హిడెన్ కెమెరాలు, రెండు సిసి కెమెరాలను బిగించుకోండి. ఒకవేళ డేకేర్ సెంటర్‌లో వదిలి వెళ్లినా.. అక్కడా ఆ సౌకర్యం ఉందో లేదో చూసి చేర్చండి. వాటిని మీ ఫోన్‌కి అనుసంధానించుకుంటే సరి. భరోసాగా ఉంటుంది. పిల్లలు లేవకముందే గడపదాటి, వాళ్లు నిద్రపోయాక ఇంటికి చేరుకుంటున్నారా? దాంతో పిల్లల్లో అభద్రత చేరుతుంది. వాళ్లతో గడిపే సమయం లేక మీకూ బెంగగా ఉంటుంది. సెలవురోజులే కాబట్టి.. వారిని ముందే నిద్రలేపండి. మీతోపాటు ఉదయపునడకకు తీసుకెళ్లండి. రోజంతా ఎలా గడిచిందో? తన అవసరాలు, అభిప్రాయాలూ.. అడిగి తెలుసుకోండి.

వేసవి సెలవుల్లోనూ పిల్లల్ని ఇంట్లోనే వదిలి ఆఫీసుకెళ్లాల్సి వస్తోందా? ఇలాంటప్పుడు స్నేహితులు, సరదాలు లేకపోతే వారు మరిత ఇబ్బందిగా ఫీలవుతారు. వీలైతే ఏ హాబీ, క్లాసుల్లోనో చేర్చండి. ఇంట్లోనే ఉండి ఆన్‌లైన్ శిక్షణ తీసుకునేలా చేయండి. అప్పుడు మీకు కాస్త బెంగ తగ్గుతుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడూ, ఇతరత్రా అవసరాలు ఏర్పడి నప్పుడు.. ఆఫీసు నుంచి తక్కువ సమయంలోనే వారిని చేరుకునేంత దగ్గరలో ఇల్లు తీసుకోండి. ఇరుగు పొరుగుతో, స్నేహితులతో సాన్నిహిత్యం ఉన్నప్పుడు కాస్త భద్రంగానూ ఉండచ్చు.













పసుపు ముద్దతో గౌరీదేవిని చేసి.. అందమైన పూల అలంకరణ మధ్య ఉంచి.. ఆటపాటలతో అమ్మని పూజించడం దగ్గర్నుంచి తిరిగి సాగనంపడం వరకు ప్రతి ఘట్టాన్నీ ఓ వేడుకలా జరుపుకొనే పండగే బతుకమ్మ. అందమైన ప్రకృతికి అద్దం పట్టే ఈ పండుగలో గౌరీదేవిని చూడచక్కని బతుకమ్మలుగా అలంకరించడం తెలిసిందే. బతుకమ్మలేకాదు.. వాటిని తయారుచేసే పద్ధతి కూడా అందంగానే ఉంటుంది. అందమైన బతుకమ్మని తయారుచేసుకోవడానికి కావాల్సిన తంగేడు, గునుగు, గోరింట, పోకబంతి.. మొదలైన విభిన్న రకాల పూలు, గుమ్మడి లేదా సొరకాయ వంటి పెద్ద ఆకులు తెచ్చుకోవాలి. ఒక పళ్లెంలో ముందుగా గుమ్మడి ఆకుని పరిచి దాని మీద గునుగు పూలను ఒక క్రమపద్ధతిలో గుండ్రంగా అమర్చుకోవాలి. తర్వాత

## బతుకమ్మను పేర్చేద్దామిలా..

గునుగు పూల మీద తంగేడు పూలు అమర్చుకుని వాటి మీద గులాబీ రంగులో అద్ది ఆరబెట్టుకున్న ముత్యాల పువ్వుల్ని పేర్చాలి. రెండు విభిన్నమైన రంగుల్లో లభ్యమయ్యే బంతిపూలల్లో ఒక రంగు పూలను ముత్యాల పూల వరుస మీద అందంగా అమర్చుకోవాలి. బంతిపూల మీద నీలం రంగులో ముంచిన ముత్యాల పూలను మళ్లీ పేర్చాలి. ఇప్పుడు ఇంతకుముందు పేర్చుకున్న రంగు బంతులు కాకుండా వేరే రంగు బంతిపూలను పెట్టుకోవాలి. వాటి మీద అందమైన గులాబీలను పొందికగా సర్దుకోవాలి. ఇలా తయారుచేసుకున్న బతుకమ్మ మధ్యలో ఉన్న ప్రదేశంలో గౌరీదేవిని పెట్టి పైన పూలు లేదా బంగారు లేస్‌తో అందంగా అలంకరించుకోవచ్చు. తల్లి బతుకమ్మకు తోడు పిల్ల బతుకమ్మని కూడా చూడచక్కగా సిద్ధం చేసుకుని బతుకమ్మ సంబరాలన్ని ఆనందంగా మొదలు పెట్టడమే తరువాయి. ఆటకు తీసుకెళ్లే ముందు బతుకమ్మ మీద పత్తివత్తి వేసి, అంగరబత్తీలు గుచ్చి తీసుకెళ్లాలని చాలా మందికి తెలిసిన విషయమే. పూలతో బతుకమ్మని అలంకరించుకునే క్రమంలో తంగేడు, గునుగు, ముత్యాల పువ్వులతో పాటు మనకు అందుబాటులో ఉన్న పూలను కూడా ఉపయోగించుకోవచ్చు. బతుకమ్మని పేర్చే క్రమంలో కింది భాగంలో వెడల్పుగా ఉంటూ పై భాగానికి వచ్చేసరికి గోపురంలా కనిపించేలా చేసుకోవాలి. వాటి మధ్యభాగంలో మిగతా పూలరెక్కలు, ఆకులు ఉపయోగిస్తూ నింపడం వల్ల చుట్టూ అమర్చిన పూలు అటూఇటూ కదలకుండా ఉంటాయి.





## చెలి చిట్కా

★ కొత్తచీపురు ఎక్కువకాలం రావాలంటే కొంచెం నీటిలో ఉప్పువేసి వేడిచేయండి. వేడిచేసిన నీటిలో చీపురు మొదళ్లను నానబెట్టండి.

★ కోసిన ఉల్లిపాయముక్కలపై చిటికెడు సాల్ట్‌వేసి, వాటిని శనగపిండితో కలిపి పకోడీలు చేస్తే కరకర లాడుతాయి.

## శుభ్రతతో మనసుకు హాయి..

అలా ఆఫీసులోకి అడుగుపెట్టామో లేదో.. బోలెడు పని ఎదురు చూస్తుం టుంది. ఇక తుడవడం లాంటివన్నీ పెట్టుకోవాలా? అయినా మా పని కాదు. అనిపిస్తోందా! కానీ ఒత్తిడి పెంచే వాటిల్లో ఇదీ ఒకటి ఆట, కాబట్టి.. అదనపు శ్రమ అనుకోకుండా దీనిపైనా దృష్టిపెట్టండి. అందుబాటులో ఉండాలి. అని ఫైల్స్, పేపర్లు వగైరా అన్నీ పక్కన పెట్టు కుంటూ ఉంటాం. తీరా చూస్తేనేమో డెస్క్ అంతా నిండిపోయి కనిపిస్తుంది. గజిబిజి ప్రదేశం మనసునీ చిరాకు పెడుతుంది. కాబట్టి, వీటిని మార్చడం కష్టం అన్నవి మినహా మిగిలినవన్నీ తీసేయండి. సిస్టమ్ శుభ్రత క్లీనింగ్ డిపార్ట్ మెంట్‌ది అనేసుకుంటాం. బాగానే ఉంది కానీ.. పని మధ్యలో ఎప్పుడో వేళ్లను చూసుకున్న ప్పుడు మురికిగా కనిపించడం, డెస్క్ మీద చిన్నమరక లాంటివి కనిపించినప్పుడు ఏమనిపిస్తుంది? పొరపాటున ముఖం మీద పెట్టు కున్నానా అనుకోవడం, దానిమీదకే దృష్టిమళ్లడం లాంటివి జరుగుతుంటాయి కదూ! టిష్యూ, లేదా చిన్న వస్త్రాన్ని పెట్టుకోండి. రాగానే ఒకసారి తుడిచేసు కుంటే దృష్టిమళ్లదు. చాలా గుర్తుగా పెట్టాం అనుకుంటామా? తీరా అవసరానికి సొరుగులోని వస్తువులన్నీ ఎన్నిసార్లు తిరగేసినా కావాల్సిన ఫైల్ దొరకదు. ఆందోళన కమ్మేస్తుంది. ఇలా జరగొద్దంటే ఫలానా రోజు ఫలానాది అవసరం అనుకుంటూ ఒక వరస క్రమంలో పెట్టుకోండి. స్టాప్లర్, పెన్, పెన్సిల్, పిన్నులు వంటివాటిని ఒకచోట, రిఫరెన్స్ మెటీరియల్లను మరోచోట ఇలా సర్దుకోండి. ఎంత తొందరలో ఉన్నా, వాటిని అక్కడే పెట్టేలా అలవాటు చేసుకుంటే సరి. చేయమన్నారు కదా అని గంటల కొద్దీ కేటా యించొద్దు. పని పెండింగ్‌లో పడుతుంది. రోజూ రాగానే ఒసారి చూసుకుని పనిలో పడిపోవాలి. వారాంతాల్లో పూర్తయిన ఫైళ్లను తొలగించడం, అనవసరమైన వాటిని కింది డ్రాలో పెట్టడం లేదా తీసేయడం వంటివి చేస్తే చాలు. పని ప్రదేశం శుభ్రం ఉంటుంది, మనసుకీ హాయి.

## తినే తీరులో తెలుస్తుంది..



ఇంటర్వ్యూలో కూర్చునే విధానం, హావభావాలు గమనించుకోండి అని చెప్పడం విన్నారా? మాటలే కాదు. ముఖ కవళికలు మన గురించి బోలెడు విషయాలు చెప్పేస్తాయి. అయితే తినే తీరూ మన వ్యక్తిత్వాన్ని బయటపెడుతుందని తెలుసా?

◆ ఒక్కో ముద్దనీ ఆస్వాదిస్తూ నెమ్మదిగా తింటారా? పనినీ మీరలాగే నెమ్మదిగా చేస్తారన్న భావన పక్కవారిలో ఉంటుం దట. ఇక వేగంగా తినేవారు. మలీ టాస్కర్లే. చకచకా పని చేయడమే కాదు. గడువుకన్నా ముందు పని ముగిస్తారట. కాకపోతే పనిలో పడి వ్యక్తిగత జీవితాన్ని కోల్పోతారు అంటారు నిపుణులు.

◆ అన్నం మధ్యలోనే ఉండాలి. కర్రీ రంగు మారకూడదు. ఇలా ప్రతిదీ పట్టించుకునేవారు అన్నీ ప్రణాళిక ప్రకారం సాగాలి అనుకుంటారట. ఇలాంటివారు చుట్టుపక్కల ప్రదేశాన్నీ శుభ్రంగా ఉంచుకుంటారట. ఇక ఇది తినను, అది వద్దని వంకలు పెడుతోంటే మిమ్మల్ని రిస్క్ తీసుకోనివారిగానే పరిగణిస్తారు. వీళ్లెప్పుడూ ఓటమి భయంతో కొత్తవే ప్రయత్నించరట. కంఫర్ట్‌జోన్ నుంచి బయటికి రాకపోతే విజయాలెలా సాధిస్తారు మరి?

◆ కొందరు ఇంకా చిన్నపిల్లల్లానే ఎంత పెద్ద ప్లేట్ అయినా ఇవ్వనీ..చుట్టూ మెతుకులు పడాల్సిందే! కానీ వాళ్ల పక్కనుంటే సమయమే తెలియదట. పనినీ, చుట్టుపక్కల వాళ్లనీ ప్రేమిస్తారట. అయితే వీటన్నింటిలో పడి తుది గడువులు మర్చిపోవడమే వీరిలో లోపం. శబ్దం చేస్తూ తినేవాళ్లదీ వీరి తరహానే. కాకపోతే పక్కవాళ్లే కాస్త వీరిని ఇష్టపడరు. ఇక కొత్తవి ప్రయత్నించేవారు జీవితంలో సవాళ్లకు ఎదురెళతారు. రిస్క్ తీసుకుంటారు. వీరిలో మీదే తరహా?

## పనిపై శ్రద్ధ అవసరం..

మనలో చాలామందికి ఒక్కరే ఉండాలంటే బోరింగ్. చేతిలో ఫోన్.. లేకుంటే ఎవరో ఒకరు తమతో మాట్లాడుతూ ఉండాలనీ, కబుర్లు చెబుతూ ఉండాలనీ అనుకుంటుంటారు. మీరూ అలానే ఆలోచిస్తున్నారా! ఇంటిపని, ఉద్యోగం.. ఏ పనులైనా సరే పరిపూర్ణంగా చేయాలంటే ఏకాంతం, పనిపై శ్రద్ధ ఉండాలి. ఇక ఈ డిజటల్ యుగంలో మన దృష్టిని మరల్చే సాధనలే ఎక్కువ. మరి



వీటన్నింటినీ జయించా లంటే మనసు స్థిరంగా ఉంచుకోవా ల్సిందే. యూనివర్సిటీ ఆఫ్ అరిజోనా పరిశోధన ప్రకారం సృజనాత్మకంగా ఆలోచించేవాళ్లు ఒంటరిగా ఉన్నా బోర్‌గా ఫీలవకుండా, తమ ఆలోచనలపైనే దృష్టి పెడతారట. కొత్తగా ఏం చేద్దాం అని ఆలోచిస్తుంటారు. అందుకే కొవిడ్ సమయంలో పరిస్థితులు ఎక్కువమందికి ఒత్తిడి కలిగిస్తే.. వీళ్లు మాత్రం ఏ ఇబ్బంది లేకుండా ఉండగలిగారట. ఈ టెక్ ప్రపంచంలో మనతో మనం సమయం గడపగలిగీ, ఆలోచనలపై దృష్టి పెట్టగలిగితే అనుకున్న లక్ష్యాలను తేలిగ్గా సాధించగలం.

# ఆసియా కప్‌లో శ్రీలంక ఆట క్లోజ్

## ఒక్క మ్యాచ్ ఓడినా ఔట్

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 సూపర్ ఫోర్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ శ్రీలంకను నాలుగు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో, బంగ్లాదేశ్ సూపర్ ఫోర్ గెలిచిన తొలి జట్టుగా అవతరించింది. సూపర్ ఫోర్ కోసం జరిగే మ్యాచ్‌లో ఓడిన ఏ జట్టు అయినా టోర్నమెంట్ నుండి నిష్క్రమించే ప్రమాదం ఉంది. ఒకప్పుడు టైటిల్‌కు పోటీదారుగా పరిగణించబడిన శ్రీలంక ఇప్పుడు ఈ ఎలిమినేషన్ ముప్పు జట్లపై కొనసాగుతుంది. ముఖ్యంగా శ్రీలంక జట్టుకు మిగిలిన మ్యాచ్‌లు టీమిండియా మరియు పాకిస్తాన్ వంటి బలమైన జట్లతో గట్టి పోటీ ఉండటంతో సూపర్ ఫోర్‌కు గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఈ రెంటిలో ఒక్క మ్యాచ్‌లో ఓడినా శ్రీలంక ఈ టోర్నమెంట్ నుండి వైదొలగాల్సి వస్తుంది. ఇక బంగ్లాదేశ్‌తో ఓటమి పాలైన శ్రీలంక జట్టు ఈ నెల 23న పాకిస్థాన్‌తో తలపడనుంది. పాకిస్తాన్ ప్రదర్శనతో ఈ మ్యాచ్ హోరాహోరీగా ఉంటుందని భావిస్తున్నారు.



మరోపక్క,శ్రీలంక ఈ నెల 26న శుక్రవారం భారత్‌తో తలపడనుంది. శ్రీలంక జట్టు టీమ్ ఇండియా కంటే చాలా బలహీనంగా ఉంది. ఇది లంకేయులకు మరింత సవాలుగా మారింది. కాగా శ్రీలంకతో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌చేసిన శ్రీలంక168 పరుగులు చేసింది. శ్రీలంక తరఫున దాసున్ షనక 64 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆ తర్వాత సైఫ్ హసన్ 61, తౌహిద్ హ్రిదోయ్ 58 పరుగులు చేశారు. బంగ్లాదేశ్ చివరి ఓవర్‌లో ఒక బంతి మిగిలి ఉండగానే విజయం సాధించింది. ఈ పరిస్థితుల్లో శ్రీలంక సూపర్ ఫోర్‌లో ఎంత వరకూ స్థానం దక్కించుకుంటుందనేది అనుమానమే.

ముప్పును ఎదుర్కొంటోంది. ఇప్పటికే శ్రీలంక జట్టు క్లిష్టపరిస్థితుల్లో చిక్కుకుపోయింది. 169 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన శ్రీలంక జట్టు గడువుకు ఒక బంతి ముందే మ్యాచ్‌ను కోల్పోయింది. ఈ ఓటమి వారిని టోర్నమెంట్ నుండి నిష్క్రమించే ప్రమాదంలో పడేసింది. శ్రీలంకతో పాటు, సూపర్ 4లో మరో మూడు జట్లు ఉన్నాయి. అంటే ప్రతి ఓటమితో,




### స్పీడ్ స్కేట్ ఛాంపియన్‌షిప్‌లో

# ప్రపంచ ఛాంపియన్‌గా వెల్‌కుమార్

**న్యూఢిల్లీ:** ప్రపంచ స్పీడ్ స్కేట్ ఛాంపియన్‌షిప్ పురుషుల మారథాన్ స్పీడ్ స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌గా ఆనంద్ వెల్‌కుమార్ నిలిచాడు. పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన కొద్ది రోజులకే, భారత్‌కు చెందిన ఆనంద్ వెల్‌కుమార్ ఆదివారం 2025 ప్రపంచ స్పీడ్ స్కేట్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 42 కి.మీ మారథాన్ టైటిల్‌ను గెలుచుకుని తన రెండవ బంగారు పతకాన్ని సాధించాడు. రోడ్ ఈవెంట్‌లో అత్యధిక సమయం పాటు జంక్‌ను అధిగమించిన ఆనంద్ మారథాన్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచేందుకు తన కుడి కాలును ముగింపు రేఖకు అడ్డంగా పెట్టి విజయం సాధించాడు. తమిళనాడుకు చెందిన ఈ యువకుడు గత వారం 500 మీటర్ల+డి స్ప్రింట్‌లో కాంస్య పతకాన్ని సాధించడం ద్వారా ప్రపంచ స్పీడ్ స్కేట్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి పతకాన్ని గెలుచుకున్నాడు. ఆ తర్వాత ఆనంద్ పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్‌లో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు, పురుషుల మారథాన్ టైటిల్‌ను గెలుచుకునే ముందు స్కేటింగ్‌లో భారతదేశపు మొట్టమొదటి ప్రపంచ ఛాంపియన్‌గా గుర్తింపు పొందాడు.

### ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..

# ముగిసిన భారత్ గ్రీకో-రోమన్ ఆశలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత గ్రీకో-రోమన్ రెజ్లింగ్ జట్టు నిరాశపరిచింది. ముగ్గురు పురుష రెజ్లర్లు ముందుగానే నిష్క్రమించి, రిపేషేజ్‌కు అవకాశం లేకుండా పోయారు. ఆదివారం జరిగిన 63 కిలోల విభాగంలో, సన్నీ కుమార్ అర్హత రౌండ్‌లో 1-3 తేడాతో ఇరాన్‌కు చెందిన అరెఫ్ హోస్సేన్‌ఖౌన్ మొహమ్మది చేతిలో ఓడిపోయాడు. సెమీఫైనల్‌కు ముందే అరెఫ్ హోస్సేన్‌ఖౌన్ మొహమ్మది నిష్క్రమించాడు. దీనితో కుమార్‌కు రిపేషేజ్ అవకాశం లేకుండా పోయింది. అలాగే 67 కిలోల కేటగిరీ రౌండ్ ఆఫ్ 32లో, అనిల్ ఖతార్‌కు చెందిన గాగిక్ ఎం స్నజోయన్ చేతిలో 0-7 తేడాతో ఓడిపోయి అతను కూడా ముందుకు సాగలేకపోయాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో



కరణ్ కాంబోజ్ (87 కిలోలు) అమెరికన్ పేటన్ జాకబ్సన్ చేతిలో 0-8 తేడాతో పరాజయం చెందాడు. జాకబ్సన్ ఫైనల్స్‌కు చేరుకోకపోవడంతో, కాంబోజ్‌కు రెండవ అవకాశం పోయింది. ఇక 97 కిలోల విభాగంలో, నితేష్ రెపిచేజ్ రౌండ్‌లో పోరాడాడు కానీ జార్జియాకు చెందిన జార్జి మెలియా చేతిలో 4-5 తేడాతో ఓడిపోయి ప్రచారాన్ని ముగించాడు. అంతకుముందు, సూరజ్ వశిష్ట్ (60 కిలోలు) క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం ద్వారా ఆశాజనకంగా ఉన్నా కానీ భారత్‌కు చెందిన మిగిలిన పురుష రెజ్లర్లు వారి మ్యాచ్‌లను సద్వినియోగం చేసుకోలేకపోయారు. దీంతో ఈ ఏడాది ఛాంపియన్‌షిప్‌లో 53 కిలోల విభాగంలో దేశానికి ఏకైక కాంస్య పతకాన్ని అందించిన మహిళగా ఆంటిమ్ పంఘల్ నిలిచింది.

# బిల్లీ జీన్ కింగ్ కప్‌లో ఫైనల్స్‌కు పెగులా, నవారో

**న్యూఢిల్లీ:** గ్రేట్ బ్రిటన్‌పై జెస్సికా పెగులా, ఎమ్మా నవారో సాధించిన పునరాగమన విజయాలు, 2018 తర్వాత షెన్‌జెన్‌లో జరిగిన బిల్లీ జీన్ కింగ్ కప్ ఫైనల్‌కు అమెరికాను పంపాయి. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నవారో 3-6, 6-4, 6-3 తేడాతో సోనాయ్ కార్తాల్‌పై గట్టి పోటీతో ప్రారంభం కాగా, పెగులా కేటీ బౌల్టర్‌పై 3-6, 6-4, 6-2 తేడాతో విజయం సాధించి అమెరికన్లకు టైను ఖరారు చేసింది. ఈ విజయంతో యుఎస్ఎ రికార్డు స్థాయిలో 31వ సారి తీరిరీ కప్ ఫైనల్‌కు చేరుకుంది. ఏడో ర్యాంక్‌లో ఉన్న పెగులా, 18వ ర్యాంక్‌లో ఉన్న నవారో వారి వారి సింగిల్స్ మ్యాచ్‌లలో భారీ ఫేవరెట్‌లుగా పరిగణించబడ్డారు. ఇక ప్రపంచ ర్యాంక్‌లో 55వ స్థానంలో ఉన్న బౌల్టర్, బిజెకె కప్ సింగిల్స్ మ్యాచ్‌లలో 146 విజయ, ఓటముల రికార్డును, మరియు పెగులాపై 10 హెడ్‌టుహెడ్ రికార్డును కలిగి ఉంది. 29 ఏళ్ల బ్రిటన్ అద్భుతమైన ఆరంభాన్ని ప్రారంభించి పెగులాపై రెండుసార్లు 36 నిమిషాల్లో ఒక సెట్ ఆధిక్యాన్ని సంపాదించింది. ఈ జంట సెకనులో బ్రేక్‌లు ఇచ్చిపుచ్చుకున్నారు,



తర్వాత పెగులా మరో ఆధిక్యాన్ని సాధించి మ్యాచ్‌ను సమం చేసింది. బౌల్టర్ దోషాల సంఖ్య పెరగడంతో, పెగులా 5-2తో ఆధిక్యంలోకి వెళ్లి సెమీఫైనల్‌ను నిర్ణయాత్మకంగా మార్చుకుని కేవలం రెండు గంటల్లోనే ముగించింది. మొదటి సెట్‌లో ఐదు సర్వ్ బ్రేక్‌లు వచ్చినా 37 నిమిషాల్లోనే ఒక సెట్ ఆధిక్యాన్ని సాధించడంతో కార్తాల్ తన ప్రయోజనాన్ని పదిలం చేసుకోగలిగింది.

# లావర్ కప్‌లో అల్కరాజ్ సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** లావర్ కప్ 2025లో అల్కరాజ్ సంచలన ఓటమి చెందాడు. ప్రపంచంలో ఐదవ ర్యాంక్‌లో ఉన్న ఫ్రిట్జ్, ఈ సంవత్సరం వింబుల్డన్‌లో జరిగిన సెమీఫైనల్స్‌తో సహా మునుపటి మూడు పరాజయాల తర్వాత స్పానిష్ సూపర్ స్టార్‌పై ఆదివారం తన తొలి విజయాన్ని సాధించాడు. లావర్ కప్‌లో నాలుగు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేయడంతో, అమెరికన్ టేలర్ ఫ్రిట్జ్ 6-3, 6-2 తేడాతో ప్రపంచ నంబర్ వన్ కార్లోస్ అల్కరాజ్‌ను ఓడించి ప్రపంచ టెన్నిస్ ఈవెంట్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. మొదటి సెట్‌లో ఒకసారి, రెండవ సెట్‌లో రెండుసార్లు అల్కరాజ్‌ను బ్రేక్ చేసి, అతను ఎదుర్కొన్న రెండు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు. ఇక ఆస్ట్రేలియన్ అలెక్స్ డి మినార్, అర్జెంటీనాకు చెందిన ఫ్రాన్సిస్కో సెరుండోలో సింగిల్స్ విజయాలను జోడించారు. అలాగే డి మినార్ అలెక్స్ మిచెల్సెన్‌తో జతకట్టి డబుల్స్‌ను గెలుచుకున్నాడు, కెప్టెన్ ఆండ్రీ అగస్సీ జట్టు టీమ్ యూరప్‌పై 9-3 ఆధిక్యాన్ని అందించాడు. ఈ మ్యాచ్‌లో రెండు పాయింట్ల విలువైన విజయాలతో, టీమ్ వరల్డ్ ఆస్ట్రేలియన్ డి మినౌర్ 6-1, 6-4 తేడాతో ప్రపంచ మూడో నంబర్ జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై విజయం సాధించడంతో సమం చేసింది. ఆ తర్వాత అర్జెంటీనాకు చెందిన సెరుండోలో డెన్మార్క్‌కు చెందిన హోల్గర్ రూన్‌ను 6-3, 7-6(5)తో ఓడించాడు.



# చైనా మాస్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ ఓటమి

**న్యూఢిల్లీ:** 2025 చైనా మాస్టర్స్‌లో భారత పురుషుల డబుల్స్ జోడీ రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ ఈ సీజన్‌లో రెండోసారి ఓటమి చెంది రన్నరప్‌తో సరిపెట్టారు. ఆదివారం షెన్‌జెన్ అరీనాలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రపంచ 7వ ర్యాంక్‌లో ఉన్న సాత్విక్-చిరాగ్ ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్, టాప్‌సీడ్ కొరియా జంట కిమ్ వాన్ హో-సియో సుంగ్ జే చేతిలో 45 నిమిషాల్లో 19-21, 15-21 తేడాతో ఓడిపోయింది. తొలి గేమ్‌లో భారత జట్టు బలంగా ఆడటంతో 14-7తో ఆధిక్యంలో ఉంది. ఆ తర్వాత కొరియన్లు వరుసగా ఐదు పాయింట్లు గెలుచుకుని స్కోరును 15తో సమం చేశారు. సాత్విక్-చిరాగ్ జంట కీలక సమయాల్లో నిలదొక్కుకోవడానికి ఇబ్బంది పడింది. రెండవ గేమ్‌లో, భారత జట్టు 8-6తో ఆధిక్యంలో బలంగా ఆడింది. కానీ కొరియన్లు స్థిరంగా ఉండి త్వరగా వారిపై నియంత్రణ సాధించి స్థిరమైన ఆటతో మ్యాచ్‌ను ముగించగలిగారు. భారత జంట సాత్విక్-చిరాగ్ ఇప్పుడు 16 నెలలుగా టైటిల్ లేకుండా ఉన్నారు. వారి చివరి టైటిల్ మే 2024లో థాయిలాండ్ ఓపెన్‌లో వచ్చింది.






# ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.7945 కోట్లు వెనక్కి!

**న్యూఢిల్లీ,** సెప్టెంబరు 21: విదేశీ ఇన్వెస్టర్లు భారత ఈక్విటీ మార్కెట్లనుంచి సెప్టెంబరులో 7945కోట్ల నిధులు విత్‌డ్రాచేసారు. అమెరికా సుంకాలతోపాటు భౌగోళిక ఉద్రిక్తతలు కూడా ఇందుకు కొతకారణం అయ్యాయి. ఆగస్టులో 34,990 కోట్లు, జులైలో 17,700 కోట్లు కూడా ఇలాగే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు విత్‌డ్రాచేయడం గమనార్హం. 2025లో ఇప్పటివరకూ ఎఫ్‌పిఐలు 1.38 లక్షలకోట్ల రూపాయల నిధులు విత్‌డ్రా అయ్యాయని దీనివల్లనే మార్కెట్లలలో అనిశ్చితిపెరిగిందని ట్రేడర్ల అంచనా. రానున్న స్థూల ఆర్థిక గణాంకాలు, అమెరికా,భారత్‌లనుంచి వచ్చేవే ఈవారంలోప్రభావితంచేస్తాయని అంచనా. రానున్న వారాల్లో ఎఫ్‌పిఐలు పెరగాలంటే అమెరికా వైఖరి ముందు పరిగణనలోనికి తీసుకుంటారు. అమెరికా ఫెడ్‌రిజర్వు 25 బేసిస్ పాయింట్లు కోత విధించడంతో విదేశీ ఇన్వెస్టర్లు భారత్ మార్కెట్లలో 900 కోట్లవరకూ పెట్టుబడులుపెట్టారు. అంతేకాకుండా ఫెడ్‌రిజర్వు 2025లో మరో రెండుసార్లు ఫండ్‌రేట్లు తగ్గించవచ్చన్న సంకేతాలివ్వడంతో ఇన్వెస్టర్లంతా ఈక్విటీలు, పసిడిమార్కెట్ల బాటపట్టారు. అయినా కూడా ఇన్వెస్టర్లు ఎక్కువగా సెప్టెంబరు విక్రేతలుగానే నిఇచారు. అలాగే డెట్‌మార్కెట్లలో పెట్టుబడులు 900 కోట్లవరకూ వచ్చాయి. సాధారణ పరిమితి 1100 కోట్లవరకూ ఉన్నది. స్వచ్ఛంద రిటెన్షన్‌రూటులోనే ఈ మొత్తం పెట్టుబడులు పెట్టుకోవచ్చు.

### పండుగ ఆఫర్లు, జిఎస్టీ మార్పులతో

# ధరలు తగ్గిన టివిలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** కొత్త జీఎస్టీ శ్లాబులు 22నుంచి అమలులోకి వస్తుండటంతో జిఎస్టీ తగ్గింపుప్రయోజనాలు కస్టమర్లకు కంపెనీలు బదలీచేస్తున్నాయి. టెలివిజన్ తయారీదారులు టివిలపై రూ.2500 నుంచి రూ.85వేలవరకూ కూడా తగ్గింపును ప్రకటించారు. కస్టమర్లకు పండగ సీజన్ ఆఫర్లతోపాటు జిఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు కూడా లభిస్తున్నాయి. 32 అంగుళాలపైబడిన టివిలపై జిఎస్టీ రేటు 28 నుంచి 18శాతంకు వచ్చింది. స్క్రీన్‌సైజులు, ఫీచర్ల ఆధారంగా ధరలు తగ్గుతాయని ఉత్పత్తిసంస్థలు చెపుతున్నాయి. సోనీ, ఎల్జీ, పానాసోనిక్ వంటి అగ్రటివి బ్రాండ్లు 22నుంచి వచ్చే కొత్తధరల పరిధిలోనే విక్రయిసానతమని చెప్పాయి.సౌండ్ బార్లు, పార్టీ స్పీకర్ల అమ్మకాలు కూడా గణనీయంగాపెరుగుతాయని అంచనా. సోని టీవి 43నుంచి 98 అంగుళాలవరకూ ఉన్న బ్రావియా మోడళ్లు రూ.5వేలనుంచి రూ.71వేలవరకూ తగ్గుతోంది. 98 అంగుళాల టాప్ ఎండి రేటు రూ.9 లక్షలనుంచి రూ.8.29 లక్షలవరకూ తగ్గుతుంది. ఎల్జీ రేట్లు కూడా రూ.2,500నుంచి రూ.8500వరకూ తగ్గుతున్నాయి. ఇక పానాసోనిక్ టివిలు 43 అంగుళాల మోడళ్లపై రూ.3వేలనుంచి రూ.4700వరకూ ఉంది. 55 అంగుళాల మోడళ్లు ఏడువేలు తగ్గించింది. 65 అంగుళాలపై రూ.3.20 లక్షలవరకూ తగ్గింపుఉంది. 75 అంగుళాల టివిధర రూ.4 లక్షలనుంచి రూ.3.68 లక్షలవరకూ ఉన్నట్లు ప్రకటించాయి.



# మెట్రోనగరాల్లో 4% తగ్గిన హౌసింగ్‌సేల్స్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్‌లోని తొమ్మిదిప్రధాన నగరాల్లో జులై సెప్టెంబరు త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు నాలుగు శాతం పడిపోయాయి. ఈ త్రైమాసికంలో 1,00,370యూనిట్లు మాత్రమే విక్రయించినట్లు డేటా చెపుతోంది. ఎన్ఎస్ఇ జాబితా అయిన రియల్ ఎస్టేట్ ప్రాప్ ఈక్విటీసంస్థచేసిన సర్వేలప్రకారం వరుసగా పదో త్రైమాసికంలో కూడా ఇళ్ల అమ్మకాలు తగ్గినట్లు తేలింది. కొత్తగా ప్రారంభించిన వెంచర్లుకూడా స్థిరంగా ఉన్నాయి. 92,229 యూనిట్లు ప్రారంభించినట్లు తేలింది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 10శాతం క్షీణించాయి.మహారాష్ట్ర వెనకబడి ఉంటే, దక్షిణాది నగరాల్లో మాత్రం పెరుగుతున్నాయి. ముంబయి, నవీ ముంబ,ఇ థాణె, పూణె, నగరాల్లో ఆరునుంచి 28శాతం వరకూ పడిపోయాయి.

పూణెలో అత్యధిక మార్కెట్ ఉంటుంది. 17,762యూనిట్లు విక్రయించినా గత ఏడాదితోపోలిస్తే 16శాతం క్షీణించాయి. బెంగళూరులో అయితే 21శాతం పెరిగి 16,840 యూనిట్లువిక్రయిస్తే చెన్నైలో కూడా 16శాంపెరిగి 5406 యూనిట్లు విక్రయించారు. కోల్‌కత్తాలో 25శాతం పెరిగి 4732 యూనిట్లు విక్రయిస్తే ఢిల్లీ ఎన్సీఆర్ హైదరాబాద్ నగరాల్లోకూడా నాలుగుశాతంచొప్పున పెరిగాయి. తొమ్మిదినగరాల్లోను సగటున ఒకటిశాతం తక్కువకాకుండా క్షీణించాయి. ఢిల్లీ ఎన్సీఆర్‌ప్రాంతంలో అయితే 24శాతం క్షీణత ఉంది. థాణెలో 11శాతం క్షీణత నమోదుచేసింది. ఇక బెంగళూరు, హైదరాబాద్, ముంబయి నగరాల్లోమాత్రం స్వల్పంగా ఇళ్ల విక్రయాలుపెరిగాయి. కొత్త ప్రాజెక్టులు లాంచ్ అయినా కూడా డిమాండ్ మందగమనంతోనే ఉంది. బెంగళూరు మొత్తంప్రాజెక్టుల్లో ఐదో వంతు ప్రారంభం అయితే పదిశాతం క్షీణించింది. చెన్నై, నవీముంబయి, పూణె, కోల్‌కత్తాల్లో కొంతమేర పెరుగుదల ఉంది. హైదరాబాద్,ముంబయి, థాణె, ఢిల్లీ ఎన్సీఆర్‌లలో మాత్రం క్షీణించాయి. త్రైమాసికం వారీగాచూస్తే డిమాండ్‌కు తగినట్లు సరఫరా లేదు. పదిశాతం క్షీణత ఉంది. ప్రాప్ ఈక్విటీసంస్థ సిఇఒ సమీర్ జాసూజా మాట్లాడుతూ కొత్త ప్రాజెక్టులకంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. 2025లో నాలుగు లక్షలయూనిట్లు ప్రారంభం కావచ్చని, సుమారుగా 4.5 లక్షల యూనిట్లు విక్రయించవచ్చని చెపుతున్నా ఆస్థాయికి చేరలేదు. పండుగసీజన్‌లో కొంతమేర డిమాండ్ పెరగవచ్చని చెపుతున్నారు.

### అణువిద్యుత్ ప్రాజెక్టుల కోసం

# ఎన్టీపిసి 'యురేనియం'పై ఫోకస్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్ ఇంధన దిగ్గజం ఎన్టీపీసి విదేశాల్లోని యురేనియం ఆస్తులు కొనుగోలుకు ఆసక్తిచూపిస్తోంది. భవిష్యత్తు అణు ఇంధన ప్రాజెక్టులకోసం యురేనియంను సేకరించుకోవాలని నిర్ణయించింది. 1975లోనే ఎన్టీపీసి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థగా వచ్చిన ఈ కంపెనీ కొత్త తరం ఇంధన ఉత్పత్తులకోసం ప్రాజెక్టులు అమలుచేస్తోంది. కంపెనీకి ప్రస్తుతం 83,026 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. వీటికి బొగ్గు, ద్రవరూపింధనం, హైడ్రో, సోలార్ వనరులు ఉన్నాయని ఎన్టీపీసీ వెల్లడించింది. శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్ ఉత్పత్తికోసం కంపెనీ అణువిద్యుత్‌ప్రాజెక్టులను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలనిచూస్తోంది. ఇందుకోసం యురేనియం ఆస్తులు కొనుగోలుచేసేందుకునిర్ణయించింది. ఇప్పటికే యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒడంబడిక చేసుకున్నది. టెక్నో కమర్షియల్ సహకారంతో విదేశాల్లో నియురేనియం నిల్వలుకొనుగోలుకు యత్నిస్తోంది. ఎన్టీపీసి ఈ వనరులు సేకరించిన వెంటనే అణుశక్తి విద్యుత్ నిగమ్ అశ్విని ఏర్పాటుచేసి 2800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతుంది. మహి బన్స్వారా న్యూక్లియర్‌ప్రాజెక్టును రాజస్థాన్‌లో నిరినమంచనున్నది. ఎన్‌పిసిఐఎల్‌తో జాయింట్ వెంచర్‌లో 51శాతం వాటా ఎన్‌పిసిఐఎల్, ఎన్టీపీసి 49శాతం వాటాలతో పనిచేస్తాయి. బిల్డ్ ఓన్‌ఆపరేట్ పద్ధతిలో భారత్‌లో అణు ఇంధన ప్రాజెక్టులు నిర్మించున్నాయి. ఎన్టీపీసి తన అనుబంధంగా ఉన్న ఎన్టీపీసీ పరమాణు ఊర్జానిగమ్ సంస్థ ద్వారా స్వతంత్ర ప్రాజెక్టులు ఏర్పాటుచేసేందుకు నిర్ణయించింది. అమెరికా కేంద్రంగా ఉన్న క్లీన్‌కోర్ థోరియమ్ ఎనర్జీ అనీల్‌బేస్డ్ ఇంధనం ఉత్పత్తికి భారత్‌కువస్తోంది. ప్రభుత్వానికి 100 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని 2047 నాటికిచేరుకోవాలని లక్ష్యంగా ఉంది. మార్చి నాటికి 475,212 మెగావాట్లు ఇంధన సామర్థ్యం ఏర్పాటుచేసుకుంది. అణువిద్యుత్‌లో 8180 మెగావాట్లుగా ఉన్నట్లు ఎన్టీపీసి వివరించింది.



# ఐదేళ్లలో 8800 కోట్లకు టర్నోవర్ వృద్ధి

### అర్బన్‌భారత్‌లో ఆన్‌లైన్ హోంసర్వీసెస్‌కు డిమాండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత్ ఆన్‌లైన్ హోంసర్వీసెస్ మార్కెట్ సమిష్టిగా 18 నుంచి 22శాతం వృద్ధిని సాధిస్తుందని, 2030 నాటికి 8800 కోట్లకు చేరుతుందని సర్వేల్లో తేలింది. క్విక్ కామర్స్ వృద్ధిచెందుతున్న తరుణంలో ఇన్‌స్టంట్‌హోం సర్వీసెస్ అనేది ప్రస్తుతం ఎక్కువగాప్రాచుర్యంలోకి వచ్చింది. ఇండియా డిజిటల్ ఆర్థికవ్యవస్థలో ప్రధాన వనరుగా మారుతోంది. అర్బన్ కన్సూమర్లు ఎక్కువగా ఆన్‌లైన్‌హోమ్ సేవలనే కోరుకుంటున్నట్లు కన్సల్టెంట్ సంస్థ రెడ్‌సీర్ వెల్లడించింది. భారత్‌లో ప్రస్తుతం హోం సర్వీసెస్ మార్కెట్ విలువలు రూ.5.1 నుంచి 5.21 లక్షలకోట్లుగా ఉందని అసంఘటిత రంగం ఇప్పటికీ ఈ రంగాన్ని డామినేట్‌చేస్తున్నట్లు అంచనా.కస్టమర్లు ఎక్కువగా సౌలభ్యం, నమ్మకం, విశ్వసనీయత, బాధ్యతాయుత వైఖరిపట్ల ఆకర్షితులవుతున్నట్లు తెలుస్తోంది. భారత్‌లోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 85 నుంచి 90శాతం ఆన్‌లైన్ హోం సర్వీసెస్ వృద్ధిచెందాయి. కొవిడ్ వ్యాప్తి తర్వాత పట్టణీకరణ శరవేగంగా మార్పులు చెందుతోంది. దీనితోడు అర్బన్‌ప్రాంతాల వినియోగదారుల ఆలోచనా దృక్పథం కూడా మారుతూ వస్తోంది. కాలనుగతంగా వస్తున్న వేగవంతమైన మార్పులవల్ల పట్టణాల్లో తమ అవసరాలకు ఎక్కువగా కుటుంబీకులు ఆన్‌లైన్ సేవలపైనే ఆధారపడుతున్నారు. క్షణాల్లో ముందుకురావడం అప్పటికప్పుడు పనులుపూర్తిచేసి సేవలకు రుసుం వసూలుచేసుకని వెళ్లడంజరుగుతోంది. తమకు పూర్తిస్థాయిలో అవసరాలు తీరుతుండటంతో ఆన్‌లైన్ హోంసర్వీసెస్‌కే ఎక్కువ డిమాండ్ లభిస్తున్నట్లు తేలింది. విశ్వసనీయత, బాధ్యాతా యుత వైఖరిపై రాజీలేని వైఖరివల్లనే ఆన్‌లైన్‌హోం సర్వీసులకు మెట్రోనగరాల్లో భారీ డిమాండ్ ఉందని రెడ్‌సీర్ పార్టనర్ రోహల్ అగర్వాల్ తెలిపారు.

# జిఎస్టీ సవరణలతో తగ్గుతున్న ఎసిల ధరలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** జీఎస్టీ హేతుబద్ధీకరణచేసి రెండు శ్లాబులుగా చేసిన నిర్ణయాలు 22వ తేదీనుంచి అమలులోకి వస్తుండటంతో ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషర్లు కొనాలనుకునేవారికి పండగ రాయితీలతోపాటు జిఎస్టీ తగ్గింపుప్రయోజనమూ కలిసి రానుంది. ఎసీలమీద సగటున రూ.4500 వరకూ డిష్ వాషర్లపై రూ.8వేలవరకూ ధరలు తగ్గుతాయి. వోల్టాస్, డైకిన్, గోద్రెజ్ అప్లయెన్సెస్, పానసోనిక్, హైయర్ తదితరసంస్థలు కొత్తధరలను ప్రకటించాయికూడా. కొత్తధరలతోనే డీలర్లవద్ద బుక్‌చేసుకోవచ్చని చెపుతున్నాయి. ఎసీలతోపాటు ఇతర ఉపకరణాలపైనీ జీఎస్టీ తగ్గింపుతోకూడినధరలు అమలులోకి వస్తాయి. గోద్రెజ్ టవర్ ఎసిల ఎంఆర్‌పి రూ.8550నుంచి 12,450వరకూ తగ్గిస్తోంది. హైయర్‌కూడా కొన్ని రకాల మోడళ్లపై రూ.3905 తగ్గిస్తోంది. వోల్టాస్ ఫిక్స్‌డ్ విండోఎసి ఎంఆర్‌పిని రూ.42,990 నుంచి రూ.39,590గాచేసింది ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వన్‌టన్ 3స్టార్ ఎసి ధరలు రూ.2800 మేరకు తగ్గుతున్నాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.